


- 'నాడు' కందకం తవ్వి హెచ్చరిక బోర్డు పెట్టిన అదే దుండిగల్ రెవెన్యూ..
- 'నేడు' పట్టా భూమిగా హద్దులు..! నిర్ధారించింది దుండిగల్ అధికారులే..
- సర్వే నెం.131 ప్రభుత్వ భూమిలో రెవెన్యూ లెక్కల గజిబిజి.. ఎవరి లెక్క ఎంత..?

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్

# రూ.15 కోట్ల సర్కారు భూమి...

# కథలో కొత్త ట్విస్ట్..!

- అది ప్రభుత్వ భూమి కాదు పట్టా భూమే..! అంటున్న ప్రస్తుత తహశీల్దార్..
- అప్పటి(2023 నాటి) తహశీల్దార్ సర్వే తప్పు అంటున్న రాజేశ్వర్ రెడ్డి..?
- బహదూర్‌పల్లి సర్వే నెం.131 ప్రభుత్వ భూమిలో మారుతున్న భూ స్వరూపం..
- అక్రమంగా కట్టబెట్టారని.. వ్యవసాయం చేసిన అసైనీ కుటుంబం ఆవేదన..
- సోమవారం కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్టు తుడుము వినోద్ వెల్లడి.

## 2023లో కూల్చిన చోటే..! 2026లో 'పట్టాభూమి'గా సర్టిఫికెట్..?

- డిఐ సర్వేకు ఆదేశిస్తామని చెబుతున్న మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్..!
- అయినప్పటికీ ప్రభుత్వ భూమిలో శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు..
- నాటి సర్వేయర్ చేతివాటమా..? నేటి సర్వేయర్ సర్వే మహత్యమా..?
- దారిలేని రెండెకరాల పట్టాభూమికి.. ప్రభుత్వ భూమినే రోడ్డుగా మార్చారా..?

- బహుదూర్‌పల్లి సర్వే నెం.131 పై అధికారుల కొత్త భాష్యం ..!
- మరి అప్పటి తహసిల్దార్‌పై చర్యలు తీసుకుంటారా..? లేవనెత్తుతున్న ప్రశ్నలు..!
- నాడు సర్కారు భూమి.. నేడు పట్టా భూమి..! బహదూర్‌పల్లిలో సర్వేల సర్కస్..!
- సర్కారు భూమికి పట్టా రంగు..? 2023లో కూల్చివేసింది దేనికి..?
- నేడు పట్టాభూమంటూ కొత్త సర్వే..! ఒకే భూమిలో రెండు సర్వేలు..!
- సర్వే మారింది.. భూమి రాత మారింది..!
- బహదూర్‌పల్లి 131- 133గా మారిందా..?
- ఇద్దరు తహశీల్దార్‌ల నేతృత్వంలో పొంతన లేని సర్వేల మాయాజాలం..
- అదనపు కలెక్టర్-ఆర్డీవో దృష్టికి తీసుకెళ్ళినా మౌనం, చర్యలు శూన్యం..!

-4లో




2023 మార్చి 9న రెవెన్యూ కూల్చివేత..(ఫైల్‌ఫోటో)



నాడు కూల్చిన చోటే.. ప్రస్తుతం శరవేగంగా రోడ్డు, డ్రైనేజీ పనులు..

## రూ.4 లక్షల లంచం.. ఏసీబీకి చిక్కిన

# టౌన్‌ప్లానింగ్ అధికారిణి

**హైదరాబాద్ పెన్ పవర్:** జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారిణి తులసీరామ్ సునీత ఏసీబీ అధికారుల చేతికి చిక్కారు. రూ. 4లక్షల లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మెహదీపట్నం జీహెచ్ఎంసీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె.. ఖైరతాబాద్ జోన్ కార్యాలయం బయట లంచం తీసుకొని, తన కారులో పెట్టించుకుంటుండగా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.





Press Note No. 149 Date: 05.10.2026

TOWN PLANNING SUPERVISOR O/o THE GHMC, GOLKONDA ZONE, CIRCLE-33, MEHDIPATNAM, HYDERABAD IS IN ACB NET

On 05-10-2026, the Accused Officer, Smt. Tulasiram Sunitha, Town Planning Supervisor, O/o The GHMC, Golkonda Zone, Circle No. 33, Mehdipatnam, Hyderabad, was caught red-handed by the ACB officials of City Range-I when she demanded bribe amount of Rs. 8 lakhs and accepted the part payment of Rs. 4 lakhs from the complainant for doing an official favour, i.e. to ignore the Speaking Orders issued by the Deputy Commissioner, GHMC, to allow the complainant to proceed with the building construction, not to cause any further harassment to the complainant, and to extend cooperation in future.

The tainted bribe amount of Rs. 4,00,000/- was recovered from the possession of the Accused Officer (AO). In addition to the bribe amount, an amount of Rs. 2,50,000/- in unaccounted cash was also found in the possession of the AO and the same was recovered and seized. Thus, the AO performed her duty improperly and dishonestly to obtain undue advantage.

Therefore, the AO is being produced before the Hon'ble I Addl. Special Judge for SPE & ACB cases, Nampally for judicial remand. The case is under investigation. The details of complainant are withheld for security reasons.

CELL PHONE NUMBER -1064 (TOLL FREE NUMBER):

In case of demand of bribe by any Public Servant, the public are requested to contact Toll Free Number of ACB i.e., 1064 for taking action as per Law. ACB Telangana can also be contacted through social media platforms whatsapp (9440446106), facebook (Telangana ACB), X/formerly twitter (@Telangana ACB). The QR Code of ACB is displayed in all Government offices and prominent public to contact ACB, Telangana. The name and details of the victim/complainant will be kept secret.

P.R.O.
Ant-Corruption Bureau,
Telangana, Hyderabad.

డిప్యూటీ కమిషనర్ జారీ చేసిన ఆదేశాలను పట్టించుకోకుండా నిర్మాణానికి అనుమతిచ్చేందుకు సునీత రూ. 8 లక్షలు డిమాండ్ చేశారు. భవిష్యత్‌లోనూ సహకరిస్తానని నిర్మాణదారుకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు బాధితుడు ఏసీబీకి సమాచారం ఇవ్వడంతో.. అధికారులు పక్కా ప్లాన్ ప్రకారం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. లంచం కాకుండా అదనంగా సునీత వద్ద లెక్కల్లో చూపని రూ. 2.50 లక్షల నగదును అధికారులు గుర్తించారు. మొత్తం రూ. 6.5 లక్షలు స్వాధీనం చేసుకొని, ఆమెను అరెస్టు చేశారు. ఆమె నివాసంలో డీఎస్పీ మాజిద్ అలీఖాన్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి.

## ఫిజియోథెరపీ సెంటర్ రీ-ఓపెన్‌కు లక్ష లంచం..

## ఏసీబీకి అడ్డంగా దొరికిన రంగారెడ్డి డీఎంహెచ్ వో

**హైదరాబాద్ పెన్ పవర్:** లంచం తీసుకుంటూ రంగారెడ్డి డీఎంహెచ్ వో స్వర్ణకుమారి ఏసీబీకి అడ్డంగా దొరికారు. శివరాంపల్లిలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ప్రైవేట్ ఆసుపత్రికి సంబంధించిన వ్యవహారంలో లక్ష లంచం తీసుకుంటున్న సమయంలో ఏసీబీ అధికారులు డీఎంహెచ్ వోను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ ఘటనలో ఆమెతో పాటు శ్రీనివాస్ అనే అధికారిని ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.




ఎల్బీనగర్‌లో ఫిజియోథెరపీ సెంటర్‌ను తిరిగి తెరవడానికి అనుమతి ఇవ్వాలంటే స్వర్ణకుమారి రూ. 2 లక్షలు లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందులో భాగంగా బాధితుడి నుంచి రూ.లక్ష తీసుకున్నట్లు సమాచారం. ఎల్బీనగర్ వద్ద ఈ మొత్తాన్ని స్వీకరించినట్లు తెలుస్తోంది. బాధితుడి నుంచి డబ్బులు తీసుకున్న అనంతరం ఆ విషయాన్ని డీఎంహెచ్‌ఓకు ఫోన్ ద్వారా సహాయకుడు శ్రీనివాస్ తెలిపినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో డీఎంహెచ్‌ఓ స్వర్ణకుమారితో పాటు శ్రీనివాస్, ఓ ప్రైవేట్ డ్రైవర్‌ను కూడా ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. డీఎంహెచ్‌ఓ స్వర్ణకుమారి రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో ఉన్న సమయంలో ఏసీబీ అధికారులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఆమెను శివరాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు.



Press Note No. 148 Date: 05.10.2026

DISTRICT MEDICAL HEALTH OFFICER (DM&HO), HEALTH INSPECTOR O/o THE DM&HO, RANGAREDDY DISRTICT &ONE PRIVATE PERSON IN ACB NET

On 05-10-2026, on the instructions of the (AO-1) Smt. Swarna Kumari, DM&HO, Ranga Reddy District & (AO-2) Sri. M. Srinivas, Health Inspector both are O/o the DM&HO, Rangareddy district, the accused (A-3) Sri. Maddurikrishnaiah, Private Driver of AO-2 demanded an amount of Rs. 2,00,000/- and accepted the bribe amount of Rs.1,00,000/- from the complainant for doing official i.e. as a reward for returning the keys of the seized physiotherapy centre of the complainant, and as an undue advantage for not taking any further action against the centre for operating without a DM&HO licence, and also for issuing a new DM&HO licence for the said physiotherapy centre.

The bribe amount of Rs.1,00,000/- was recovered from the possession of A3 at his instance. Thus, the Accused Officers AO-1 & AO-2 performed their duty improperly and dishonestly to obtain undue advantage.

Therefore, the AO-1, AO-2 & A-3 are being produced before the Hon'ble I Addl. Special Judge for SPE & ACB cases, Nampally for judicial remand. The case is under investigation. The details of complainant are withheld for security reasons.

CELL PHONE NUMBER -1064 (TOLL FREE NUMBER):

In case of demand of bribe by any Public Servant, the public are requested to contact Toll Free Number of ACB i.e., 1064 for taking action as per Law. ACB Telangana can also be contacted through social media platforms whatsapp (9440446106), facebook (Telangana ACB), X/formerly twitter (@Telangana ACB). The QR Code of ACB is displayed in all Government offices and prominent public to contact ACB, Telangana. The name and details of the victim/complainant will be kept secret.

P.R.O
Ant-Corruption Bureau,
Telangana, Hyderabad.

# రూ.15 కోట్ల సర్కారు భూమి.. కథలో కొత్త ట్విస్ట్..!


Prajavani Acknowledgement Receipt

Date :- 05-10-2026

| | | |
|---|---|---|
| Name | : | T Vinod Kumar |
| Mobile No | : | 8978791219 |
| Mandal | : | Dundigal Gandimaisamma |
| Village | : | Bahadurpally |
| Forwarded to | : | LP Section Collectorate, Medchal Malkajgiri District. |

అసైనీ కుమారుడు తుడుము వినోద్ ఫిర్యాదు చేసిన రసీదు..




2023 మార్చి9న కూల్చివేతల వార్త 10వ తేది నాటి పేపర్ కటింగ్..




నాడు(2023)లో కూల్చివేతల వార్తా కథనం..




మళ్ళీ పనులు చేస్తుండటంపై జూలై 2026 నాటిది..



మొన్న జేసీబితో పనులు..



సోమవారం రోడ్డు పనులు..

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, దుండిగల్ గండిమైసమ్మ మండలం, బహుదూర్‌పల్లి గ్రామ సర్వే నెం.131 ప్రభుత్వ భూమిలో సర్వేయర్‌లే మాయాజాలం సృష్టిస్తున్నారా..? 2023 మార్చి 9న, ఇదే రోడ్డు పనులు చేస్తుండగా, ప్రభుత్వ భూమిగా తేల్చి.. అక్రమ నిర్మాణాలు కూల్చిన దుండిగల్ మండలం రెవెన్యూ అధికారులు.. మూడేళ్ళ తరువాత తాజా సర్వేలో పట్టాభూమిగా తేల్చడంపై ఆంతర్యం ఏమిటన్న ఆరోపణలు తలెత్తుతున్నాయి.. నేను చేసిందే కరెక్ట్ అని, ప్రస్తుత తహాశీల్దార్ రాజేశ్వర్ రెడ్డి చెప్పినట్లు, మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ తెలిపారు.. 'పాత సర్వేలో తప్పులున్నాయని' స్పష్టతను ఇస్తున్న, ప్రస్తుత ఎమ్మార్వో, గతంలో పొరపాట్లపై, తాజాగా కలెక్టర్ సహా ఉన్నతాధికారులకు నివేదించారా లేదా అన్నది తెలియాల్సి ఉంది.. మరోవైపు అసలు వాస్తవాలు తేల్చేందుకు డీఐ సర్వేకు రాస్తాని ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ తెలుపడం ఆసక్తికరంగా మారింది.. వీటన్నిటి కంటే, ఇప్పటికే వివాదంలో ఉన్న సుమారు రూ.15 కోట్లు విలువైన ప్రభుత్వ భూమి వ్యవహారంలో, అసలు కలెక్టర్ నుండి రెవెన్యూ "ఎన్‌వోసి" తీసుకున్నారా..?

పట్టాభూమికి– ప్రభుత్వ భూమికి సరిహద్దు వ్యవహారం తేల్చేందుకు అత్యంత ముఖ్యమైనది "రెవెన్యూ ఎన్‌వోసి" ప్రస్తావనే లేదంటే అర్థం..? మరోవైపు ఓ వ్యక్తి మీడియా ముసుగులో మధ్యవర్తిత్వం వ్యవహరించి, చక్రం తిప్పుతున్నట్లు ఆరోపణలు కూడా వస్తున్నాయి..

**ఇద్దరు తహాశీల్దార్‌లు వేరువేరు సర్వే నివేదికలతో.. ఒకరు ప్రభుత్వ భూమిగా, మరొకరు పట్టాభూమిగా, నిర్ధారించడం స్థానికంగా ప్రశ్నలు లేవనెత్తుతోంది.. మరోవైపు రెవెన్యూ అధికారులు, ప్రజల వద్ద తమ నమ్మకాన్ని కోల్పోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.. వీళ్ళకు తోడు ఉన్నతాధికారులు కూడా, ఈ అంశంపై నిర్లక్ష్యం వహించడంతో,స్థానికంగా సర్వత్రా అనుమానాలను రేకెత్తిస్తుంది.. అటు సంబంధిత భూమిలో 'మేము వ్యవసాయం' చేశామని, ఆ భూమిని ఇప్పుడు పట్టాభూమిగా కట్టబెడుతున్నారని'.. అసైనీ రైతు తుడుము శంకరయ్య కుమారుడు వినోద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.. ఒకే భూమిపై భిన్నమైన సర్వే నివేదికలు వెలువడటం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది.. రూ.కోట్లు విలువైన భూమిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.. నాడు (2023) ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు కూల్చివేసిన అదే భూమిని.. నేడు(2026) పట్టాభూమి అంటూ తేల్చడం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.. భూమి అదే..! రెవెన్యూ కార్యాలయం అదే..! నివేదికలు ఎలా మారాయి..? ఇక్కడ మారింది అధికారులు మాత్రమే..! ఇద్దరిలో ఒకరిది తప్పుడు నివేదికేనని, స్వయంగా ఆ ఇద్దరు తహాశీల్దార్‌లే నిర్ధారిస్తున్నారు..! మరి తప్పుడు నివేదిక జారీచేసిన అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోకూడదు..? లేకపోతే, మేము అధికారులం, ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే అహంకారమా..? అన్న ప్రశ్నలు ఘాటుగా వినిపిస్తున్నాయి.. ఇద్దరు ఎమ్మార్వోలు, ఇద్దరు సర్వేయర్‌ల నివేదికల ఆధారంగా, జిల్లా ఉన్నతాధికారులు నిష్పక్షపాత విచారణతో తేల్చాలి.. సర్కారు భూమికి, పట్టా రంగులేస్తే..! ప్రైవేటు పరం అవుతుందా..? 2023లో అక్రమమని కూల్చేసిన రెవెన్యూ అధికారులు.. 2026 (ప్రస్తుతం) వరకు ఎలా సక్రమం అయింది..? సర్వే మారిందా..? ముడుపులతో సీన్ మారిందా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి..**

సిఎంసి బ్యూరో, పెన్ పవర్, అక్టోబర్ 5:

## డీఐ సర్వేతో తేల్చేందుకు యత్నం: ఆర్డీవో..

పాత (2023) నాటి సర్వే, తాజా (2026) సర్వేల్లో తేడాలపై మల్కాజిగిరి ఆర్డీవోతో ప్రస్తావించగా ఆయన స్పందించారు.. క్షేత్రస్థాయిలో పరిశీలన అవసరమని, ఈ నేపథ్యంలో అసలు వాస్తవాలు తేల్చేందుకు డీఐ స్థాయిలో మరోసారి సర్వే నిర్వహించేందుకు రాస్తానని ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ 'పెన్ పవర్' ప్రతినిధితో తెలిపారు.. దీంతో ఈ సర్వేతోనైనా భూమి హక్కులు, హద్దులపై ఒక స్పష్టత వస్తుందనే ఆసక్తి నెలకొంది..

## అప్పటి సర్వే తప్పు: ప్రస్తుత తహాశీల్దార్..

అయితే ప్రస్తుత దుండిగల్ తహాశీల్దార్ రాజేశ్వర్‌రెడ్డి మాత్రం అప్పటి సర్వేలో లోపాలున్నాయని చెబుతున్నారట.. అప్పటి తహాశీల్దార్ తప్పుడు నివేదిక ఆధారంగా కూల్చివేత చర్యలు చేపట్టారని, సర్వేయర్ శ్రీనివాసాచారి నివేదికలో తప్పులు ఉన్నాయని పేర్కొన్నట్లు సమాచారం.. ఈ విషయాన్ని మల్కాజిగిరి ఆర్డీవో శ్యామ్ ప్రకాశ్ చెప్పిందే..! టిప్పన్ తదితర రికార్డులను పరిశీలించి తాజా సర్వే నిర్వహించినట్లు తెలిపారట.. తాజాగా నిర్వహించిన సర్వేలో సర్వే నెంబర్ 131కు సంబంధించిన భూమి పట్టాభూమిగా తేలిందని తహాశీల్దార్ ఆర్డీవోకు ఇచ్చిన వివరణలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. అయితే రెండు సర్వేల మధ్య ఇంతటి వ్యత్యాసం ఎందుకు వచ్చిందన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది..

## 'రీ'-సర్వేల పేరుతో సహకారాలు..?

2023లో ప్రభుత్వ భూమిగా నిర్ధారించిన తర్వాతే, అప్పటి తహాశీల్దార్ ఆదేశాల మేరకు సర్వేయర్ శ్రీనివాసాచారి నిర్వహించిన సర్వేలో సర్వే నెంబర్ 131లోని భూమి ప్రభుత్వ భూమిగా నిర్ధారించినట్లు సమాచారం.. ప్రభుత్వ భూమి సరిహద్దులో నిర్మించిన వ్యవహారంలో 2023 సర్వే మ్యాప్ చెబుతుంది.. వెంటనే రోడ్డు పనులు నిలిపివేసి, అడ్డంగా కందకం తవ్వడం, రెవెన్యూ అధికారులు అక్కడ ప్రభుత్వ భూమిగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు అక్రమంగా ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తొలగించారు. భవిష్యత్‌లో రోడ్డు నిర్మాణానికి అవకాశం లేకుండా కందకం కూడా తవ్వించారు..

అయితే 2023 కూల్చివేతల అనంతరం, భూమి సక్రమమే అయిఉంటే..! వెంటనే ఈ సర్వేలు అప్పుడు ఎందుకు చేయలేదు..? మూడేళ్ళ విరామం దేనికి..? తమకు అనుకూలంగా సర్వేలు నిర్వహించే, సరైన అధికారులు లేరని నిరీక్షంచారా..? ఏ ఉద్దేశంతో ఆలస్యం చేశారన్న ప్రశ్నలూ లేవనెత్తుతోంది.. అప్పటి రెవెన్యూ చర్యలను, తాజా నివేదికలతో తప్పు పట్టడానికి, ప్రధాన కారణాలు ఏమైనా ఉన్నాయా..? బహదూర్‌పల్లి సర్వే నంబర్ 131లో భూమి హక్కులు, హద్దులపై నెలకొన్న వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది.. 2023లో ఇదే భూమిని ప్రభుత్వ భూమిగా నిర్ధారించి రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టగా.. తాజాగా నిర్వహించిన సర్వేలో పట్టాభూమిగా తేలిందని అధికారులు చెబుతుండటం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది..

## 'మేము వ్యవసాయం చేసిన భూమి..

ఇదిలా ఉండగా.. ఈ భూమితో తమ కుటుంబానికి సంబంధం ఉందంటూ తుడుము శంకరయ్య కుమారుడు, వినోద్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాను ఎస్సీ అసైనీ కుటుంబానికి చెందిన కుమారుడినని, తమ కుటుంబం, తాత, తండ్రి ఆ స్థలంలో వ్యవసాయం చేశారని ఆయన చెబుతున్నారు.. తాము సాగు చేసిన భూమిని ఇప్పుడు పట్టాభూమిగా ఇతరులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.. సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదు చేసినట్లు తుడుము వినోద్ 'పెన్ పవర్ ప్రతినిధికి' ఫోన్‌లో వివరాలు వెల్లడించారు.. ఏళ్ళ తరబడి సాగుచేసిన తమకు చెందకుండా, సంబంధిత వివాదాస్పద భూమిని రీ సర్వేలతో ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదని వినోద్ తెలిపారు..



సాగుచేస్తున్న ఫైల్‌ఫోటో..

## ఎవరి సర్వే నిజం..? ఎవరిపై చర్యలు..?

దుండిగల్ గండిమైసమ్మ మండలం రెవెన్యూ అధికారుల తీరు, అదేదో సామెతకు అద్దం పడుతుంది.. చుట్టూ శాఖాహారులే అయినప్పటికీ మధ్యలో ఉన్న 'కోళ్ళు' మాయం అవుతున్నాయట.. అలా ఉంది.. అప్పుడు నాటి తహాశీల్దార్ సర్వే సరైనదేని చెప్పడం..! ఇప్పుడు ప్రస్తుత తహాశీల్దార్ నాదే సరైనదని చెప్పడం శోచనీయంగా ఉందని సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి.. ఒకవైపు 2023లో ప్రభుత్వ భూమిగా తేల్చి చర్యలు తీసుకోవడం.. మరోవైపు తాజాగా పట్టాభూమిగా తేలిందని అధికారులు చెప్పడం.. మధ్యలో పాత సర్వే తప్పని ప్రస్తుత తహాశీల్దార్ పేర్కొనడం పలు ప్రశ్నలకు తావిస్తోంది.. పాత సర్వే తప్పయితే అప్పటి నివేదికకు బాధ్యత ఎవరిది..? తాజా సర్వేలోనే వాస్తవం ఉంటే గతంలో ప్రభుత్వ భూమిగా ఎలా నిర్ధారించారు..? అన్న ప్రశ్నలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి.. ఇప్పుడు కీలకంగా వినిపిస్తున్న ప్రశ్న, తప్పు ఎవరిది..? చర్యలు ఎవరిపై ఉంటాయి..? అవును నిజమే తప్పుడు సర్వే ఎవరిదైనా చర్యలు చేపట్టాల్సిందే కదా..! అన్న చర్చ జరుగుతోంది.



బహుదూర్‌పల్లి సర్వే నెం.131 ప్రభుత్వ అసైన్డ్ భూమిలో వ్యవసాయం సాగుచేసిన..(ఫైల్‌ఫోటో)



అసైనీ తుడుము శంకరయ్య కుటుంబం 131 లో..(ఫైల్‌ఫోటో)

## ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను పదవి నుండి తొలగించాలనే డిమాండ్ కు ఏఐకేఎంఎస్ పూర్తి మద్దతు--- రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శి మామిడాల బిక్షపతి, గౌని ఐలయ్య





హైదరాబాద్ పెన్ పవర్:

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే పదవి నుండి తొలగించాలనే డిమాండ్ తో రాజకీయ పార్టీలు ఇచ్చిన ఆందోళన కార్యక్రమాల పిలుపుకు ఏఐకేఎంఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్)రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు మామిడాల బిక్షపతి, గౌని ఐలయ్య ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థకు, రాజ్యాంగ స్ఫూర్తికి అత్యంత కీలకమైన ఓటు హక్కును నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు సర్ పేరుతో అనేక అక్రమాలు జరుగుతున్నప్పటికీ అందులో ప్రత్యక్షంగా కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ నేరపూరిత పాత్రను ఇండియన్ ఎక్స్ప్రెస్ పత్రిక బయటపెట్టటంతో ఈ కుట్ర మరింత బట్టబయలైంది.కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జాజనేష్ కుమార్ ఏకపక్షంగా, కేంద్రంలోని అధికార బీజేపీ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తూ ఎన్నికల వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ( సర్) పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది ఓట్లను అన్యాయంగా తొలగిస్తూ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. రాజ్యాంగ నిబంధనలను తుంగలో తొక్కి, ప్రాథమిక హక్కులని కాలరాస్తూ ఆరెస్సెస్ ఎజెండా అయిన హిందూ రాజ్య స్థాపన కోసం ఫాసిస్టు ధోరణితో వ్యవహరిస్తున్న బిజెపి అధికారాన్ని శాశ్వతమొనర్చడానికే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఇలాంటి దుర్మార్గమైన చర్యలకు పూనుకున్నారు. ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలి. సర్ అక్రమాలపై జ్ఞానేశ్వర్ కుమార్ ను విచారించాలి. వివాదాస్పదమైన 'సర్' ప్రక్రియను తక్షణమే నిలిపివేయాలి. . పై డిమాండ్ల సాధనకోసం అక్టోబర్ 6న రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు, అక్టోబర్ 8న 'చలో రాజ్ భవన్' కార్యక్రమానికి రాష్ట్రంలోని తొమ్మిది కమ్యూనిస్టు పార్టీలతో పాటు కాంగ్రెస్, టీజేఎస్ తదితర రాజకీయ పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ ఆందోళన కార్యక్రమానికి అఖిలభారత రైతు కూలీ సంఘం( ఏఐకేఎంఎస్ ) సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నది. ఈ ఆందోళనా కార్యక్రమాలలో క్రియాశీలకంగా పాల్గొనాలని సంఘం జిల్లా, స్థానిక శాఖలకు రాష్ట్ర కార్యవర్గం పిలుపునిస్తున్నది...

# కాంగ్రెస్ కు సవాల్ గా ఎమ్మెల్సీ ఎన్నికలు

**వరంగల్ అక్టోబరు 5, పెన్ పవర్:**
తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాంగ్రెస్ కు సవాల్ గా మారనున్నాయి. ఇద్దరు రెడ్డి సామాజికవర్గం అభ్యర్థులను ప్రకటించడం కొంత ఇబ్బందిగా మారనుందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. రెండు పట్టభద్రుల అయితే రెండు ఎమ్మెల్సీ స్థానాలను కైవసం చేసుకోవడానికి అధికార కాంగ్రెస్ పార్టీ పక్కా వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ నాయకత్వం, ప్రధాన ప్రతిపక్షాలకు అవకాశం ఇవ్వకుండా ముందస్తుగా పావులు కదుపుతోంది. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్, వరంగల్--ఖమ్మం--నల్గొండ స్థానాల్లో ఇద్దరు అభ్యర్థులను కాంగ్రెస్ ముందుగానే ప్రకటించింది. ఇది బీసీల్లో ఒకింత అసంతృప్తికి కారణమయ్యాయని సొంత పార్టీ నేతలే చెబుతున్నారు. గెలుపు గుర్రాలే లక్ష్యంతో అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ అన్ని సమయాల్లో సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులు ఉపయోగపడవని కొందరు గుర్తు చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న ప్రధాన వ్యూహాలు మాత్రం పకడ్బందీగానే ఉన్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.అందరికంటే ముందే అభ్యర్థుల ప్రకటించడం ఒకింత కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, ప్రత్యర్థి పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించి కాంగ్రెస్ ప్రచారంలో ముందడుగు వేసింది. ఏఐసీసీ ఆమోదంతో రెండు స్థానాలకు బలమైన అభ్యర్థులను ఖరారు చేసింది. మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ స్థానానికి టీపీసీసీ మీడియా వింగ్‌లో పనిచేసిన సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్--ఖమ్మం--నల్గొండ స్థానానికి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి కుమారుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని ఎంపిక చేసింది. ఇద్దరూ ఆర్థికంగా బలమైన నేతలే కావడంతో పాటు ఆ యా ప్రాంతాల్లో పట్టున్న నేతలుగా గుర్తింపు పొందడం తమకు కలసి వచ్చే అంశంగా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం భావిస్తుంది. రెండు స్థానాల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అన్ని వ్యూహాలను సిద్ధం చేసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు మంత్రులను ఇన్ ఛార్జులుగా నియమించారు. సామాజిక సమీకరణాల కంటే గెలుపు గుర్రాలకే ప్రాధాన్యత ఇచ్చినట్లు పార్టీ నాయకత్వం తెలిపింది. ఈ ఎన్నికల్లో కేవలం సామాజిక సమీకరణాలను మాత్రమే కాకుండా పట్టభద్రుల్లో అభ్యర్థులకు ఉన్న వ్యక్తిగత బలం, నెట్‌వర్క్, ప్రచార సామర్థ్యం మరియు గెలిచే అవకాశాల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేసింది. అయితే ఇరు స్థానాల్లోనూ రెడ్డి సామాజికవర్గానికి సీట్లు కేటాయించడంపై బీఆర్ఎస్ వంటి ప్రత్యర్థి పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ ఎన్నికల్లో గెలుపు ఓటర్ల నమోదుపైనే ఆధారపడి ఉంటుందని గ్రహించిన కాంగ్రెస్, రెండు నియోజకవర్గాల పరిధిలో దాదాపు 7 లక్షల మంది పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. యువతను, కొత్తగా డిగ్రీలు పూర్తి చేసిన ఓటర్లను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతోంది.శాసనసభ్యులు , పార్లమెంట్ సభ్యులు , నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌లు, డీసీసీ అధ్యక్షులు మరియు కార్పొరేషన్ ఛైర్మన్లను క్షేత్రస్థాయిలోకి దించి ఓటర్ల నమోదు మరియు ప్రచార బాధ్యతలను అప్పగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ నాయకత్వం నిర్ణయించింది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ బలంగా ఉన్నందున, హైదరాబాద్-రంగారెడ్డి రీజియన్‌పై కాంగ్రెస్ ప్రత్యేక నిఘా పెట్టింది.నిరుద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగుల సమస్యలపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని టార్గెట్ చేసే అవకాశం ఉన్నందున, ఉద్యోగ నోటిఫికేషన్లు మరియు ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను పట్టభద్రుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పాజిటివ్ ఓటింగ్ సాధించాలని కాంగ్రెస్ ప్రణాళికలు రచిస్తోంది.

# ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం మరియు ప్రతి పౌరుడి భాధ్యత

**వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్**




హైదరాబాద్ పెన్ పవర్:

ఆటో మరియు క్యాబ్ వాహనాలకు అభయ--మై ట్యాక్సీ సేఫ్ యాప్ ను ప్రారంబించిన వరంగల్ పోలీస్ కమిషనర్.

అభయ--మై ట్యాక్సీ సేఫ్ స్టిక్కర్లను ప్రతి ఆటో మరియు టాక్సీ డ్రైవర్లు తప్పనిసరిగా అంటించుకోవాలి.

-- స్టిక్కర్ ను చూడగానే ప్రయాణికులకు నమ్మకం కలుగుతుంది.

మహిళలు, ప్రయాణికుల భద్రతకు మరింత భరోసా కల్పించే లక్ష్యంతో , రూపొందించిన అభయ--మై ట్యాక్సీ సేఫ్. యాప్ ను వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత, ఐపీఎస్. ప్రారంబించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ-.....రానున్న రోజుల్లో ప్రయాణికులు అభయ--మై ట్యాక్సీ సేఫ్. స్టిక్కర్లు అంటించి ఉన్న టాక్సీ వాహణాల్లో మాత్రమే ప్రయాణిస్తారని తెలిపారు. అభయ--మై ట్యాక్సీ సేఫ్. స్టిక్కర్లను ప్రతి ఆటో మరియు టాక్సీ డ్రైవర్లు తప్పనిసరిగా అంటించుకోవాలని, టాక్సీ పైన ఉన్న స్టిక్కర్ ను చూడగానే ప్రయాణికులకు నమ్మకం కలుగుతుందని, ఇందుకోసం ప్రతి ఆటో మరియు క్యాబ్ యజమానులు వారి టాక్సీ వివరాలను అభయ--మై ట్యాక్సీ సేఫ్ యాప్ లో నమోదు చేసుకొని, సమీప ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించి, స్టిక్కర్ లను పొంది, వారి టాక్సీ వాహనాలకి అంటించుకోవాలని తెలిపారు. ట్యాక్సీ డ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రయాణికుల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం అని తెలిపారు. ఈ సందర్భంగా ట్యాక్సీ డ్రైవర్లకు యాప్ వినియోగం, ప్రయాణికుల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ట్యాక్సీ వాహనాల్లో ప్రయాణించే మహిళలు, ఇతర ప్రయాణికులు కూడా అభయ--మై ట్యాక్సీ సేఫ్. యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్యాక్సీ వాహనాలపై ఏర్పాటు చేసిన స్టిక్కర్ల ద్వారా ప్రయాణికులకు యాప్‌పై అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న భద్రతా సదుపాయాలను వినియోగించుకునేలా ప్రోత్సహించనున్నారు. అలాగే నాటక ప్రదర్శన ద్వారా పోలీసు కళాబృందం వారు ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రే సిషన్) రాయల ప్రభాకర్ రావు, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లు సుజాత, వెంకన్న, ట్రాఫిక్ సిబ్బంది, టాక్సీ డ్రైవరు లు, మహిళలు, మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కూకట్‌పల్లి 286 ఎకరాల భూ వివాదం

**హైదరాబాద్, అక్టోబరు 5, పెన్ పవర్:**
కూకట్‌పల్లి సర్వే నంబర్ 1007లోని 286 ఎకరాల భూమిపై దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 1961లో మధ్యతరగతి ఉద్యోగులు ఏర్పాటు చేసిన భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఈ భూమిలో ప్లాట్ల కోసం ఒప్పందాలు చేసుకుంది. అనంతరం కోర్టు ప్రక్రియ ద్వారా 167 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. మిగిలిన 119 ఎకరాలపై వివాదం కొనసాగుతోంది. భూములపై హక్కుల విషయంలో పలు పక్షాలు వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తమ స్థలాల్లో జోక్యం, ప్రహరీ నిర్మాణాలు, ఒత్తిళ్లపై సొసైటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.భాగ్యనగర్ కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ 1961లో చిరుద్యోగులు, మధ్యతరగతి కుటుంబాలు కలిసి ఏర్పాటు చేసుకున్నారు. రాజధాని నగరంలో తమ కుటుంబాలకు సొంత స్థలాలు ఉండాలనే ఉద్దేశంతో సొసైటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు చెబుతున్నారు. అనంతరం కూకట్‌పల్లి సర్వే నంబర్ 1007లోని 286 ఎకరాల భూమిని కొనుగోలు చేసేందుకు అప్పటి హక్కుదారు నవాబ్ రియాజ్ యార్ జంగ్ వారసులతో ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం.అయితే భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంది. చివరకు 1991 నుంచి 1998 మధ్య కోర్టు ప్రక్రియ ద్వారా 70 ఎకరాలు, 50 ఎకరాలు, 25 ఎకరాలు, 22 ఎకరాల చొప్పున మొత్తం 167 ఎకరాలు సొసైటీకి రిజిస్టర్ అయినట్లు సభ్యులు చెబుతున్నారు. మిగిలిన 119 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగలేదు. ఈ భూముల్లో కొంత భాగంలో సొసైటీ సభ్యులు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. మరికొంత భూమి ఖాళీగా ఉంది.మాదాపూర్‌లో హైటెక్ సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరిగాయి. హైటెక్ సిటీకి సమీపంలో ఉన్న కూకట్‌పల్లి ప్రాంతంలో భూములకు డిమాండ్ పెరగడంతో సొసైటీ భూములపై కూడా వివాదం ముదిరిందని సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రత్యామ్నాయ డాక్యుమెంట్లు సృష్టించి భూములపై హక్కులు పొందేందుకు ప్రయత్నాలు జరిగాయని వారు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి తుది నిర్ధారణ న్యాయస్థానాల తీర్పులు, అధికారిక రికార్డుల ఆధారంగానే జరగాల్సి ఉంది.సొసైటీ సభ్యుల ఆరోపణల ప్రకారం, పాత భూ లావాదేవీలకు సంబంధించి కొన్ని ప్రత్యామ్నాయ పత్రాలు తెరపైకి వచ్చాయి. జంగ్ కుటుంబానికి సంబంధించిన వ్యక్తుల పేర్లు, పాత ఒప్పందాలు, ఇతర సంస్థలకు భూముల బదలాయింపునకు సంబంధించిన పత్రాలను చూపిస్తూ హక్కులు వాదిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. అయితే సొసైటీ సభ్యులు ఈ పత్రాల చెల్లుబాటుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో సంబంధిత పేర్లకు ఆధారాలు లేవని కూడా వారు చెబుతున్నారు.రాష్ట్ర విభజన అనంతరం ఈ వివాదం మరింత సంక్లిష్టంగా మారిందని సొసైటీ సభ్యులు పేర్కొంటున్నారు. తమకు సంబంధించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని, అధికారులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు భూముల హక్కులపై వివిధ పక్షాలు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో వివాదం కోర్టుల్లో కొనసాగుతోంది.ప్రస్తుతం 286 ఎకరాల భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సొసైటీ సభ్యులు చెబుతున్నారు. దీనివల్ల దశాబ్దాల క్రితం స్థలాలు కొనుగోలు చేసిన కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఇళ్లలో నివసిస్తున్నవారితో పాటు ఖాళీ స్థలాలు కలిగి ఉన్నవారూ తమ ఆస్తుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వృద్ధులు కావడం, మరికొందరు మరణించడంతో వారి వారసులు న్యాయపోరాటం కొనసాగించాల్సి వస్తోందని సభ్యులు అంటున్నారు.ఈ భూముల విలువ ప్రస్తుతం ఎకరాకు వందల కోట్ల రూపాయల స్థాయిలో మట్నత్తంగా 50 వేల కోట్ల వరకు ఉందని సొసైటీ సభ్యులు చెబుతున్నారు. అందువల్ల 286 ఎకరాల ఆస్తి విలువ భారీగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇదే కారణంగా భూములపై హక్కుల వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు కొందరు సభ్యులతో మధ్యవర్తిత్వం ద్వారా రాజీ ప్రయత్నాలు జరుగుతున్నాయని సొసైటీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే 22 ఎకరాలకు సంబంధించి సెటిల్‌మెంట్ జరిగినట్లు సమాచారం ఉందని, మిగిలిన సభ్యులపైనా ఇలాంటి ఒత్తిడి తీసుకువస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.

# సిరిసిల్ల పూర్తయింది... ఇక సిద్ధిపేట....

**మెదక్, అక్టోబరు 5, పెన్ పవర్:**
ఉమ్మడి కరీంనగర్, మెదక్ జిల్లాల్లో గులాబీ పార్టీ బలమైన అడ్డాగా ఉన్న నియోజకవర్గాలపై వ్యూహాత్మకంగా దృష్టి సారించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సిరిసిల్ల సభ తర్వాత తన తదుపరి పొలిటికల్ టార్గెట్‌గా సిద్ధిపేటను ఎంచుకోవడం తెలంగాణ రాజకీయంలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న సిరిసిల్లపై నిధుల వర్షం కురిపిస్తూనే రాజకీయ విమర్శలతో దాడి చేసిన సీఎం రేవంత్, ఇప్పుడు బిఆర్ఎస్ ట్రబుల్ షూటర్ హరీష్ రావు స్వక్షేత్రమైన సిద్ధిపేటలో భారీ బహిరంగ సభకు సిద్ధమవుతున్నారు. అయితే, సిరిసిల్ల రాజకీయ సమీకరణలతో పోలిస్తే సిద్ధిపేట గడ్డపై బిఆర్ఎస్‌ను ఢీకొట్టడం కాంగ్రెస్‌కు అంత సులువైన విషయం కాదన్నది ప్రాథమిక అంచనా.సిద్ధిపేట నియోజకవర్గం దశాబ్దాలుగా గులాబీ జెండాకు తిరుగులేని బలమైన కోటగా ఉంది. 1985లో తొలిసారిగా కేసీఆర్ ఇక్కడి నుంచి గెలిచిన నాటి నుంచి నేటి వరకు ఈ నియోజకవర్గం కేసీఆర్ కుటుంబం చేతుల్లోనే ఉంది. కేసీఆర్ ముఖ్యమంత్రిగా రాష్ట్ర స్థాయి రాజకీయాలకు పరిమితమైన తర్వాత, సిద్ధిపేట బాధ్యతలను స్వీకరించిన హరీష్ రావు నియోజకవర్గాన్ని కేవలం ఒక రాజకీయ స్థానంగా కాకుండా తన సొంత ఇల్లుగా మార్చుకున్నారు. వరుసగా ఆరుసార్లు రికార్డు స్థాయి భారీ మెజార్టీలతో విజయం సాధించడమే కాకుండా, ప్రత్యర్థి పార్టీల ఉనికిని కూడా ప్రశ్నార్థకం చేసే స్థాయికి నియోజకవర్గంలో పట్టు సాధించారు.హరీష్ రావు రాజకీయ విజయంలో ప్రధాన బలం ఆయన పెంపొందించుకున్న వ్యక్తిగత అనుబంధం, నిరంతర అందుబాటు . సిద్ధిపేటలోని ప్రతి గ్రామంలోనూ, ప్రతి వార్డులోనూ హరీష్ రావుకు సొంత కేడర్ ఉంది. ప్రతీ శు భకార్యానికి లేదా అశుభకార్యానికి పలకరించే స్థాయి కార్యకర్తల నెట్‌వర్క్, నియోజకవర్గంలోని ప్రతి కుటుంబంతో ఏదో ఒక రూపంలో నేరుగా కనెక్టివిటీ ఉండటం ఆయనకు శ్రీరామరక్షగా మారింది. దానికి తోడు మంత్రిగా పనిచేసిన సమయంలో రంగనాయక సాగర్ జలాశయం, వైద్య కళాశాల, ఐటీ పార్కు, మోడల్ బస్టాండ్ వంటి ప్రాజెక్టులతో సిద్ధిపేటను అభివృద్ధి నమూనాగా తీర్చిదిద్దడం ఆయన బలాన్ని మరింత ద్విగుణీకృతం చేసింది. సిద్ధిపేటలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా అత్యంత బలహీనమైన స్థితిలోనే ఉందనేది వాస్తవం. ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి స్థానిక స్థాయిలో గులాబీ పార్టీ పట్టును తట్టుకోగల బలమైన, జనాకర్షణ కలిగిన నాయకత్వం కరువైంది. సిరిసిల్లలో చేరికలు లేదా అంతర్గత విభేదాలను ఆసరాగా చేసుకుని విమర్శలు గుప్పించే వెసులుబాటు కాంగ్రెస్‌కు ఉన్నప్పటికీ, సిద్ధిపేటలో హరీష్ రావు కేడర్‌ను లేదా ఓటు బ్యాంకును చీల్చడం కాంగ్రెస్‌కు పెద్ద సవాలు. దీంతో, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభ ఎంత భారీ స్థాయిలో నిర్వహించినప్పటికీ, అది స్థానిక రాజకీయ సమీకరణలను ఎంతవరకు ప్రభావితం చేస్తుందనేది ప్రశ్నార్థకమే సీఎం రేవంత్ రెడ్డి వ్యూహం కేవలం ఎన్నికల విజయం కోసమే కాకుండా, బిఆర్ఎస్ ప్రధాన నాయకత్వంలో మానసిక అభద్రతాభావాన్ని పెంచడమే లక్ష్యంగా కనిపిస్తోంది. హరీష్ రావు అసెంబ్లీలో ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్న తరుణంలో, ఆయన సొంత నియోజకవర్గంలోనే బహిరంగ సభ పెట్టి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలతో పాటు రాజకీయంగా సవాల్ విసరడం ద్వారా రేవంత్ రెడ్డి డిఫెన్సివ్ రాజకీయాల కంటే ఎదురుదాడి రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని స్పష్టమవుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్ కేడర్‌లో ధైర్యం నూరిపోసి, భవిష్యత్తు స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీకి ఊపిరి పోయడం కూడా ఈ పర్యటన ముఖ్య ఉద్దేశం. సిరిసిల్ల తరహాలో సిద్ధిపేటను ఒకే దెబ్బతో డిఫెన్స్‌లో పడేయడం రేవంత్ రెడ్డికి ఏమాత్రం సులభం కాదు. హరీష్ రావు నిర్మించుకున్న వ్యక్తిగత సంబంధాలు, అభివృద్ధి మార్కు , తిరుగులేని సంస్థాగత నిర్మాణం ముందు కాంగ్రెస్ కమ్యూనికేషన్ వ్యూహాలు ఎంతవరకు పారుతాయనేది వేచి చూడాలి.

# రైల్వే ప్రయాణంలో విలువైన వస్తువులను దొంగలించటానికి ప్రయత్నించిన వ్యక్తి అరెస్ట్

**జి ఆర్ పి. సి ఐ. వి నరేష్ కుమార్.**




హైదరాబాద్ పెన్ పవర్:

వరంగల్. జి ఆర్ పి. సిఐ శ్రీ వి నరేష్ కుమార్ కథనం ప్రకారం ఈ రోజు దివి 05-10-2026 రాత్రి 02:00 గంటల సమయాన ట్రైన్ నెంబర్ 12788 నర్సాపూర్ ఎక్స్ప్రెస్ నందు బి 1 కోచ్ లో ప్రయాణం చేస్తున్న ప్రయాణికురాలి మెడలోని బంగారు చైన్ దాని విలువ ఒక లక్ష రూపాయలు,మరియు తన వద్ద గల బ్యాగు నందు లాప్టాప్ 1 లక్ష రూపాయలు విలువ కలది ,రెండు మొబైల్ ఫోన్లు 60 వేల విలువగల (మొత్తం విలువ 260000) వాటిని బలవంతంగా లాక్కొని దొంగిలించడానికి ప్రయత్నించిన షేక్ రజాక్ తండ్రి. / షఫీ గ్రామం. / నాగపూర్ మహారాష్ట్ర ను పట్టుకొని అరెస్టు చేయడం అయినది. ఇట్టి కార్యక్రమంలో ఆర్టీసీ. డి. రాము , కె. దినేష్ ఆర్పిఎఫ్. సిబ్బంది ఎస్. .శ్రీనివాస్ ,శశి కుమార్ ఆర్పిఎఫ్. సిఐబి. సిబ్బంది ఎన్ రమేష్ లు పాల్గొన్నారు

# మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలి--- తహసీల్దార్ నాగరాజు.



హైదరాబాద్ పెన్ పవర్:

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలుర హాస్టల్‌ను సోమవారం సాయంత్రం తహసీల్దార్ నాగరాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న వసతులు, పరిశుభ్రతను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందో లేదో తెలుసుకునేందుకు స్వయంగా విద్యార్థులతో కలసి కూర్చొని భోజనం చేశారు.ప్రభుత్వం అమలు చేస్తున్న మెనూను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల భోజన విషయంలో ఎలాంటి అలసత్వం వహించవద్దని హాస్టల్ నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.హాస్టల్‌లోని తాగునీరు,విద్యుత్,వసతి తదితర సౌకర్యాలను పరిశీలించి,విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ చిరంజీవి,సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# అక్బరుద్దీన్ రాజకీయ సన్యాసం..

**హైదరాబాద్, అక్టోబరు 5 పెన్ పవర్:**
హైదరాబాద్ పాతబస్తీ రాజకీయాల్లోనూ, ఎంఐఎం శాసనసభా పక్ష నేతగానూ క్రియాశీలక పాత్ర పోషిస్తున్న అక్బరుద్దీన్ ఓవైసీ... వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చుంటూ స్వయంగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. తన విద్యాసంస్థ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నాకు వయస్సు అయిపోయింది, వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదో తెలియదు, అసలు పోటీ చేయాలనే ఆలోచన కూడా నాకు లేదు అని ఆయన సంచలన ప్రకటన చేశారు.అక్బరుద్దీన్ ఈ నిర్ణయానికి రావడం వెనుక ప్రధాన కారణంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని చెప్పుకోవచ్చు. 2011లో బార్కాస్‌లో ఆయనపై జరిగిన దాడి అనంతరం ఆయన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడింది. రెండు, మూడు సార్లు ఆయన పరిస్థితి విషమం అనే ప్రచారం జరిగింది. గత కొన్నేళ్లుగా వెన్నునొప్పి, ఇతర అంతర్గత ఆరోగ్య సమస్యలతో నిరంతరం వైద్య సంరక్షణలో ఉంటున్న ఆయన, నిరంతర ప్రచార ఒత్తిడిని , అసెంబ్లీలో సుదీర్ఘ రాజకీయ కసరత్తును తట్టుకోవడం శారీరకంగా సవాలుగా మారిందని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి.మరోవైపు పాతబస్తీలో ఓవైసీ కుటుంబ తదుపరి తరం ఫీల్డులోకి రాబోతోందని చెబుతున్నారు. చంద్రాయణగుట్ట నియోజకవర్గం దశాబ్దాలుగా ఓవైసీ కుటుంబానికి కంచుకోటగా ఉంది. అక్బరుద్దీన్ స్థానంలో ఆయన కుమారుడు నూరుద్దీన్ ఓవైసీని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బరిలోకి దింపేందుకు రంగం సిద్ధమవుతోందనే చర్చ జోరందుకుంది. పాతబస్తీ ఓటర్లకు నూరుద్దీన్‌ను పరిచయం చేస్తూ, అక్బరుద్దీన్ వెనుక ఉండి మార్గదర్శకత్వం వహించే దిశగా పార్టీ నాయకత్వం ప్రణాళిక రచిస్తున్నట్లు సమాచారం. వయసు అయిపోయింది అనే కారణం అయితే.. ఆయన సోదరుడు అసదుద్దీన్.. అక్బరుద్దీన్ కంటే పెద్ద. మరి ఆయనేం అనుకోవాలన్న ప్రశ్నలు వస్తున్నాయి.తాను కేవలం 12వ తరగతి వరకే చదివానని చెప్పడానికి ఏమాత్రం సిగ్గుపడనని ఎమ్మెల్యే అక్బరుబ్బీన్ అన్నారు. తక్కువ చదువు చదివినప్పటికీ, ఎంతో కీర్తి ప్రతిష్ఠలు




సంపాదించడంతో పాటు ఎన్నో ఒవైసీ విద్యాసంస్థల భవనాలను నిర్మించినందుకు గర్వంగా ఉందన్నారు. కొందరు ఉద్దేశపూర్వకంగానే తన పరువు తీయడానికి, ఇబ్బందులకు గురిచేయడానికి రకరకాల కుట్రలు చేస్తున్నారని, కానీ తాను ఎవరి ముందూ తలవంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ దేశం, ఈ గడ్డ అందరిదని, ఇక్కడ ప్రతి పౌరుడికి సమాన హక్కులు ఉన్నాయని చాంద్రాయణగుట్ట ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఒకవేళ తాను భౌతికంగా ఉన్నా, లేకపోయినా తాను నెలకొల్పిన ఒవైసీ విద్యాసంస్థల భవనాల్లో తన గళం శాశ్వతంగా నిలిచిపోతుందని అక్బరుద్దీన్ ఒవైసీ భావోద్వేగానికి లోనయ్యారు. రాజకీయాలు, ఇక్కడి మిగతా వ్యవహారాలు అన్నింటినీ వదిలేసి మక్కాలోనే ఉండిపోవాలని ఉందన్నారు. మక్కాలోనే కన్నుమూయాలనేది తన చివరి కోరికని ప్రసంగంలో తెలిపారు. 2024లో ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ఒవైసీ సోదరులను ఎలా చంపుతారో తెలియదంటూ చేసిన వ్యాఖ్యలు అప్పట్లో కలకలం రేపాయి.అయితే అసెంబ్లీ బయటా, లోపలా ఎంతో డేరింగ్ అండ్ డాషింగ్ గా వ్యవహరించే అక్బరుద్దీన్.. తాను ముసలివాడినయ్యానని, వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానో లేదోనని చెప్పడం. తాను ఉన్నా, లేకపోయినా ఒవైసీ విద్యాసంస్థల భవనాల్లో తన గళం శాశ్వతంగా ఉంటుందంటూ భావోద్వేగానికి లోనవడం హాట్ టాపిక్ అవుతోంది. ఎంతో ఆవేశంగా వ్యవహరించే అక్బరుద్దీన్ ఇలా కూడా మాట్లాడతారా అని చర్చించుకుంటున్నారు. హిజాబ్ మన ఆయుధం అని.. ఎవరు వ్యతిరేకించినా వదలకూడదని హైదరాబాద్ పాతబస్తీ యువతులకు అక్బరుద్దీన్ ఒవైసీ సూచించారు. హిజాబ్‌తోనే జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలని, కష్టపడి పైకి రావాలని ఒవైసీ విద్యాసంస్థల విద్యార్థినులకు సూచించారు.

# ఎల్ నినో ఎఫెక్ట్... కొత్త జాబ్ కార్డు రెడీ

**హైదరాబాద్, అక్టోబరు 5, పెన్ పవర్:**
ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కొత్త జాబ్‌కార్డులు జారీ చేయాలని నిర్ణయించింది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి 15 రోజుల్లోనే కార్డులు అందించాలని ఆదేశించింది. ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాలను కరవు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించారు. పంటల సాగు తగ్గడంతో కూలీలకు పనులు, ఆదాయం తగ్గిన నేపథ్యంలో ప్రతి గ్రామంలో రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు.ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో గ్రామీణ కూలీలకు నిరంతర ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. వీబీ జీరాంజీ పథకం కింద కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి జాబ్‌కార్డులు త్వరగా జారీ చేయాలని నిర్ణయించింది. కొత్త దరఖాస్తుదారులకు 15 రోజుల్లోనే జాబ్‌కార్డు అందించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా ఇప్పటికే 18 జిల్లాల్లోని 265 మండలాల్లో కరవు పరిస్థితులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పంటల సాగు తగ్గింది. దీంతో వ్యవసాయ పనులపై ఆధారపడే కూలీలకు పనిదినాలు తగ్గి ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడినట్లు ప్రభుత్వం నిర్ధారించింది.ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రస్తుత జాబ్‌కార్డుదారులతో పాటు కొత్తగా ఉపాధి కోరుకునే వారిని కూడా నమోదు చేయాలని సూచించింది. గ్రామాల్లో ఉపాధి అవసరమున్న కుటుంబాలను గుర్తించి వారికి పనులు కల్పించేలా కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రతి గ్రామం నుంచి రోజుకు 100 నుంచి 150 మందికి ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ శాఖ నిర్ణయించింది. వ్యవసాయ పనులు తగ్గిన సమయంలో గ్రామీణ కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఆదాయ వనరుగా ఉపాధి హామీ పనులు అందుబాటులో ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేయనున్నారు. ముఖ్యంగా కరవు ప్రభావిత మండలాల్లో ఉపాధి కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు.ప్రస్తుతం రాష్ట్రంలో 52.46 లక్షల కుటుంబాలకు చెందిన 1.08 కోట్ల మంది జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వీరికి కొనసాగుతున్న ఉపాధి అవకాశాలతో పాటు కొత్తగా పనులు కోరుకునే కుటుంబాలను కూడా పథకంలోకి తీసుకురావడం ద్వారా కరవు పరిస్థితుల్లో ఆదాయ నష్టాన్ని కొంతమేర తగ్గించాలన్నది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది.18 ఏళ్లు నిండిన గ్రామీణులు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం నిర్ణీత దరఖాస్తు ఫారాన్ని పూర్తి చేసి ఆధార్‌కార్డు, ఫొటోను జత చేయాలి. సంబంధిత పత్రాలతో దరఖాస్తును గ్రామ పంచాయతీ కార్యదర్శికి సమర్పించాలి. కార్యదర్శి దరఖాస్తును పరిశీలించిన అనంతరం మండల కార్యాలయానికి పంపిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో దరఖాస్తు, సంబంధిత పత్రాలను పరిశీలించి అర్హతను నిర్ధారిస్తారు. అనంతరం జాబ్‌కార్డు జారీ చేస్తారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ఈ ప్రక్రియను వేగవంతం చేసి 15 రోజుల్లోనే కార్డు అందించాలని ప్రభుత్వం ఆదేశించింది. వర్షాభావ పరిస్థితుల్లో వ్యవసాయ పనులు తగ్గినప్పటికీ గ్రామీణ కుటుంబాలకు ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉండేలా చేయడం ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. ముఖ్యంగా కరవు ప్రభావిత ప్రాంతాల్లో స్థానికంగా పనులు కల్పించడం ద్వారా కూలీలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లే అవసరాన్ని తగ్గించే అవకాశం ఉంది.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే సక్సెస్

# 1,090 కోట్ల స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల రద్దు

**హైదరాబాద్, అక్టోబరు 5, పెన్ పవర్:**
హైదరాబాద్ కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు కూడళ్లలో చేపట్టాలని భావించిన రూ.1,090 కోట్ల స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టును జీహెచ్ఎంసీ రద్దు చేసింది. వన్‌వే విధానం అమలు చేసిన తర్వాత ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడంతో భారీ వ్యయంతో నిర్మాణాలు చేపట్టడం అవసరం లేదని ప్రభుత్వం భావించింది. జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో పనులను నిలిపివేశారు. కాంట్రాక్టర్లు కేఎన్ఆర్, మేఘాతో చేసుకున్న ఒప్పందాలను కూడా రద్దు చేశారు. ఇదే సమయంలో పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు కొత్త ఎలివేటెడ్ కారిడార్‌కు మార్గం సుగమమైంది.హైదరాబాద్ నగరానికి కీలకమైన కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు ప్రధాన కూడళ్లలో చేపట్టాలని ప్రతిపాదించిన స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి బ్రేక్ పడింది. మొత్తం రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో రెండు ప్యాకేజీలుగా చేపట్టిన ఈ పనులను రద్దు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. నిర్మాణ పనులు ప్రారంభిస్తే కొంతకాలం పాటు నగరంలోని ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయంగా వన్‌వే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.నెల రోజుల క్రితం అమలు చేసిన వన్‌వే విధానంతో మొదట్లో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే ఒకట్రెండు రోజుల తర్వాత పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. మూడో రోజు నుంచి ప్రధాన సిగ్నళ్ల వద్ద ఎక్కువసేపు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా వాహనాలు సాఫీగా కదలడం ప్రారంభించాయి. దీంతో కేబీఆర్ పార్కు చుట్టుపక్కల ట్రాఫిక్ సమస్యను భారీ నిర్మాణాలు చేపట్టకుండానే పరిష్కరించే అవకాశం ఉందని అధికారులు భావించారు.ట్రాఫిక్ రద్దీ మెరుగుపడిన నేపథ్యంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లు నిర్మించడం అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించింది.పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారి జయేశ్‌రంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి పరిసరాలతో పాటు ఇతర కూడళ్లలో ప్రతిపాదించిన నిర్మాణాలను రద్దు చేయాలని నిర్ణయించారు. ఆయా పనుల కోసం కేఎన్ఆర్, మేఘా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసేందుకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. దీంతో కేబీఆర్ పార్కు చుట్టూ భారీ నిర్మాణాలతో ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన పాత ప్రణాళికకు తెరపడింది.ఇదే సమయంలో పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పంజాగుట్ట ఎన్ఎఫ్‌సీఎల్ కూడలి నుంచి జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ రోడ్డును, అంటే జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36ను కలుపుతూ ఆరు లైన్ల పైవంతెన నిర్మించనున్నారు. ఈ కారిడార్ సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవు ఉండనుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని ముఫకంజా విద్యాసంస్థల సమీపంలో పైవంతెనపైకి ఎక్కే వాహనాలు నేరుగా జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ కిందకు చేరుకునేలా డిజైన్ రూపొందించనున్నారు. అదే విధంగా చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ వద్ద కారిడార్‌పైకి ఎక్కే వాహనాలు ముఫకంజా కాలేజీ ప్రాంతంలో దిగేలా ఏర్పాట్లు చేయనున్నారు.బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 వైపు వెళ్లే వాహనాల కోసం ఎలివేటెడ్ కారిడార్ నుంచి జలగం వెంగళరావు పార్కు వరకు ప్రత్యేక ర్యాంపును నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం డిజైన్ల రూపకల్పన పూర్తికావాల్సి ఉండటంతో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం, నిర్మాణ విధానం, ఇతర సాంకేతిక అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కేబీఆర్ పార్కు చుట్టూ ప్రతిపాదించిన పాత ప్రాజెక్టు రద్దు కావడంతో కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ బాధ్యతను జీహెచ్ఎంసీ మేఘా సంస్థకు అప్పగించింది.ఈ మార్పుతో భారీ స్థాయి కూడళ్ల అభివృద్ధికి బదులుగా ట్రాఫిక్ రద్దు వేగవంతం చేసే ప్రత్యామ్నాయ మౌలిక వసతులపై దృష్టి సారించినట్టైంది. ముఖ్యంగా పంజాగుట్ట--బంజారాహిల్స్--జూబ్లీ చెక్‌పోస్టు మార్గంలో సిగ్నల్ ఆధారిత ట్రాఫిక్‌ను తగ్గించి, వాహనాల నిరంతర రాకపోకలకు అనువైన కారిడార్ ఏర్పాటు చేయడమే కొత్త ప్రణాళిక ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

## ఘనంగా అశోక్ సింఘాల్ శత జయంతి వేడుకలు

**హైదరాబాద్: పెన్ పవర్:** హైదరాబాద్ లో విశ్వహిందూ పరిషత్ అగ్రనేత దివంగత అశోక్ సింగల్ శతజయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్యఅతిథిగాపాల్గొన్నారు. అశోక్ సింగల్ శత జయంతి వేడుకల సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వహిందూ పరిషత్ హిందూ సమాజ సంఘటితం కోసం మరియు ధార్మిక చైతన్యం కోసం అయోధ్య శ్రీరామజన్మభూమి ఉద్యమంలో అశోక్ సింగల్ పోషించిన కీలక పాత్రను స్మరించుకున్నారు. అలాగే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో అశోక్ సింగల్ పాత్ర పోషించిన గురించితెలిపారు.25 లక్షల మందితో ప్రోగ్రాంను నిర్వహించడాన్ని కొనియాడారు . శ్రీరామ జన్మభూమి ఏర్పాటు చేయడంలో అశోక్ సింగల్ పాత్ర గణనీయమైందని అన్నారు

## సూర్యాపేట జిల్లాలో "గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ - క్యూవిఎస్ఈ" పేరుతో భారీ ట్రేడింగ్ మోసం

**సూర్యాపేట: పెన్ పవర్:** జిల్లాలో భారీ సైబర్ మోసం నమోదయింది. గ్లోబల్ ఇన్వేస్ట్ మెంట్ క్యూవిఎస్ఈ" పేరిట జరిగిన మోసం బయటపడింది. రోజువారి చెల్లింపులు, అకర్షణీయ కమిషన్లు అనగానే జనాలు ట్రాప్ లో పడ్డారు. యాప్లోఎంట్రీకి రూ.50 వేల డిపాజిట్. రోజుకు 5 డాలర్లు చెల్లిస్తామంటూ బురిడీ కొట్టారు. కొత్త సభ్యుడిని చేర్పిస్తే రూ.7,500 కమిషన్ ఇస్తామనడంతో కమిషన్ల కోసం దళారులు సభ్యులను భారీగా చేర్పించారు.గ్రామీణ ప్రజలే టార్గెట్ గా దందా నడిచింది. నమ్మి పెట్టుబడి పెట్టిన 110 మంది బాధితులు బయటపడ్డారు. ఒక్క నూతనకల్ గ్రామం నుంచే రూ.30 లక్షలు సైబర్ నేరస్తుల ఖాతాల్లోకి వెళ్లినట్టు తెలుస్తోంది.."తక్కువ పెట్టుబడి - ఎక్కువ రాబడి" మాటలు నమ్మొద్దని ఎస్పీ నరసింహ హెచ్చరించారు.

## క్రికెటర్ తిలక్ వర్మకు ఘన స్వాగతం

**హైదరాబాద్: పెన్ పవర్:** 2026 ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకంతో మెరిసిన హైదరాబాదీ క్రికెటర్ తిలక్ వర్మ కు శంషాబాద్లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నాడు. విమానాశ్రయంలో తిలక్ వర్మకుఅభిమానులు, క్రీడాభిమానులు ఘన స్వాగతం పలికారు.

## కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే సక్సెస్

## 1,090 కోట్ల స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల రద్దు

**హైదరాబాద్, అక్టోబరు 5, పెన్ పవర్:** హైదరాబాద్ కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు కూడళ్లలో చేపట్టాలని భావించిన రూ.1,090 కోట్ల స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల ప్రాజెక్టును జీహెచ్ఎంసీ రద్దు చేసింది. వన్‌వే విధానం అమలు చేసిన తర్వాత ట్రాఫిక్ సమస్య గణనీయంగా తగ్గడంతో భారీ వ్యయంతో నిర్మాణాలు చేపట్టడం అవసరం లేదని ప్రభుత్వం భావించింది. జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి తదితర ప్రాంతాల్లో పనులను నిలిపివేశారు. కాంట్రాక్టర్లు కేఎన్ఆర్, మేఘాతో చేసుకున్న ఒప్పందాలను కూడా రద్దు చేశారు. ఇదే సమయంలో పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు కొత్త ఎలివేటెడ్ కారిడార్‌కు మార్గం సుగమమైంది.హైదరాబాద్ నగరానికి కీలకమైన కేబీఆర్ పార్కు చుట్టూ ఏడు ప్రధాన కూడళ్లలో చేపట్టాలని ప్రతిపాదించిన స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి బ్రేక్ పడింది. మొత్తం రూ.1,090 కోట్ల అంచనా వ్యయంతో రెండు ప్యాకేజీలుగా చేపట్టిన ఈ పనులను రద్దు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. నిర్మాణ పనులు ప్రారంభిస్తే కొంతకాలం పాటు నగరంలోని ప్రధాన మార్గాల్లో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉండటంతో అధికారులు ప్రత్యామ్నాయంగా వన్‌వే విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చారు.నెల రోజుల క్రితం అమలు చేసిన వన్‌వే విధానంతో మొదట్లో వాహనదారులు కొంత ఇబ్బంది పడ్డారు. అయితే ఒకట్రెండు రోజుల తర్వాత పరిస్థితి క్రమంగా మెరుగుపడింది. మూడో రోజు నుంచి ప్రధాన సిగ్నళ్ల వద్ద ఎక్కువసేపు నిరీక్షించాల్సిన అవసరం లేకుండా వాహనాలు సాఫీగా కదలడం ప్రారంభించాయి. దీంతో కేబీఆర్ పార్కు చుట్టుపక్కల ట్రాఫిక్ సమస్యను భారీ నిర్మాణాలు చేపట్టకుండానే పరిష్కరించే అవకాశం ఉందని అధికారులు భావించారు.ట్రాఫిక్ రద్దీ మెరుగుపడిన నేపథ్యంలో వందల కోట్ల రూపాయలు వెచ్చించి స్టీల్ బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లు నిర్మించడం అవసరం లేదని ప్రభుత్వం నిర్ణయించింది.పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, జీహెచ్ఎంసీ ప్రత్యేక అధికారి జయేశ్‌రంజన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ కూడా సమావేశంలో పాల్గొన్నారు.జూబ్లీ చెక్‌పోస్టు, కేబీఆర్ పార్కు గేట్, ముగ్ధా జంక్షన్, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి పరిసరాలతో పాటు ఇతర కూడళ్లలో ప్రతిపాదించిన నిర్మాణాలను రద్దు చేయాలని నిర్ణయించారు. ఆయా పనుల కోసం కేఎన్ఆర్, మేఘా సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేసేందుకు కూడా స్థాయీ సంఘం ఆమోదం తెలిపింది. దీంతో కేబీఆర్ పార్కు చుట్టూ భారీ నిర్మాణాలతో ట్రాఫిక్ నిర్వహణకు సంబంధించిన పాత ప్రణాళికకు తెరపడింది.ఇదే సమయంలో పంజాగుట్ట నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వరకు కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి జీహెచ్ఎంసీ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. పంజాగుట్ట ఎన్ఎఫ్‌సీఎల్ కూడలి నుంచి జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ రోడ్డును, అంటే జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 36ను కలుపుతూ ఆరు లైన్ల పైవంతెన నిర్మించనున్నారు. ఈ కారిడార్ సుమారు నాలుగు కిలోమీటర్ల పొడవు ఉండనుంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 3లోని ముఫకంజా విద్యాసంస్థల సమీపంలో పైవంతెనపైకి ఎక్కే వాహనాలు నేరుగా జూబ్లీ చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ కిందకు చేరుకునేలా డిజైన్ రూపొందించనున్నారు. అదే విధంగా చెక్‌పోస్టు మెట్రో స్టేషన్ వద్ద కారిడార్‌పైకి ఎక్కే వాహనాలు ముఫకంజా కాలేజీ ప్రాంతంలో దిగేలా ఏర్పాట్లు చేయనున్నారు.బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1 వైపు వెళ్లే వాహనాల కోసం ఎలివేటెడ్ కారిడార్ నుంచి జలగం వెంగళరావు పార్కు వరకు ప్రత్యేక ర్యాంపును నిర్మించే ప్రతిపాదన కూడా ఉంది. ప్రస్తుతం డిజైన్ల రూపకల్పన పూర్తికావాల్సి ఉండటంతో ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం, నిర్మాణ విధానం, ఇతర సాంకేతిక అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. కేబీఆర్ పార్కు చుట్టూ ప్రతిపాదించిన పాత ప్రాజెక్టు రద్దు కావడంతో కొత్త ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ బాధ్యతను జీహెచ్ఎంసీ మేఘా సంస్థకు అప్పగించింది.ఈ మార్పుతో భారీ స్థాయి కూడళ్ల అభివృద్ధికి బదులుగా ట్రాఫిక్ రద్దు వేగవంతం చేసే ప్రత్యామ్నాయ మౌలిక వసతులపై దృష్టి సారించినట్టైంది. ముఖ్యంగా పంజాగుట్ట--బంజారాహిల్స్--జూబ్లీ చెక్‌పోస్టు మార్గంలో సిగ్నల్ ఆధారిత ట్రాఫిక్‌ను తగ్గించి, వాహనాల నిరంతర రాకపోకలకు అనువైన కారిడార్ ఏర్పాటు చేయడమే కొత్త ప్రణాళిక ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

## అఖిలపక్ష నిరసనను విజయవంతం చేయాలి



**ఖమ్మం, పెన్ పవర్, అక్టోబర్: 5:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా లక్షలాది ఓట్ల తొలగింపునకు కారణమైన కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8న ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న నిరసన ప్రదర్శనను విజయవంతం చేయాలని ఖమ్మం రూరల్ మండల అఖిలపక్ష నాయకులు పిలుపునిచ్చారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వరంగల్ క్రాస్‌రోడ్డులో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు. ఇండియా కూటమి పిలుపు మేరకు పెవిలియన్ గ్రౌండ్ నుంచి జెడ్పీ సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకు జరిగే నిరసనలో పార్టీలకు అతీతంగా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బానోత్ కిషోర్ నాయక్, సీపీఐ నాయకుడు మిడకంటి వెంకటరెడ్డి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నంద్ర ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిన అనిత, తోట వీరభద్రం, ఊరడి సుదర్శన్‌రెడ్డి, పుచ్చకాయల సుధాకర్, నందిగామ కృష్ణ, వెంపటి సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేయాలి



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య



బ్రిడ్జి నిర్మాణ పనుల్లో అధికారులకు సూచనలు సలహాలు చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్: 5** అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన మండల ప్రత్యేక, సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యుత్ కోతలు సరఫరా లో అంతరాయాలపై సర్పంచులు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని విద్యుత్ సమస్యలను 15 రోజుల్లోగా పరిష్కరించి, శాశ్వత పరిష్కారం చూపాలని విద్యుత్ శాఖ ఏఈ, డీఈలను ఆదేశించారు.మండలంలోని ఏ గ్రామానికి వెళ్లినా రైతులు, సర్పంచులు విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై ఫిర్యాదులు చేస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వ నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. గ్రామాల్లోని ఖాళీ స్థలాలను గుర్తించి ప్రభుత్వ స్థలాలుగా బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ శారదను ఆదేశించారు.సమీక్షలో వ్యవసాయం, వైద్యం, విద్యుత్, ఐకేపీ, పంచాయతీరాజ్, నీటిపారుదల తదితర శాఖల అధికారులు తమ నివేదికలను సమర్పించారు. అనంతరం రాంపురం పాఖాల ఏటి వద్ద నిర్మిస్తున్న హైలెవల్ బ్రిడ్జి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్, ఇల్లెందు మార్కెట్ కమిటీ చైర్మన్ రాంబాబు, ఎంపీడీవో మంగమ్మ, తహసీల్దార్ శారద, ఎంఈవో మంకిడి వీరభద్రరావు, ఎంపీవో శ్రీలక్ష్మి, 20 గ్రామపంచాయతీల సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## గార్లలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి తేవాలి



ఎమ్మెల్యే కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఐ నాయకులు

**గార్ల, పెన్ పవర్, అక్టోబర్ 5** గార్లలో డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చి డయాలసిస్ రోగుల కష్టాలు తీర్చాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టె బోయిన శ్రీనివాస్ అన్నారు ఈ మేరకు సీపీఐ ఆధ్వర్యంలో ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ గార్ల మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన డయాలసిస్ రోగులు చికిత్స కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. తరచూ డయాలసిస్ చేయించుకోవాల్సిన రోగులకు ప్రయాణ ఖర్చులు, వైద్య ఖర్చులు ఆర్థిక భారంగా మారుతున్నాయని పేర్కొన్నారు. గార్ల ప్రభుత్వ ఆసుపత్రిలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తే పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలుగుతుందని అన్నారు.అలాగే ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్‌ను వినియోగంలోకి తీసుకురావడంతో పాటు విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన ఈ సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి తక్షణమే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోరం కనకయ్య హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈకార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, రాగం రమేష్, ధూపాటి జనార్దన్, కట్టెభోయిన బిక్షమయ్య, బాదం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# మున్నేరు పాలేరు కెనాల్ భూసేకరణ ఆపాలి



కలెక్టర్ కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

**గార్ల ,పెన్ పవర్, అక్టోబర్: 5:** గార్ల మున్నేరు పాలేరు లింక్ కెనాల్ నిర్మాణం, భూసేకరణ పనులను నిలిపివేసి జీవో ఎంఎస్ నెంబర్.98, జీవో ఎంఎస్ నెంబర్.07లను రద్దు చేయాలని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు న్యాయవాది విశ్వ జంపాల డిమాండ్ చేశారు.సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా బాధిత గిరిజన రైతులతో కలిసి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.రూ.204 కోట్లతో చేపడుతున్న 9.6 కి.మీ. కెనాల్‌తో గార్ల ఏజెన్సీ ప్రాంతానికి సాగు, తాగునీటి ప్రయోజనం ఉండదని, 600 ఎకరాలకు పైగా వ్యవసాయ భూములు దెబ్బతింటాయని తెలిపారు. పి ఈ ఎస్ ఏ నిబంధనలు, ఎస్ ఐ ఏ ఆర్ అండ్ ఆర్ ప్రక్రియలను పాటించకుండా భూసేకరణ చేపడుతున్నారని ఆరోపించారు. సర్వేలు, ఫారం సి నోటిఫికేషన్లను నిలిపివేసి, ముల్కనూరు వద్ద మున్నేరు రిజర్వాయర్ నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు.ఈకార్యక్రమంలో టీజేఎస్ నాయకుడు గిన్నారపు మురళి తారక రామారావు, బీజేపీ నాయకుడు వాంకుడోత్ శ్రీకాంత్, బత్తిని సుమన్, కుంట రామకృష్ణ, బాధిత రైతులు సోమ శ్రీకాంత్, బలుసు సత్యనారాయణ, భువనగిరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ ఫ్లైఓవర్ ప్రాజెక్ట్ ఎందుకు ఆగిపోయింది? కారణమేంటి?



**హైదరాబాద్ పెన్ పవర్:** కేబీఆర్ పార్క్ చుట్టూ రోడ్డు మీద ఏడెనిమిది ఫ్లైఓవర్లు, ఏడెనిమిది అండర్‌పాస్‌లతో భారీ సెట్ వేసేద్దామని ప్లాన్ చేస్తే.. తీరా చూస్తే పర్మిషన్ల దగ్గర సీన్ రివర్స్ అయింది.. కేబీఆర్ పార్క్ చుట్టూ 'రైట్ రైట్.. లెఫ్ట్ లెఫ్ట్' అని తిప్పే సరికి గంటల కొద్దీ ఉండే ట్రాఫిక్ జామ్‌లు కాస్త సగం పోయాయి. "ఇంత తేలిగ్గా అయ్యేదానికి వేల కోట్లు దండగ ఎందుకు బాస్?" అని జ్ఞానోదయం పొందిన సర్కారు.. పాత ప్రణాళికలోని అరడజను ఫ్లైఓవర్ల స్థానంలో.. 'ఒకే ఒక్క ఎలివేటెడ్ కారిడార్' అనే సింగిల్ విండో సిస్టమ్‌ను తీసుకొచ్చింది. అసలు ప్రాజెక్టే ఆగిపోయిందని నెత్తీ నోరూ బాదుకుంటున్న వారికి జీహెచ్ఎంసీ సస్పెన్స్ వీడదీసింది.. "ప్రాజెక్టు ఆగిపోలేదు భయ్యా.. సైజు తగ్గించి కాస్త బడ్జెట్ ఆదా చేశామంతే!" అని కబురు చల్లగా చెప్పింది. హైదరాబాద్ నగరంలో అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టిన మౌలిక వసతుల ప్రాజెక్టులో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. గతంలో ప్రతిపాదించిన భారీ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల సంఖ్యను తగ్గించి.. ప్రధాన ట్రాఫిక్‌ను సిగ్నల్ రహితంగా తరలించేలా కొత్త రీ-అలైన్‌మెంట్‌కు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. పాత ప్రతిపాదనలో 7 ఫ్లైఓవర్లు, 7 అండర్‌పాస్‌లు నిర్మించాలని భావించగా.. ఇప్పుడు ఒక ప్రధాన ఎలివేటెడ్ కారిడార్.. ఒక అండర్‌పాస్‌తో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే దిశగా ప్రణాళిక మారింది.

### రూ.1,090 కోట్ల ప్రాజెక్టుకు కొత్త రూపం

కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రభుత్వం తొలుత దాదాపు రూ.826 కోట్లతో ప్రాజెక్టును ప్రతిపాదించింది. అనంతరం అంచనా వ్యయం రూ.1,090 కోట్లకు చేరింది. రోడ్ నంబర్ 45, ఫిలింనగర్, మహారాజా అగ్రసేన్, క్యాన్సర్ హాస్పిటల్, ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్, టీవీ9 జంక్షన్ తదితర ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, స్టీల్ బ్రిడ్జిలు నిర్మించాలన్నది అప్పటి ప్రణాళిక.అయితే కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ఎకో సెన్సిటివ్ జోన్‌లో చెట్ల తొలగింపు అంశం న్యాయపరమైన సమస్యలకు దారితీయడంతో పనులు ముందుకు సాగలేదు. ఇదే సమయంలో కేబీఆర్ పార్క్ చుట్టూ అమలు చేసిన క్లాక్‌వైజ్ వన్‌వే ట్రాఫిక్ విధానం మంచి ఫలితాలను ఇచ్చింది. ప్రారంభంలో వాహనదారులకు కొంత ఇబ్బంది ఎదురైనా.. తర్వాత సిగ్నళ్ల వద్ద వేచి ఉండే సమయం తగ్గడంతో ట్రాఫిక్ ప్రవాహం మెరుగుపడింది.

### 4.4 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్

వన్‌వే విధానం సానుకూల ఫలితాలు ఇవ్వడంతో భారీ సంఖ్యలో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాల్సిన అవసరంపై అధికారులు పునరాలోచన చేశారు. ఇందులో భాగంగా కొత్త ప్రతిపాదనను సిద్ధం చేశారు. నాగార్జున సర్కిల్, ముఫ్ఫాకమ్ జా ఇంజినీరింగ్ కాలేజీ పరిసరాల నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు సుమారు 4.4 కిలోమీటర్ల పొడవున ఆరు లైన్ల ఎలివేటెడ్ ఫ్లైఓవర్ నిర్మించాలని నిర్ణయించారు.

ఈ కారిడార్ ద్వారా పంజాగుట్ట, నాగార్జున సర్కిల్ వైపు నుంచి ఐటీ కారిడార్ దిశగా వెళ్లే వాహనాలకు సిగ్నల్ రహిత ప్రయాణం కల్పించడం ప్రధాన లక్ష్యం. దీంతో కేబీఆర్ పార్క్ చుట్టూ ఉన్న ఒక్కో జంక్షన్ వద్ద వేర్వేరు ఫ్లైఓవర్లు నిర్మించే అవసరం తగ్గనుంది.

### రోడ్ నంబర్ 10-12 మధ్య అండర్‌పాస్

ప్రధాన ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు బంజారాహిల్స్ రోడ్ నంబర్ 10 నుంచి రోడ్ నంబర్ 12కు అనుసంధానంగా మరో అండర్‌పాస్ నిర్మించనున్నారు. అలాగే రోడ్ నంబర్ 1 వైపు వెళ్లే వాహనాలకు అనుకూలంగా జలగం వెంగళరావు పార్క్ వైపు ప్రత్యేక ర్యాంప్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

### శాశ్వతంగా వన్‌వే విధానం

కేబీఆర్ పార్క్ చుట్టూ ప్రస్తుతం అమల్లో ఉన్న వన్‌వే ట్రాఫిక్ విధానాన్ని శాశ్వతంగా కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. వన్‌వే మార్గంలోని డివైడర్ల పరిమాణాన్ని తగ్గించి రహదారిని మరింత విస్తరించి ఆరు లైన్ల సామర్థ్యానికి తీసుకురానున్నారు.

### రూ.400 కోట్ల వరకు ఆదా

పాత ప్రణాళికలోని బహుళ ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల స్థానంలో కొత్త డిజైన్‌ను అమలు చేయడం ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల వరకు నిధులు ఆదా అయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ రీ-అలైన్‌మెంట్ ప్రతిపాదనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భవిష్యత్‌లో పెరగనున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకుని ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడార్‌ను రూపొందిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

మొత్తంగా చూస్తే.. కేబీఆర్ ట్రాఫిక్ ప్రాజెక్టు రద్దు కాలేదు. భారీ నిర్మాణాల సంఖ్యను తగ్గించి, ప్రధాన ట్రాఫిక్ ప్రవాహాన్ని ఒకే ఎలివేటెడ్ కారిడార్‌పైకి మళ్లించేలా ప్రాజెక్టు రూపురేఖలు మారాయి. ప్రస్తుత వన్‌వే విధానం, కొత్త ఎలివేటెడ్ కారిడార్, అండర్‌పాస్ కలిసి పనిచేస్తే కేబీఆర్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# కేటీఆర్ లోకేష్ నోట ఒకే మాట....క్లారిటీ ఇచ్చేశారా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** రెండు తెలుగు రాష్ట్రాలలో రాజకీయం చూస్తే కొన్ని విషయాల్లో పోలికలు స్పష్టంగా కనిపిస్తూంటాయి. రాజకీయాల్లో పదవులు అవకాశాలు వారసత్వం ప్రాంతీయ పార్టీల వ్యూహాలు ఇవన్నీ కూడా ఎప్పుడూ చర్చకు వస్తూ సరికొత్త పోలికలను తెస్తూ ఉంటాయి. ఇక చూసుకుంటే రెండు తెలుగు రాష్ట్రాలలో నాలుగు ప్రాంతీయ పార్టీలు ఉన్నాయి. తెలంగాణాలో బీఆర్ఎస్ ఉంటే ఏపీలో టీడీపీ వైసీపీ జనసేన ఉన్నాయి. ఇందులో వారసులతో ముందు వరసలోకి వచ్చిన పార్టీలుగా బీఆర్ఎస్ టీడీపీలను చెప్పుకోవాలి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా కేటీఆర్ మంత్రిగా తెలంగాణా ప్రభుత్వంలో పనిచేస్తే ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా లోకేష్ మంత్రిగా పాలన ప్రస్తుతం సాగుతోంది. కాబోయే సీఎం ట్యాగ్ తో కేటీఆర్ లోకేష్ కొనసాగుతున్నారు.

**కేసీఆర్ అంటూ :**

ఇక 2023 ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ కనుక గెలిచి ఉంటే కేటీఆర్ ముఖ్యమంత్రి అయ్యేవారు అన్నది అందరికీ తెలిసిందే. కానీ అది జరగలేదు, అయితే 2028లో వచ్చే తెలంగాణా అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే కేటీఆర్ సీఎం అవుతారు అన్నది ఆ మధ్య దాకా వినిపించిన మాట. కానీ ఇటీవలనే ఆ పార్టీలో కీలక మార్పు కనిపిస్తోంది. పైగా తెలంగాణా రాష్ట్ర రాజకీయాన్ని కాంగ్రెస్ సీఎం రేవంత్ రెడ్డి ఇమేజ్ ని ఇతర బలాలను అంచనా వేసుకుంటూ బీఆర్ఎస్ సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. అందుకే కేసీఆర్ నే ముందు పెట్టి వచ్చే ఎన్నికల్లో పోరాడాలని నిర్ణయించుకుంది అని అంటున్నార్. అందుకే ఇటీవల కేరళలో జరిగిన కాంక్లేవ్ లో కేటీఆర్ తాను సీఎం క్యాండిడేట్ కాదని తేల్చేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే వచ్చే ఎన్నికలను ఎదుర్కొంటామని చెప్పి స్పష్టత ఇచ్చేశారు.

**లోకేష్ నోట కూడా :**

అయితే చిత్రంగా ఇదే మాట టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ నోట కూడా వచ్చింది. ఇటీవల ఇండియా టుడే నిర్వహించిన ఒక ఇంటర్వ్యూలో ఆయనకు ఇలాంటి ప్రశ్న ఎదురైంది. దానికి లోకేష్ చాలా మెచ్యూర్డ్ గా బదులిచ్చారు. ఆయన్ని యాంకర్ అడిగినది ఏమిటి అంటే ఏపీ ముఖ్యమంత్రి కావాలని కోరిక లేదా అని. లోకేష్ బదులిస్తూ తాను విదేశాలలో విద్యను అభ్యసించాను అని ఏపీలో విద్యా విధానం రానున్న తరాలు అవసరాలకు తగిన విధంగా తీర్చిదిద్దాలని ఉద్దేశ్యంతో విద్యా శాఖను తీసుకున్నాను అని బదులిచ్చారు. తనకు పదవుల కంటే ప్రజలకు సేవ చేయాలన్నదే మొదటి ప్రాధాన్యత అని ఫుల్ క్లారిటీ ఇచ్చారు. దాంతో లోకేష్ సీఎం రేసులో ప్రస్తుతానికి లేరు అన్నది వెల్లడించారు అని అంటున్నారు. నిజానికి ఏపీలో కూడా లోకేష్ సీఎం అంటూ ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. అది ఈ టెర్మ్ లో జరుగుతుందని కొందరు అంటూంటే 2029లో మరోసారి కూటమి గెలిస్తే పక్కా అని కూడా అంటున్నారు. కానీ లోకేష్ మాత్రం సీఎం పదవి మీద స్పష్టత ఇస్తూ తన రాజకీయ పరిణతిని చాటుకున్నారు అని అంటున్నారు.

**అప్పుడేనా మరి :**

మరి లోకేష్ కానీ కేటీఆర్ కానీ ఎపుడు ముఖ్యమంత్రులు అవుతారు అంటే దానికి సాధారణ శుభ ముహూర్తాలు మాత్రమే కాదు రాజకీయ ముహూర్తాలు కూడా కలసి రావాలని విశ్లేషకులు అంటున్నారు. కేసీఆర్ ని ముందు పెడితేనే తెలంగాణాలో బీఆర్ఎస్ గ్రాఫ్ పెరుగుతుందని సర్వేలు స్పష్టం చేస్తున్నాయి. అలాగే ఆయన తెలంగాణాను తెచ్చిన నాయకుడిగా జనంలో ఆదరణ కలిగిన వారుగా ఉన్నారు. అవన్నీ వర్కౌట్ అవుతాయనే కేసీఆర్ ని ముఖ్యమంత్రి అభ్యర్థిగా బీఆర్ఎస్ చెబుతూ వస్తోంది. ఏపీలో చూసినా కూటమిలో మూడు పార్టీలు ఉన్నాయి. అందువల్ల సీఎం గా చంద్రబాబు ఉంటే ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంటున్నారు. ఎంతో అనుభవం కలిగిన నేతగా, పరిపాలనా దక్షుడిగా చంద్రబాబు నాయకత్వంలోనే కూటమి ఎన్నికలకు వెళ్తే మరోసారి అధికారాంలోకి వస్తుందని అంచనాలు ఉన్నాయి. ఇక ఒకసారి అధికారం దక్కితే అయిదేళ్ల పాటు ఉంటుంది. దాంతో ఏపీలో లోకేష్ అయినా లేదా తెలంగాణాలో కేటీఆర్ అయినా వచ్చే ఎన్నికల తరువాత తమ పార్టీలు అధికారంలోకి వచ్చిన తరువాతనే సీఎంలుగా అయ్యేందుకు మార్గాలు సుగమం అవుతాయని అంటున్నారు. అలా రాజకీయంగా అన్ని విధాలుగా కలసివచ్చేదే అసలైన ముహూర్తం అని చెబుతున్నారు.

# యూటర్న్ తీసుకున్న చంద్రబాబు, పవన్..
# పులివెందుల పర్యటనలో మార్పు



**హైదరాబాద్ పెన్ పవర్:** ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సంయుక్తంగా నిర్వహించిన కడప జిల్లా పర్యటన రాజకీయంగా హాట్ టాపిక్ అవుతోంది. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సొంత జిల్లా కావడంతో ఈ పర్యటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం జగన్ రెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో కాకుండా చంద్రబాబు, పవన్ కార్యక్రమం ప్రొద్దుటూరు నియోజకవర్గంలో సాగడంపైనే విస్తృత చర్చ జరుగుతోంది. పులివెందుల పర్యటనకు వస్తారనగా, అందుకు రెండు రోజుల ముందు సీఎం, డీసీఎం టూర్ షెడ్యూల్ మారిపోవడంపై పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు.

జలజీవన్ మిషన్ అమరజీవి జలధార 2.0 కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కడప జిల్లాలో పర్యటించారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.30,156 కోట్ల వ్యయంతో జలధార పనులు చేపడుతున్నారు. ఇందుకు ప్రొద్దుటూరులో పైలాన్ ఆవిష్కరించారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటికి తాగునీరు సరఫరా చేయాలనేది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. అయితే ముందుగా జలధార 2.0 కార్యక్రమాన్ని మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గం పులివెందులలో నిర్వహించాలని భావించారు. పులివెందుల ఎమ్మెల్యేగా జగన్ ను ఆహ్వానించి, వేదికపై నుంచి ఆయనను ఇరుకన పెట్టే కార్యక్రమానికి డిజైన్ చేశారని చెబుతున్నారు. ఇక ముఖ్య నేతలు ఇద్దరూ పులివెందుల పర్యటనకు సిద్ధమవడం రాజకీయంగా వేడెక్కించింది. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే జగన్ సొంత ఇలాకాలో చంద్రబాబు, పవన్ వెళుతున్నారని ప్రచారం జరిగింది. ఇక ఇప్పటికే పలు అంశాల్లో జగన్ ను టార్గెట్ చేస్తున్న కూటమి ప్రభుత్వ అధినేతలు పులివెందులలో ఏ రాజకీయ బాంబు పేల్చుతారో అంటూ అంతా ఉత్కంఠగా ఎదురుచూశారు. కానీ, ఏమైందో ఏమో అనూహ్యంగా పులివెందుల కార్యక్రమాన్ని ప్రొద్దుటూరుకు మార్చేశారు. దీంతో కూటమి కార్యకర్తలు తీవ్ర నిరాశను వ్యక్తం చేశారు. మరోవైపు పులివెందుల కార్యక్రమం అంటూ హడావుడి చేసిన ప్రభుత్వం వెనక్కి తగ్గడంపై అనేక విధాలుగా చర్చ జరుగుతోంది.

అయితే పులివెందులలో జలజీవన్ మిషన్ కార్యక్రమం ఉంటుందని అధికారికంగా ప్రకటన చేయలేదని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కడప జిల్లాలో కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం భావించిందని, ఇందుకోసం పలు నియోజకవర్గాలను పరిశీలించామని మాత్రమే చెబుతున్నారు. సీనియర్ ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి స్వయంగా ఆహ్వానించడంతో

ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని ప్రొద్దుటూరులో ఏర్పాటు చేశారని అంటున్నారు. అయితే పులివెందుల పర్యటన వాయిదా వేయడానికి ఇంకో కారణం ఉందని స్థానికంగా ఒక ఆసక్తికర అంశం ప్రచారం జరుగుతోంది.వాస్తవానికి గత నెల 30న పులివెందులలో ఈ కార్యక్రమం నిర్వహించాలని భావించారని, ఇందుకోసం పులివెందులలో తాగునీటి గ్రిడ్ ప్రాజెక్టు పనులు శరవేగంగా చేపట్టారని అంటున్నారు. అయితే కార్యక్రమం నిర్వహించాల్సిన సమయంలో ప్రధానమైన చిత్రావతి రిజర్వాయర్ లో నీరు లేకపోవడంతో కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారని అంటున్నారు. నీళ్లు లేకుండా వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ప్రారంభిస్తే విమర్శలు ఎదుర్కోవాల్సివస్తుందనే ఆలోచనతో ప్రొద్దుటూరు నియోజకవర్గంలో గండికోట జలాశయం వద్దకు కార్యక్రమానికి మార్చారని అంటున్నారు. ఇక సీనియర్ ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి కూడా కార్యక్రమం నిర్వహించేందుకు ఉత్సాహం చూపడంతో సీఎం, డిప్యూటీ సీఎం ప్రొద్దుటూరు పర్యటనకు మొగ్గుచూపారని చెబుతున్నారు.

# మాధవ్ కెపాసిటీ, క్యాలిబర్ కు ఇది ఒక టెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ కు విశాఖ లోకల్ బాడీ ఎన్నికల టెన్షన్ పట్టుకుంది. మాధవ్ సొంత ప్రాంతం కావడంతో ఇక్కడ పట్టు నిలుపుకోవడం ఆయనకు అవసరంగా కనిపిస్తుంది. ఇప్పటికే మాధవ్ కు స్థానిక బీజేపీ నేతల నుంచి వత్తిడి పెరుగుతోంది. విశాఖ మేయర్ పదవిని బీజేపీ దక్కేలా చూడాలని కార్యకర్తల నుంచి ప్రెషర్ పెరుగుతోంది. అందుకే మాధవ్ తమకు గత అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించిన పొత్తులతో సంబంధం లేకుండా విశాఖ కార్పొరేషన్ కేటాయించాలని మాధవ్ కోరే అవకాశాలున్నాయి. సొంత ప్రాంతంలో పట్టు నిలుపుకో లేకపోతే ఇటు పార్టీలో అటు నాయకత్వంలోనూ పరువు పోతుంది. అందుకే మాధవ్ ఎలాగైనా పట్టుబట్టి విశాఖ మేయర్ స్థానాన్ని బీజేపీకి దక్కించుకునేలా చూడాలని భావిస్తున్నారు. ఇప్పటికే మాధవ్ దీనిపై ఒక ప్రకటన కూడా చేయడంతో ఆయన కూటమి సమావేశంలో కొంత కటువుగానే మాట్లాడే అవకాశాలు ఉండొచ్చన్నది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా వినిపిస్తుంది.

**టీడీపీ కూడా బలంగా...**

ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు విశాఖపట్నం స్థానిక సంస్థలు మరియు జీవీఎంసీ మేయర్ పీఠంపై కూటమిలో నెలకొన్న రాజకీయ పోరు ఉత్కంఠను రేపుతోంది. విశాఖపట్నంలో జీవీఎంసీ మేయర్ పదవిని దక్కించుకోవాలని బీజేపీ గట్టిగా ప్రయత్నిస్తుండగా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆ పార్టీ కూడా పట్టుదలగా ఉంది. మరొకవైపు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిది కూడా విశాఖపట్నమే కావడంతో కొంత పట్టుబట్టే అవకాశాలున్నాయి. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిలో భాగంగా విశాఖలో సీట్ల సర్దుబాటు, మేయర్ స్థానం ఎవరికి దక్కుతుందనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఎవరిని ఎవరు ఒప్పించగలరు? అన్న దానిపై మాధవ్ కెపాసిటీ, క్యాలిబర్ లు ఆధారపడి ఉంటాయన్నది పార్టీ నేతల నుంచి కార్యకర్తలు వరకూ అంటున్న కామెంట్స్.

**మాధవ్ వ్యూహం ఇదే అయినా...**

విశాఖ కేంద్రంగా పార్టీని బలోపేతం చేస్తూ, ప్రతి గ్రామం, వార్డు స్థాయిలో బీజేపీ జెండా ఎగరాలని, స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని కేడర్‌కు పీవీఎన్ మాధవ్ దిశానిర్దేశం చేశారు. మేయర్ స్థానానికి పోటీపై తగిన సమయంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. అయితే మాధవ్ మాటకు ఎంత మేరకు టీడీపీ నుంచి సానుకూలత లభిస్తుందన్నది సందేహమే. ఎందుకంటే విశాఖపట్నంలో అనేక పరిశ్రమలు వస్తున్నాయి. అక్కడ మేయర్ పీఠంపై టీడీపీ ఇప్పటికే గురి పెట్టి ఉంది. అతి పెద్ద కార్పొరేషన్ కావడంతో ఈ స్థానాన్ని వదులుకునేందుకు విశాఖ టీడీపీ నేతలతో పాటు పార్టీ నాయకత్వం కూడా సిద్ధంగా ఉండకపోవచ్చు. బీజేపీ కేంద్ర నాయకత్వం జోక్యం చేసుకుంటుందా? లేదా? అన్నది ఇప్పుడే చెప్పలేం. ఎందుకంటే స్థానిక సంస్థల ఎన్నికలు కావడంతో ఢిల్లీ జోక్యం అంతగా ఉండదంటున్నారు. మరి మాధవ్ వల్ల మేయర్ అభ్యర్థిత్వం బీజేపీకి దక్కితే కొంత వరకూ ఆయన విజయం సాధించినట్లే. ఇక గెలుపోటములు కూడా ఆయనకు మరొక సవాలుగా మారే అవకాశముంది.

# బీసీ రిజర్వేషన్లు ...ఓటు బ్యాంక్ డ్రామాలు

**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:**
ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన జీవోలను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీల మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న సర్వోన్నత న్యాయస్థానం నిబంధనలకు ఈ జీవోలు విరుద్ధమని స్పష్టం చేస్తూ, ఆరు వారాల్లో ప్రక్రియ ప్రారంభించి ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. అయితే, ఈ తీర్పుపై సుప్రీంకోర్టుకు వెళ్తామని సీఎం చంద్రబాబు ప్రకటించినప్పటికీ, న్యాయపరంగా ఇది నిలబడదని తెలిసి కూడా వేస్తున్న రాజకీయ ఎత్తుగడగానే స్పష్టమవుతోంది.రాజ్యాంగబద్ధమైన పరిమితులను అధిగమించి రిజర్వేషన్లు కల్పించడం సాధ్యం కాదని రాజ్యాంగ ధర్మాసనాలు ఎన్నోమార్లు స్పష్టం చేశాయి. సుప్రీంకోర్టు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. స్థానిక సంస్థల్లో రాజకీయోచిత వెనుకబాటుతనాన్ని నిర్ధారించేందుకు త్రిసభ్య కమిషన్ ద్వారా ట్రిపుల్ టెస్ట్ నిర్వహించకుండా , 50 శాతం సీలింగ్‌ను దాటుకుని ఏ రాష్ట్రమూ రిజర్వేషన్లు పొడిగించకూడదని పేర్కొంది. ఈ తీర్పులు ఉన్నప్పటికీ 34 శాతం కోటాతో జీవోలు తెచ్చి, అది కోర్టుల్లో చెల్లదని తెలిసీ సుప్రీంకోర్టుకు వెళ్లడం కేవలం రాజకీయ వ్యూహాల్లో భాగంగానే జరుగుతోంది. ఈ తరహా రాజకీయ వ్యూహాలు తెలుగు రాష్ట్రాలకు కొత్తవేమీ కావు. ఉమ్మడి ఏపీ సమయం నుంచి మొన్నటి తెలంగాణ పంచాయతీ ఎన్నికల వరకు కూడా ప్రభుత్వాలు 50 శాతానికి మించి బీసీ కోటాను పెంచుతూ నిర్ణయాలు తీసుకోవడం, న్యాయస్థానాలు వాటిని అడ్డుకోవడం క్రమబద్ధమైన పరిణామంగా మారింది. తెలంగాణలోనూ బీసీ రిజర్వేషన్లపై గతంలో తెచ్చిన ఆర్డినెన్సులు కోర్టుల్లో నిలబడలేక చివరకు 50 శాతం లోపే ఎన్నికలు నిర్వహించాల్సి వచ్చింది. ప్రభుత్వాలు రాజ్యాంగ నిపుణుల సలహాలు తీసుకోకుండా లేదా తెలిసీ విస్మరించి, ఎన్నికల ముందు భారీ రిజర్వేషన్ల హామీలు ఇవ్వడం ఒక అనవసర సంప్రదాయంగా మారింది. ఈ తరహా పరిమితికి మించిన రిజర్వేషన్ల హామీలు వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ఇచ్చేవి కావు. ఇవి ప్రధానంగా ఓటు బ్యాంకులను ఆకట్టుకునేందుకు ఆడే రాజకీయ క్రీడ. బీసీ వర్గాల్లో అత్యాశలు, ఆకాంక్షలు రేకెత్తించడం, ఆపై జీవోలను సిద్ధం చేయడం, న్యాయస్థానాలు రాజ్యాంగ చట్రంలో వాటిని కొట్టేయగానే మేము బీసీలకు న్యాయం చేయాలని చూశాం, కానీ కోర్టులు అడ్డుకున్నాయి అంటూ సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం రాజకీయ పార్టీల పరిపాటిగా మారింది. దీనివల్ల అసలైన లబ్ధిదారులకు న్యాయం జరగకపోగా, స్థానిక సంస్థల ఎన్నికలు సుదీర్ఘకాలం పాటు వాయిదా పడి స్థానిక పాలన స్తంభించిపోతోంది. వాస్తవానికి, బీసీలకు స్థానిక సంస్థల్లో చట్టబద్ధమైన అధిక ప్రాతినిధ్యం కల్పించాలనే నిజమైన చిత్తశుద్ధి ప్రభుత్వాలకు ఉంటే, ముందుగా ట్రిపుల్ టెస్ట్ ద్వారా క్షేత్రస్థాయి డాటాను సేకరించి, రాజ్యాంగ సవరణల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలి. లేదా 50 శాతం పరిమితికి లోబడే బీసీలకు గరిష్టంగా లబ్ధి చేకూరేలా సీట్ల కేటాయింపు చేయాలి. కానీ, ఆచరణాత్మక పరిష్కారాలను విస్మరించి, న్యాయపోరాటం పేరుతో కాలయాపన చేయడం వల్ల సమయం, ప్రజాధనం వృథా కావడం తప్ప మరే ఫలితం ఉండదు. హైకోర్టు తీర్పు ను బట్టి చూస్తే సుప్రీంకోర్టుకు వెళ్లినా ఏపీ ప్రభుత్వానికి ఉపశమనం లభించే అవకాశాలు అత్యల్పం. కాబట్టి కోర్టుల వల్ల జరగలేదనే రాజకీయ నెపం నెట్టడం ఆపి, సుప్రీంకోర్టు నిర్దేశించిన 50 శాతం పరిమితికి లోబడి ఎన్నికల ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తి చేయడమే ప్రజాస్వామ్య బద్ధమైన మార్గం. బీసీ సమాజం కూడా కేవలం కాగితాలపై ఇచ్చే 34 శాతం హామీల కంటే, చట్టబద్ధంగా అమలుకు సాధ్యమయ్యే ప్రాతినిధ్యంపైనే స్పష్టమైన రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయం వినిపిస్తోంది.

**డేటాను పూర్తిగా పరిశీలించకుండానే**

2025 డిసెంబర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ సర్వే నిర్వహించింది. రాష్ట్ర జనాభా, సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగం, ఇళ్లు, ఆస్తుల స్థితిగతులతో పాటు అన్ని కీలక వివరాలను సేకరించింది. 2026 జూన్‌లో ఈ వివరాలను స్థానిక సంస్థల ముందుంచి ప్రజలు వెరిఫై చేసుకునే అవకాశం కల్పించింది. మొత్తం 39 అంశాలపై సామాజిక ధ్రువీకరణ చేపట్టారు. ఈ డేటా ఆధారంగా రాష్ట్ర జనాభాలో బీసీలు దాదాపు 50.42% (గ్రామీణ ప్రాంతాల్లో 48.84%, పట్టణాల్లో 54.35%) ఉన్నట్లు తేలింది. ఈ మేరకు బీసీలకు పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 1/3వ వంతు, గ్రామీణ స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్లు కల్పించడానికి రెండు జీవోలను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో కె.కృష్ణమూర్తి, వికాస్ కిషన్‌రావ్ గాప్లీ, సురేష్ మహాజన్, బిర్రు ప్రతాప్‌రెడ్డి కేసుల్లో ఇచ్చిన తీర్పు ప్రకారం రిజర్వేషన్లు 50%కి మించకూడదంటూ ప్రతివాదులు ఈ జీవోలను హైకోర్టులో సవాల్ చేశారు. ఆ తీర్పులు వెలువడే నాటికి, నేటికీ పరిస్థితులు మారాయని సమగ్ర కుటుంబ సర్వే తేల్చిందని రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. రాజకీయ రిజర్వేషన్లను కేవలం జనాభా ఆధారంగా కాకుండా సామాజిక, ఆర్థిక పరిస్థితుల ఆధారంగా చేపడుతున్నట్లు హైకోర్టుకు వివరించినట్లు ప్రభుత్వం తెలిపింది. అయినప్పటికీ రిజర్వేషన్లు 50%కి మించకూడదన్న కారణంతో హైకోర్టు ఆ రెండు జీవోలను రద్దు చేసింది.కె.కృష్ణమూర్తి, వికాస్ గాప్లీ కేసుల్లో తీర్పులను లోతుగా విచారించి సేకరించిన డేటా అందుబాటులో ఉంటే రిజర్వేషన్లు 50 శాతం మించొచ్చు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కుటుంబ సర్వే ద్వారా సేకరించిన సమాచారాన్ని స్థానిక సంస్థలన్నీ ధ్రువీకరించాయి. ఆ ప్రక్రియ సరిగా జరిగిందా లేదా అని పరిశీలించడానికి బదులు హైకోర్టు దాన్ని పూర్తిగా రద్దు చేయడం సరికాదని సుప్రీంకోర్టు పిటిషన్‌లో పేర్కొంది. రిజర్వేషన్లపై 50% పరిమితి అన్నివేళలా తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనేమీ కాదని 'జనహిత్ అభియాన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు తీర్పులో పేర్కొందని ఏపీ ప్రభుత్వం గుర్తుచేసింది. స్థానిక సంస్థల పాలక వర్గాల కాలపరిమితి ముగిసిపోయిన నేపథ్యంలో ఎన్నికలు పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్ల ఖరారుకు తగిన కసరత్తు చేసిందని, కేవలం జనాభా ప్రాతిపదికన ఉజ్జాయింపుగా బీసీలకు 34% రిజర్వేషన్లను ఖరారు చేయలేదని స్పష్టం చేసింది.

## సవాళ్లతో ఏకం... సాధ్యమేనా

**విజయవాడ, అక్టోబరు 5, పెన్ పవర్:** దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఏపీ ఎన్నికల్లో తన సర్వేల ద్వారా సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన 'కేకే సర్వేస్' అధినేత కిరణ్ కొండేటి ఇప్పుడు డైరెక్ట్ రాజకీయాల్లోకి రంగప్రవేశం చేస్తున్నారు. ఇప్పటివరకు తెరవెనుక కూర్చుని ఓట్ల శాతం, సీట్ల అంచనాలు చెప్పిన ఆయన, ఇకపై ప్రత్యక్ష రాజకీయాల్లోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ స్టార్ హోటల్‌లో ప్రత్యేకంగా మీటింగ్ ఏర్పాటు చేసి 'ఏకం' అనే కొత్త రాజకీయ పార్టీని అధికారికంగా ప్రకటించారు.రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆసక్తి, అర్హత ఉన్న సాధారణ ప్రజలను ప్రోత్సహించడమే ఈ 'ఏకం' పార్టీ ప్రధాన లక్ష్యమని కిరణ్ తెలిపారు. కుల, మత, జాతి భేదాలకు అతీతంగా ప్రజలను ఒకే వేదికపైకి తెచ్చి రాజకీయాల్లోకి తీసుకురావడమే తన ధ్యేయమన్నారు. పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికల నుంచి మొదలుపెట్టి, భవిష్యత్తులో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఏకం అభ్యర్థులు పోటీ చేస్తారని ఆయన స్పష్టం చేశారు.గతంలో కొన్ని ఎన్నికల ఫలితాలను అంచనా వేసి లైమ్‌లైట్‌లోకి వచ్చిన కిరణ్ కొండేటి, ఆ తర్వాత ఇచ్చిన కొన్ని సర్వే అంచనాలు తలకిందులు కావడంతో సోషల్ మీడియాలో విమర్శలు ఎదుర్కొన్నారు. సర్వేల పేరుతో ప్రజల ముందుకు వెళ్తే ఇక ఫలితం ఉండదనే వాస్తవాన్ని గుర్తించే ఈసారి నేరుగా రాజకీయాల్లోకి వస్తున్నారని ప్రచారం సాగుతోంది.ఏపీలోని స్థానిక సంస్థల ఎన్నికలంటే గ్రామస్థాయిలో గ్రూప్ తగాదాలు, బలమైన కేడర్, భారీగా డబ్బుతో ముడిపడి ఉండే సున్నితమైన అంశం. కేవలం ఒక వేదికను సృష్టించి ఆసక్తి ఉన్నవారికి అవకాశం ఇస్తే సరిపోదని, క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నడపడం, ఎన్నికల ఖర్చులను భరించి గెలవడం అంత తేలికైన విషయం కాదనే ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. సర్వేల పేరిట సోషల్ మీడియాలో క్రేజ్ సంపాదించిన ఆయన..కొత్త రాజకీయ ప్రయాణంలో ఏ మేరకు రాణిస్తారనేది వేచి చూడాలి.

## అప్పాజీపేటలో అర్ధరాత్రి మిస్టరీ

**అనంతపురం అక్టోబరు 5, పెన్ పవర్:** అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. అవి ఎక్కడ నుంచి వస్తున్నాయో.. ఎలా పడుతున్నాయో అర్థం కాక గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. దీనిపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. పోలీసులు నిఘా పెట్టిన సమయంలో ఈ రాళ్లు పడ్డాయి. దీంతో ఇది ఏ దెయ్యం పనో అని గ్రామస్థులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. స్వామిజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. అయితే ఆకతాయిల పని అయి ఉంటుందని పోలీసులు అనుమానిస్తున్నట్టు తెలుస్తుంది. ప్రజలు మాత్రం రాత్రిపూట నిద్రపోలేకపోతున్నామని, ఈ సమస్యను త్వరగా పరిష్కరించమని కోరుతున్నారు.అనంతపురం జిల్లాలో అప్పాజీపేటలో ఓ వింత పరిస్థితి నెలకొంది. ఆ గ్రామంలో వారం రోజులుగా గాల్లోంచి రాళ్లు పడుతున్నాయి. ఈ పరిణామంతో రాత్రైతే చాలు వణికిపోతున్న జనం.. ఆ ఊర్లో ఉండాలంటే భయపడిపోతున్నారు. ఈ ఘటన వల్ల ఇప్పటికే చాలా ఇళ్లు డ్యామేజ్ అయ్యాయి. ఇళ్ల పైకప్పులు పగిలిపోయాయి. ఆ రాళ్లు ఎక్కడ నుంచి వస్తున్నాయో తెలియక ఆ ఊరి ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. రాత్రి పూట అందరూ ఒకే చోటకు చేరుతున్నారు. ఈ విషయంపై ప్రజలు రకరకాలుగా ఆలోచనలు చేస్తున్నారు. ఎవరైనా కావాలనే చేస్తున్నారా? దైవం పనా? దెయ్యం పనా? అనే ఊహగానాలు జోరందుకున్నాయి.ఈ బాధ భరించలేక ప్రజలు చివరి పోలీసులను ఆశ్రయించారు. దీనిపై ఫిర్యాదు అందుకున్న తర్వాత నలుగురు పోలీసులు ఆ గ్రామంలో గస్తీ కూడా నిర్వహించారు. ఆ సమయంలో కూడా గాల్లోంచి రాళ్లు పడ్డాయి. అయినా ఫలితం లేకపోయింది. ఈ విషయంపై ప్రజలు స్వామీజీల దగ్గరకు పరుగులు తీస్తున్నారు. పోలీసులతో పాటు సుమారు 20 మంది యువకులు కూడా ఈ మిస్టరీని ఛేదించడానికి కొండపైకి వెళ్లి పరిశీలించారు. అప్పుడు కూడా ఇళ్లపై రాళు వచ్చి పడ్డాయి.దీంతో ఆ గ్రామ ప్రజలు ఇది కచ్చితంగా అదృశ్య శక్తుల పనే.. అని అనుమానిస్తున్నారు. అయితే అలాంటి దానికి ఆస్కారం లేదని, ఇది ఆకతాయిలు చేస్తున్న పనిగా కనిపిస్తుందని పోలీసులు భావిస్తున్నట్టు సమాచారం. ఇందులో భాగంగానే పోలీసులు నిఘా ఉన్న సమయంలో రాళ్లు ఎలా పడుతున్నాయో గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు. కొందరు వ్యక్తులే కావాలనే రాళ్లు విసురుతూ భయాందోళనకు గురి చేస్తున్నారా? దీనికి ఇంకేదైనా కారణముందా? అనే కోణంలో దర్యాప్తు సాగుతుంది. అయితే రాళ్ల దాడి వల్ల ప్రజలు రాత్రిళ్లు ప్రశాంతంగా నిద్రపోలేకపోతున్నారు. ఎక్కువగా సాయంత్రం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు రాళ్లు పడ్డాయని స్థానికులు చెబుతున్నారు. చాలామంది గ్రామానికి వచ్చి వీడియోలో, ఫోటోలు తీసుకెళ్తున్నారని కానీ సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని వాపోతున్నారు. దీంతో తమకు భద్రత కల్పించాలని గ్రామస్థులు పోలీసులను కోరుతున్నారు.అయితే తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇలా జరిగిన ఘటనలు అనేకం జరిగాయి. ప్రకాశం జిల్లా, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలోని గ్రామాల్లో అచ్చం ఇలాగే రాత్రైతే ఇళ్లపై రాళ్లు పడేవి. 'జన విజ్ఞాన వేదిక' ప్రతినిధులు, పోలీసులు నైట్ విజన్ కెమెరాలు పెట్టి దర్యాప్తు చేశారు. ఆ విచారణలో గ్రామస్థులే ఆస్తి తగాదాల వల్ల ఈ రాళ్లు విసిరినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో అప్పాజీపేటలో కూడా పోలీసులు సాధారణ గస్తీని నిర్వహించే బదులు సీసీ కెమెరాలు, డ్రోన్లు లేదా నైట్ విజన్ కెమెరాలు ఉపయోగిస్తే ఈ రాళ్ల వాన మిస్టరీ త్వరగా వీడే అవకాశం ఉంటుంది.

## వారంలో ఎన్నికల నోటిఫికేషన్

**గుంటూరు అక్టోబరు 5, పెన్ పవర్:** స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు దాదాపుగా పూర్తి చేసాయి. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికల నగారా మోగించేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు. ఈ నెల 7న అమరావతి నుంచి రాష్ట్ర ఎన్నికల కమిషనర్... అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు , పోలీస్ కమిషనర్లతో అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు.సమావేశంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన క్షేత్రస్థాయి సంసిద్ధతను కమిషన్ నిశితంగా పరిశీలించనుంది. ఓటర్ల జాబితా ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, బ్యాలెట్ బాక్సులు లభ్యత, ఎన్నికల నిర్వహణా సిబ్బంది కేటాయింపు , సమస్యాత్మక ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు వంటి అంశాలపై కలెక్టర్లు, ఎస్పీలకు ఎస్ఈసీ స్పష్టమైన దిశానిర్దేశం చేయనుంది. నిష్పాక్షికంగా, పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయడమే లక్ష్యంగా యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్నారు.కలెక్టర్లు, ఎస్పీల భేటీ ముగిసిన వెంటనే... ఈ నెల 8 లేదా 9 తేదీల్లో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎస్ఈసీ అధికారికంగా విడుదల చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న మొదటి స్థానిక పోరు కావడంతో అందరూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కూటమి తమ పట్టును మరింత బలోపేతం చేసుకోవాలని భావిస్తుంటే... ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో పుంజుకోవడానికి ఈ ఎన్నికలను సవాలుగా తీసుకుంటోంది.సుప్రీంకోర్టులో బీసీ రిజర్వేషన్లపై ఎలాంటి తీర్పు వచ్చినా దానికి తగ్గట్లుగా నోటిఫికేషన్ ఇవ్వనున్నారు

## వైసీపీకి అభ్యర్థుల కష్టాలు

**నెల్లూరు, అక్టోబరు 5, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో వైసీపీకి అనేక ఇబ్బందులున్నాయి. అభ్యర్థుల ఎంపిక నుంచి వ్యయంతో పాటు అధికార పార్టీని ఎదుర్కొనడం అంత సులువుకాదు. మంచి అభ్యర్థులున్నా అధికార పార్టీని తట్టుకోవడం అంత ఈజీ కాదు. ఎందుకంటే.. అన్ని వైపుల నుంచి వత్తిడులు ఉంటాయి. ప్రజలు సహజంగా అధికార పార్టీ కి మద్దతుగా నిలిచేందుకు ఇష్టపడతారు. దీంతో ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అభ్యర్థుల వ్యయం కూడా వైసీపీకి ఇబ్బందిగా మారనుంది. మరొకవైపు పోలీసు కేసులు, ఇతర ఇబ్బందులు పార్టీ కార్యకర్తలను పోలింగ్ కేంద్రాల వద్దకు రావడం కూడా అంత సులువు కాదు. ఇవన్నీ అధిగమించడంతో పాటు ఓటర్లను తమ వైపునకు తిప్పుకునేందుకు ఇబ్బందులు కలగొచ్చు. ఆంధ్రప్రదే హైకోర్టు తీర్పు వెలువరించడం మరియు క్షేత్రస్థాయిలో ఉన్న పరిస్థితుల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎదుర్కొంటున్న ప్రధాన ఇబ్బందులు, సవాళ్లు అనేకం ఉన్నాయి. ఎన్నికల వాయిదా ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పూర్తయ్యే వరకు ఎన్నికలు నిర్వహించకూడదని వైసీపీ వేసిన పిటిషన్‌ను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఆరు వారాల్లోపు ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశించడంతో వైసీపీ వ్యూహానికి ఎదురుదెబ్బ తగిలింది. గత సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత పార్టీ క్యాడర్‌లో ఇంకా పూర్తి స్థాయిలో మనోధైర్యం రాలేదని, క్షేత్రస్థాయిలో నాయకులు, అభ్యర్థుల లభ్యతపై సందిగ్ధత ఉందనే చర్చ జరుగుతోంది.అన్ని స్థానాల్లోనూ కచ్చితంగా పోటీ చేయాలని పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినప్పటికీ, అధికార కూటమి ప్రభుత్వంలో స్థానికంగా ఎదురుదెబ్బలు తగులుతాయనే ఆందోళన కొందరిలో ఉంది. అందుకే ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఇష్టపడే అభ్యర్థులు కూడా కొంత కష్టంగానే కనిపిస్తారుఅభ్యర్థులను బలవంతంగా ఎంపిక చేసినప్పటికీ వారు ఖర్చు పెట్టుకునేందుకు ముందుకు రారు. అధికార పార్టీకి ధీటుగా తాము ఖర్చు చేయలేమని ముందుగానే చేతులెత్తాస్తారు. అది పార్టీ నియోజకవర్గ ఇన్ ఛార్జులకు భారంగా మారనుంది. ఆర్థిక భారాన్ని ఇన్ ఛార్జులు భరిస్తారా? లేక పార్టీ నాయకత్వం భరిస్తుందా? అన్న దానిపై స్పష్టత లేదు. దీంతో స్థానిక నియోజకవర్గాల ఇన్ ఛార్జులు మాత్రమే ఈ ఖర్చును భరాయించుకోవాల్సి వస్తే పోటీకి అయితే నిలబెడతారు కానీ, ఖర్చు మాత్రం ఎక్కువగా పెట్టరన్నది అందరికీ సత్యమే. ఖర్చు పెట్టని పరిస్థితుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, అందులోనూ ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవడం అంత సులువు కాదు. అదే ఇప్పుడు వైసీపీకి మైనస్ పాయింట్ గా కనిపిస్తుంది. జగన్ కేంద్ర పార్టీ ఆఫీసులో కూర్చుని ఎన్ని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చివరకు ఖర్చు చేయాల్సి రావడం లోకల్ లీడర్లే కావడంతో అంతగా సుముఖంగా ఉండరు. ఇవన్నీ వైసీపీ విజయాలకు బ్రేకులు వేస్తాయన్న విశ్లేషణలు మాత్రం జోరుగా వినిపిస్తున్నాయి

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఇజ్రాయెల్ జ్యోతిని వెలిగించటం వెనుకున్న చరిత్ర ఇదే



ఇజ్రాయెల్ దేశంలో అందించే అత్యుత్తమ గౌరవాల్లో ఒకటి తమ దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ జ్యోతిని వెలిగించటంగా చెబుతారు. ఆ అవకాశాన్ని ఇజ్రాయెల్ ఉత్తినే ఇవ్వదు. దీనికి చాలానే ప్రాసెస్ ఉంటుంది. దీని ఎంపిక కూడా సాదాసీదాగా సాగదు. అలాంటి అత్యుత్తమ గౌరవాన్ని కెప్టెన్ స్మిత్ ముచ్చార్ కు అందజేస్తున్నట్లుగా ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు స్వయంగా చెప్పటం గమనార్హం. వచ్చే ఏడాది జరిగే వేడుకల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు.. కెప్టెన్ స్మిత్ కూడా పాల్గొని.. జ్యోతిని వెలిగిస్తారని చెప్పటం తెలిసిందే. ఇంతకూ జ్యోతిని ఎందుకు వెలిగిస్తారు? దాని వెనకున్న చరిత్ర ఏంటి? ఇజ్రాయెల్ దేశంలో అందించే అత్యున్నత గౌరవాల్లో ఇదొకటని భావించటానికి కారణమేంటి? లాంటి ప్రశ్నలకు సమాధానాలు వెతికితే అసలు విషయం ఇట్టే అర్థమవుతుంది.

ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు హీబ్రూ క్యాలెండర ప్రకారం ప్రతి ఏడాది ఏప్రిల్ లేదంటే మేలో వస్తుంది. వచ్చే ఏడాది అంటే 2027లో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకలు ఇజ్రాయెల్ దేశ 79వ వేడుకలుగా చెప్పాలి. దీన్ని వచ్చే ఏడాది మేలో నిర్వహించనున్నారు. జెరూసలేంలోని మౌంట్ హెర్జ్ల్ ప్లాజాలో జరగనుంది. ఆ దేశ సంప్రదాయం ప్రకారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముగిసిన వెంటనే అదే రోజు సాయంత్రం ఎనిమిది గంటలకు జెరూసలేం లోని మౌంట్ హెర్జ్ల్‌లో జాతీయ జెండాను ఎగురవేసి ఈ జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఇజ్రాయెల్ చరిత్రలో బైబిల్ కాలం నాటి 12 తెగలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది పన్నెండు జ్యోతులను వెలిగిస్తారు. ఇజ్రాయెల్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముగిసి.. స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు ప్రారంభమయ్యే సంధి క్షణంలో ఈ జ్యోతులను వెలిగిస్తారు. సమాజానికి.. ఇజ్రాయెల్ దేశ రక్షణకు విశేష సేవలు అందించిన వారిని గుర్తించి ఈ గౌరవాన్నిఅందిస్తారు. జ్యోతిని వెలిగించే వారిని ఎంపిక చేయటానికి ఆ దేశంలో ప్రత్యేక ప్రాసెస్ ఉంటుంది. ఇజ్రాయెల్ ప్రధాని మౌఖికంగా చెప్పినా.. ఎంపిక కార్యక్రమం ఒక ప్రాసెస్ ప్రకారం సాగుతుంది. ఆ దేశ నిబంధనల ప్రకారం జ్యోతిని వెలిగించే వారిని ఎంపిక చేసేందుకు ఒక ప్రత్యేక పబ్లిక్ అడ్వైజరీ కమిటీని ఏర్పాటు చేసి.. దానికి మంత్రిత్వ శాఖల ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ ఎంపిక ప్రక్రియ పూర్తి అయితేనే ఆహ్వానం అధికారికంగా అందుతుంది. అయితే.. ఇజ్రాయెల్ ప్రధాని తాజా మాట ప్రకారం..జరగాల్సిన అధికారిక ప్రక్రియ అలా జరిగిపోతుంది. ఎందుకంటే.. ఇజ్రాయెల్ దేశానికి చెందిన వందలాది మంది పౌరుల ప్రాణాల్ని కాపాడిన వ్యక్తికి ఈ అత్యుత్తమ గౌరవాన్ని ఇచ్చేందుకు ఆ దేశానికి ఎలాంటి అభ్యంతరం ఉండదు. దీంతో.. వచ్చే ఏడాది మేలో జరిగే వేడుకల్లో భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు పైలట్ స్మిత్ కలిసి జ్యోతిని వెలిగించే చారిత్రక ఘట్టాన్ని చూసే వీలు ఉంటుంది. దీని ప్రత్యేకత ఏమంటే.. ఇప్పటివరకు ఇజ్రాయెల్ దేశ చరిత్రలో ఈ జ్యోతిని వెలిగించే అవకాశం విదేశీయులకు వచ్చినా.. వారంతా ఆ దేశ అనుకూల దేశాధినేతలు.. విదేశాల్లో ఉన్న యూదు వంశస్థులే. అందుకు భిన్నంగా యూదు నేపథ్యం లేని ఒక సాధారణ విదేశీ పౌరుడికి.. కేవలం అతను చూపిన అసాధారణ మానవత్వం.. ప్రాణాలు అర్పించే సాహసానికి కృతజ్ఞతగా ఈ అత్యున్నత గౌరవాన్ని ఇజ్రాయెల్ ప్రకటించటం మాత్రం ఇదే తొలిసారిగా చెప్పాలి. నిజానికి ఈ జ్యోతిని వెలిగించే గౌరవం కేవలం ఇజ్రాయెల్ పౌరులకు మాత్రమే ప్రత్యేకించిందని చెప్పాలి. ఈ జ్యోతిని వెలిగించే అవకాశాన్ని సాధారణంగా ఆ దేశంలోని సైనికులు.. సామాజిక కార్యకర్తలు.. విపత్కర పరిస్థితుల్లో ఇతరులను కాపాడిన సాధారణ వ్యక్తులను ఏటా ఎంపిక చేస్తారు. విదేశీయులకు ఆ అవకాశం ఇవ్వటం చాలా అరుదు. అయితే.. ఫ్లైదుబాయ పైలట్ కెప్టెన్ స్మిత్.. తన ప్రాణాల్ని పణంగా పెట్టి వందలాది ఇజ్రాయెల్ పౌరుల్ని కాపాడిన నేపథ్యంలో ఈ అరుదైన గౌరవాన్ని ఆయనకు ప్రకటించారు. 2017 నుంచి ఇజ్రాయెల్ ప్రభుత్వం జ్యోతిని వెలిగించే అంశంపై ఒక కొత్త సంప్రదాయాన్ని తీసుకొచ్చింది. ఇజ్రాయెల్ పౌరసత్వం లేకున్నా.. విదేశాల్లో ఉంటూ యూదు సమాజానికి లేదంటే ఇజ్రాయెల్ ప్రయోజనాలకు గొప్ప సేవ చేసిన విదేశీ యూదులకు ఈ జ్యోతిని వెలిగించే అవకాశాన్ని ఇవ్వటం మొదలు పెట్టారు. ఈ గౌరవాన్ని ఈ ఏడాది అర్జెంటీనా అధ్యక్షుడు హావియరర్ మైలీ అందుకున్నారు. హమస్.. హిజ్బుల్లా లాంటి సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా గుర్తించటంతో పాటు.. అంతర్జాతీయ వేదికలపై ఇజ్రాయెల్ కు ఆయన అందించిన తిరుగులేని మద్దతుకు కృతజ్ఞతగా ఇజ్రాయెల్ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. అర్జెంటీనా అధ్యక్షుడి తర్వాత జ్యోతి ప్రజ్వలన కోసం ఆహ్వానం అందుకున్న రెండో అంతర్జాతీయ నాయకుడిగా ప్రధాని మోడీ నిలుస్తారు. ఆసక్తికరమైన అంశం ఏమంటే.. భారత ప్రధాని నరేంద్ర మోడీకి ఈ ఏడాది ఫిబ్రవరిలో ఆ దేశ అత్యున్నత పురస్కారమైన స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ మెడల్ ను అందుకున్న ఏకైక భారత ప్రధానిగా నిలిచారు. ఇజ్రాయెల్ చరిత్రలో యూదేతర విదేశీ నేతగా అర్జెంటీనా అధ్యక్షుడు నిలిస్తే.. తర్వాతి స్థానంలో ప్రధాని మోడీ నిలుస్తారు. దీనంతటికి మించి.. ఒక విదేశీ సామాన్యుడిగా కెప్టెన్ స్మిత్ మొట్టమొదటి వ్యక్తిగా నిలుస్తారు.

# ఓట్ల తొలగింపుపై సుప్రీం జడ్జి తాజా వ్యాఖ్యలు విన్నారా?

ఓటరు జాబితా నుంచి ఓట్ల తొలగింపు అంశంపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ చేసిన తాజా వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారటమే కాదు.. రానున్నరోజుల్లో మరింత చర్చకు కారణం కావటం ఖాయంగా కనిపిస్తోంది. నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంలో ఆదివారం జరిగిన 19వ నల్సార్ - జస్టిస్ బీపీ జీవన్ రెడ్డి మెమోరియల్ మూట్ కోర్ట్ కాంపిటీషన్ లో కీలకోపన్యాసం చేశారు. ఈ సందర్భంగా దేశంలో ఓటల తొలగింపు వ్యవహారంపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అందరిని ఆకర్షిస్తున్నాయి. జస్టిస్ భూయాన్ వ్యాఖ్యలను చదవటానికి ముందు ఒక ఆసక్తికర అంశాన్ని ప్రస్తావించాల్సిందే. అదేమంటే.. తీవ్ర విమర్శలకు గురైన 'సర్' (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమాన్ని ఈ ఏడాది మేలో సుప్రీంకోర్టు సమర్థించింది. ఓటుహకంకు కల్పించటానికి అవసరమైన పత్రాలు సమర్పించలేని పౌరుల ఓట్లను తొలగించే అధికారం ఈసీకి ఉందని.. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్.. జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం తీర్పు ఇవ్వటం తెలిసిందే. ఇదిలా ఉంటే.. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ఇటీవల చేసిన వ్యాఖ్యల ఆధారంగానే సీఈసీ జ్ఞానేశ్ కుమార్పై కాంగ్రెస్ పార్టీ విమర్శల దాడిని పెంచింది. సీఈసీగా ఉండే హక్కును జ్ఞానేశ్ కుమార్ కోల్పోయారని జస్టిస్ భూయాన్ వ్యాఖ్యల ద్వారా తేలినట్లుగా కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. కట్ చేస్తే.. తాజాగా నల్సార్ లో అదే న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. ఇంతకూ ఆయన ఏమన్నారు? ఏమేం వ్యాఖ్యలు చేశారన్నది ఆయన మాటల్లోనే చదివితే.. ఓటరు జాబితా నుంచి మూకుమ్మడిగా పౌరుల ఓట్లను తొలగించి.. ఓటుహక్కును నిరాకరించటం రాజ్యాంగ విరుద్ధం. ఇలా చేయటానికి ఎవరికీ అధికారం లేదు. దీనిని ఏ కోర్టు సమర్థించదు. దేశంలోని పౌరులను ఓట్లు ఉన్నవారు.. ఓట్లు లేనివారు అంటూ రెండు వర్గాలుగా రాజ్యాంగం విభజించలేదు. లక్షల కొద్దీ ఓట్లను తొలగించి.. సొంత దేశంలోనే పౌరులను రెండో జాతివారిగా మార్చే ఏ ప్రక్రియ అయినా చట్ట విరుద్ధమైనదే. ఆ ప్రక్రియ రాజ్యాంగ హృదయంపై దాడే అవుతుంది. మూకుమ్మడిగా ఓట్లను తొలగించటం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, ఆర్టికల్ 326ను ఉల్లంఘించటమే అవుతుంది. భారత పౌరసత్వ విధానం ప్రకారం ఎన్నికల్లో ఓటు వేసే హక్కును.. ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునే హక్కును పౌరుడినుంచి ఎవరూ వేరు చేయటానికి వీల్లేదు.

ఓటుహక్కును పౌరుడి నుంచి వేరు చేయటం.. శరీరం నుంచి ఆత్మను వేరు చేయటమే అవుతుంది. మన పూర్వీకులు సుదీర్ఘకాలం సాగించిన స్వాతంత్ర్య పోరాట ఫలితమే ఓటుహక్కు. ఎన్నో త్యాగాలు చేస్తే కానీ ఈ ఓటుహక్కు రాలేదు. ఆర్టికల్ 326ను మార్చటం వీలుకాదు. ఏ అధికారిక వర్గానికి కానీ.. వ్యక్తికి కానీ ఆ అధికారం లేదు. ఇందుకు ఎవరూ అతీతులు కారు.

మరణించిన వారు తప్పించి.. బతికి ఉన్న అర్హులైన పౌరుల ఓట్లు తొలగించటం కుదరదు. ఒకసారి ఓటరు లిస్టులో ఓటు నమోదైన తర్వాత ఆ ఓటరుకు నోటీసులు ఇవ్వకుండా.. విచారణ జరపకుండా ఓటు తొలగించలేరు. ఒక ప్రజాస్వామ్య దేశంలో అత్యున్నత అధికారం ఉండేది ఆ దేశాధ్యక్షుడి కార్యాలయానికి కాదు.. ఆ దేశంలోని పౌరుడికి అన్న అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఫెలెక్స్ ఫ్రాంక్ ఫర్ద్ మాటను మర్చిపోకూడదు.

# నాకు పెళ్లి చేయండి సీఎం సారూ.. ఇదో వింత విజ్ఞప్తి




కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఒక గ్రామీణ యువకుడు కలిసిన తీరు చూస్తే ఎవరికైనా నవ్వు రాక మానదు. "సార్.. మీరు ఐదు గ్యారంటీలు ఇచ్చారు కదా.. ఇంకో ఆరో గ్యారంటీ కూడా పెట్టండి.. అదే 'పెళ్లిళ్ల గ్యారంటీ" అంటూ ఆయన వేసిన విజ్ఞప్తి ఇప్పుడు సోషల్ మీడియాలో టాప్ ట్రెండింగ్‌గా మారింది. "ఎకరాల కొద్దీ నల్లరేగడి భూములున్నాయి సార్.. కానీ ఒక్క అమ్మాయి కూడా ముఖం చూడటం లేదు" అని ఆ యువకుడు పడిన ఆవేదన వింటే నవ్వాలో ఏడ్వాలో అర్థం కాని పరిస్థితి.

**పెళ్లి చేయాలని సీఎంకు ఓ పల్లెటూరి యువకుడి విజ్ఞప్తి వైరల్**

కర్ణాటకలో ఓ గ్రామీణ వ్యక్తి చేసిన ఆసక్తికరమైన విజ్ఞప్తి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఫైవ్ గ్యారంటీస్'కు మరో కొత్త హామీని జోడించాలని కోరిన ఆ వ్యక్తి.. అందుకు చెప్పిన కారణం మాత్రం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. "సార్.. ఎకరాల కొద్దీ భూమి ఉన్నా గ్రామీణ యువకులను అమ్మాయిలు పెళ్లి చేసుకోవడానికి ఇష్టపడటం లేదు. దయచేసి దీనిపై ఏదైనా చేయండి" అంటూ ఆయన డీకే శివకుమార్‌ను కోరారు. సాధారణంగా ప్రభుత్వాన్ని ప్రజలు రోడ్లు, విద్యుత్, తాగునీరు, ఉపాధి, రైతు సమస్యలు, సంక్షేమ పథకాల వంటి అంశాలపై ప్రశ్నిస్తుంటారు. అయితే ఈ వ్యక్తి మాత్రం తన వ్యక్తిగతంగా కనిపించే సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం ఆసక్తిని రేకెత్తించింది. గ్రామీణ యువకులకు పెళ్లిళ్లు కావడం లేదని, దీనిపై ప్రభుత్వం ఏదైనా చర్య తీసుకోవాలని ఆయన కోరడం ప్రస్తుతం చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు పల్లెటూర్లలో "అబ్బాయికి పది ఎకరాల పొలం ఉంది" అంటే చాలు.. పెళ్లిచూపులకి పందిళ్లు వేసేసేవారు. కానీ కాలం మారింది.. కలలూ మారాయి.. ఇప్పుడు పొలంలో వంద ఎకరాలు ఉన్నా సరే.. "ఏదైనా ఐటీ ఉద్యోగం ఉందా? నెలకు చేతికి 'ఫిక్స్‌డ్' జీతం వస్తుందా? మెట్రో సిటీలో అపార్ట్‌మెంట్ ఉందా?" అని ఆరా తీస్తున్నారు. ఎండనపడి వ్యవసాయం చేసే రైతు కంటే చిన్న ఏసీ గదిలో కూర్చుని కోడింగ్ రాసే కుర్రాడికే డిమాండ్ పెరిగిపోయింది. పంట దిగుబడి వస్తుందో రాదో, ఆకాశం వైపు చూడాలి. వచ్చిన పంటకు గిట్టుబాటు ధర దక్కుతుందో లేదో మార్కెట్ వైపు చూడాలి. ఈ అనిశ్చితి మధ్య బతకడం కంటే నెల తిరిగేసరికి అకౌంట్‌లో పడే జీతమే బెటర్ అని నేటి విద్యావంతులైన అమ్మాయిలు భావిస్తున్నారు. పైగా గ్రామీణ జీవనం కంటే పట్టణాలలోని హంగులు, ఆర్భాటాలు, కెరీర్ అవకాశాలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఫలితంగా పల్లెల్లో ఎకరాలకు ఎకరాలు భూములు ఉన్న యువకులు పెళ్లి కాక విలవిలలాడుతున్నారు. "మా దగ్గర బంగారు లాంటి ఆస్తి ఉంది.. స్వచ్ఛమైన గాలి ఉంది.. సొంత ఇల్లు ఉంది" అని వారు ఎంత మొత్తుకున్నా.. "మీ దగ్గర 'ఆఫర్ లెటర్' ఉందా?" అనే ప్రశ్న ముందర వారి భూములు వెలవెలబోతున్నాయి. డీకే శివకుమార్ ప్రభుత్వం ఈ 'వివాహ గ్యారంటీ' పథకాన్ని మేనిఫెస్టోలో చేరుస్తుందో లేదో తెలియదు కానీ ఈ కుర్రాడి విజ్ఞప్తి మాత్రం సమాజంలో మారిన ఆలోచనా సరళికి అద్దం పడుతోంది. "భూమి ఉంటే భవిష్యత్తు భద్రం" అనే పాత సిద్ధాంతానికి కాలం చెల్లి, "జాబ్ ఉంటేనే జీవితం సైడ్" అనే కొత్త ట్రెండ్ మొదలైందని ఈ వింత ఘటన నిరూపిస్తోంది. ఏది ఏమైనా మన పల్లెటూరి జమీందార్లకు త్వరలోనే శుభవార్త అందాలని ఆశిద్దాం.

# మోడీ.. షేక్ హమ్దాన్.. నెతన్యాహు.. పరామర్శల ఫ్యాట్రర్న్ గమనించారా?



ఫ్లైదుబాయ్ విమానంలో చోటు చేసుకున్న భయాన ఉదంతం.. ఆ సందర్భంగా ఫ్లైట్ కెప్టెన్ స్మిత్ ప్రదర్శించిన అసమాన తెగువ.. మొండి ధైర్యం ప్రపంచం ఎప్పటికి గుర్తుంచుకునేలా మారింది. ఫ్లైదుబాయ్ విమానంలో చోటు చేసుకున్న భయాన ఉదంతం.. ఆ సందర్భంగా ఫ్లైట్ కెప్టెన్ స్మిత్ ప్రదర్శించిన అసమాన తెగువ.. మొండి ధైర్యం ప్రపంచం ఎప్పటికి గుర్తుంచుకునేలా మారింది. తీవ్ర గాయాలతో ఆసుపత్రి ఐసీయూలోచికిత్స పొందుతున్న అతడ్ని ఇప్పటివరకు నేరుగా పరామర్శించిన జాబితా నేటికి మూడుకు చేరింది. ఐసీయూలో చికిత్స జరుగుతున్న వేళ.. అందరి కంటే ముందుగా మాట్లాడింది భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. ఆయన్ను అభినందించటమే కాదు.. అతడి భారతమూలాల ప్రస్తావిస్తూ.. తమ దేశస్తుడి ఘనత ప్రపంచానికి తెలిసేలా చేశారు. అదే సమయంలో అతను వేగంగా కోలుకుంటున్నాడన్న విషయాన్ని తెలిసేలా చేశారు. ఆ తర్వాత దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్. కెప్టెన్ స్మిత్ తనపై ముద్దాడిన వైనం చాలా అరుదైనదిగా చెబుతున్నారు. తాజాగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు. ఆయన అసలీ దారుణ ఘటన ఎలా జరిగిందన్న విషయాన్ని ప్రపంచానికి తెలిసేలా చేశారు. త్వరలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం కెప్టెన్ స్మిత్ తో మాట్లాడనున్నట్లుగా చెబుతున్నారు.

ఇప్పటివరకు కెప్టెన్ స్మిత్ ను పరామర్శించిన ముగ్గురు ప్రముఖుల పరామర్శలను పరిశీలిస్తే ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. ఈ ముగ్గురు ప్రముఖుల పరామర్శల ప్యాట్రన్ ఒకరితో మరొకరిది సంబంధం లేనట్లుగా కనిపిస్తుంది. అంతేకాదు.. ఈ ముగ్గురు ప్రముఖుల పరామర్శల వేళ.. భిన్నమైన అంశాలు వెలుగులోకి రావటం ఆసక్తికరంగా చెప్పాలి. ఇంతకూ ఈ ముగ్గురి పరామర్శల కారణంగా ప్రపంచానికి ఏమేం తెలిసింది? వీరి పరామర్శల ప్యాట్రన్ లో ఎవరేం చేశారన్నది ఆసక్తికరం. కెప్టెన్ స్మిత్ తో తొలుత మాట్లాడిన భారత ప్రధాని నరేంద్ర మోడీ సంభాషణ మొత్తం అత్యంత సంక్షోభ సమయంలో ఒక భారతీయుడిగా అతను ప్రదర్శించిన సమయస్ఫూర్తి.. సాహసాన్ని కొనియాడటమే కాదు.. అతడికి ధైర్యం చెప్పటం.. అతడికి దన్నుగా యావత్ దేశం ఉందన్న సందేశాన్ని చెప్పటం ద్వారా.. అతడిలో మరింత ధైర్యాన్ని పెంచేలా చేశారు. అంతేకాదు.. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో అంతటి మానసిక ధైర్యం ఎలా వచ్చిందన్న మోడీ ప్రశ్నకు కెప్టెన్ స్మిత్ స్పందిస్తూ.. ఆ కష్ట సమయంలో తాను హనుమాన్ చాలీసా జపించినట్లుగా చెబుతూ.. ఆ ఆధ్యాత్మిక శక్తే తనలో అంతటి ధైర్యాన్ని నింపినట్లుగా చెప్పారు. అంతేకాదు.. తీవ్రంగా గాయపడిన వేళ.. ప్రయాణికుల కోసం కాక్ పిట్ తలుపులు ఎలా తెరిచారన్న దానిపై చర్చ జరిగింది. స్మిత్ తో మోడీ జరిపిన సంభాషణ మొత్తాన్నిచూస్తే.. ఒకవైపు అభినందన.. మరోవైపు ఆధ్యాత్మిక విశ్వాసంతో పాటు.. భారత పౌరుడి పరాక్రమం.. దేశానికి తెచ్చిన గుర్తింపు అంశాలపైనే నడిచింది. అదే సమయంలో.. అసలేం జరిగింది? అన్న వివరాలు బయటకు వచ్చేలా జరగలేదు. ఇక.. కెప్టెన్ స్మిత్ ను నేరుగా కలిసిన వారిలో తొలి వ్యక్తిగా దుబాయ్ యువరాజు నిలిచారు. ఐసీయూలో చికిత్స పొందుతున్న కెప్టెన్ ను నేరుగా కలిసి.. ఆయన్ను అభినందించటం కనిపిస్తుంది. ఈ సందర్భంగా కెప్టెన్ నుదిటి మీద పెట్టిన ముద్దుతో.. అతడి సాహసం తమ దేశ ప్రతిష్టను ఎంతలా పెంచిందన్న విషయాన్ని చెప్పకనే చెప్పేసిందని చెప్పాలి. తమ దేశానికి చెందిన ఫ్లైదుబాయ్ సంస్థకు చెందిన విమానంలో ఈ ఘటన జరగటం.. ప్రయాణికుల ప్రాణాలను కాపాడటంలో కెప్టెన్ స్మిత్ చూపిన కమిట్ మెంట్ ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఆయనకు అందుతున్న వైద్య చికిత్స మీద వివరాలు తెలుసుకోవటం.. ఆరోగ్యం త్వరగా కుదుటపడే అంశాల మీదనే చర్చ జరిగింది. దుబాయ్ యువరాజు పరామర్శ మొత్తం.. మానవీయ అంశాలు.. కెప్టెన్ కు అదుతున్న వైద్య సేవల చుట్టూనే ఎక్కువగా ఫోకస్ చేసినట్లు కనిపిస్తుంది. ఆదివారం కెప్టెన్ స్మిత్ తో వీడియో కాల్ ద్వారా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు పరామర్శ అత్యంత కీలకమైనదిగా చెప్పాలి. తన దేశ పౌరుల ప్రాణాల్ని కాపాడిన కెప్టెన్ ను స్వయంగా అభినందించటమే కాదు.. చాలా ఎమోషనల్ గా మాట్లాడారు. అదే సమయంలో అసలు కాక్ పిట్ లో ఏం జరిగిందన్న వివరాలు ప్రపంచానికి తెలిసేలా చేశారు. నువ్వు ఇజ్రాయెల్.. భారత్.. ప్రపంచానికే నిజమైన హీరోవి అంటూ ప్రశంసించటమే కాదు.. వచ్చే ఏడాది ఇజ్రాయెల్ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జ్యోతిని వెలిగించటానికి భారత ప్రధాని నరేంద్ర మోడీతో పాటు.. అతడు కూడా జ్యోతిని వెలిగిస్తారన్న విషయాన్ని అధికారికంగా వెల్లడించటమే కాదు.. స్వాతంత్ర్య వేడుకల్లో కలుద్దామన్న సందేశాన్ని కెప్టెన్ స్మిత్ కు నేరుగా తెలియజేశారు.

ఇజ్రాయెల్ ప్రధాని పరామర్శను చూస్తే.. భావోద్వేగంతో మాత్రమే కాదు.. కాక్ పిట్ లో అసలేం జరిగింది? కో పైలట్ దుర్మార్గం.. అతడు చేసిన దాడి తీవ్రత ఎంత పెద్దదన్న విషయంతో పాటు.. విమానాన్ని కూల్చేయటమే లక్ష్యంగా అతని ప్లాన్ ఉందన్న విషయాన్ని ప్రపంచానికి తెలిసేలా చేశారని చెప్పాలి. మొత్తంగా చూస్తే.. కెప్టెన్ స్మిత్ ను పరామర్శించిన ముగ్గురు ప్రముఖుల పరామర్శల ఒకదానితో మరొకటి సంబంధం లేని రీతిలో ఉండటం మాత్రం ఆసక్తికరం. ఇజ్రాయెల్ ప్రధాని పరామర్శ మిగిలిన వారి కంటే భిన్నంగా ఉండటమే కాదు.. కుట్ర కోణం బయటకు తెలిసేలా చేశారని చెప్పాలి.

# ఆసియా ఛాంపియన్స్ కు సీఎం విజయ్ అదిరిపోయే గిఫ్ట్స్

రాజకీయాల్లోకి కొత్తగా వచ్చినా తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ ప్రభుత్వ పాలనలో తీసుకుంటున్న నిర్ణయాలు ప్రజల మనసు గెలుచుకుంటున్నాయని అంటున్నారు. గతంలో పాలన అనుభవం లేకపోయినా, ఆయన అనుసరిస్తున్న వినూత్న విధానాలు చర్చనీయాంశం అవుతున్నాయి. కేవలం సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా, ప్రజలకు దగ్గరయ్యేలా విజయ్ నిర్ణయాలు ఉన్నాయంటూ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల ముగిసిన ఆసియా క్రీడల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పతక విజేతలతో సీఎం విజయ్ ప్రత్యేకంగా భేటీ అయ్యేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. కేవలం అభినందనలు తెలిపి, చెక్కులు అందజేసి పంపించేయకుండా, వారితో కలిసి విందు భోజనం చేస్తూ ముచ్చటించాలని సీఎం భావిస్తున్నారని చెబుతున్నారు.

**ఆసియా క్రీడల్లో అసాధారణ విజయాలు**

జపాన్ వేదికగా జరిగిన 20వ ఆసియా క్రీడలలో భారత క్రీడాకారులు అపూర్వమైన ప్రదర్శన కనబరిచారు. ఈ టోర్నమెంట్‌లో భారత్ మొత్తం 85 పతకాలను (21 స్వర్ణాలు, 26 రజతాలు, 38 కాంస్యాలు) సాధించి చరిత్ర సృష్టించింది. క్రికెట్, హాకీ, షూటింగ్, అథ్లెటిక్స్ వంటి పలు విభాగాల్లో భారత క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈ పోటీల్లో తమిళనాడుకు చెందిన క్రీడాకారులు సైతం అద్భుతమైన ప్రతభను ప్రదర్శించారు. కేవలం 18 ఏళ్ల మధురై అమ్మాయి జీ.కమలిని క్రికెట్‌లో అద్భుత ప్రదర్శనతో స్వర్ణ పతకం సాధించింది. ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం విజయ్ రూ. 75 లక్షల భారీ నజరానాను ప్రకటించారు. అలాగే అథ్లెటిక్స్ విభాగంలో విత్య రామ్‌రాజ్ (కాస్యం, స్వర్ణం), స్క్వాష్ ఆటగాళ్లు జోష్ చినప్ప, షమీనా రియాజ్, వెలవన్ సెంథిల్‌కుమార్, అభయ్ సింగ్, అలాగే రిలే పరుగులో అభినయ రాజరాజన్, విశాల్ టి.కె, రాజేష్ రమేష్ తదితరులు పతకాలు సాధించి తమిళనాడు కీర్తిని ఇనుమడింపజేశారు.

**క్రీడాభివృద్ధికి విజయ్ ప్రణాళికలు**

సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా క్రీడాకారులు పతకాలు గెలిస్తే, మంత్రులు లేదా అధికారులు ఎవరో ఒకరు వారిని ఆహ్వానించి నామమాత్రంగా సత్కరించి చేతులు దులుపుకుంటారు. కానీ సీఎం విజయ్ మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పతక విజేతలను కేవలం సత్కరించడమే కాకుండా, వారితో కలిసి భోజనం చేస్తూ.. క్రీడా రంగంలో వస్తున్న మార్పులు, అథ్లెట్లు ఎదుర్కొంటున్న సవాళ్లు, క్షేత్రస్థాయిలో మౌలిక వసతుల పరిస్థితి గురించి ఆరా తీయనున్నారు.

తమిళనాడులో క్రీడలను అట్టడుగు స్థాయి నుంచి ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చెన్నై సమీపంలో అత్యాధునిక హంగులతో కూడిన 'స్పోర్టింగ్ సిటీ'ని నిర్మించనున్నట్లు విజయ్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే. ఆసియా క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 30 లక్షల నుంచి రూ. 75 లక్షల వరకు భారీ నజరానాలు ప్రకటించడం ఆయన క్రీడాభిమానానికి నిదర్శనం అంటున్నారు. పాలనానుభవం లేదన్న విమర్శలను పక్కన పెట్టి, ప్రజా సంక్షేమంతో పాటు ఇలాంటి వినూత్న కార్యక్రమాలతో ముందుకు వెళ్తున్న సీఎం విజయ్ తీరు పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.

# నేతన్న సుస్మన్!

ఢిల్లీలోని ది కుంజ్‌లో ఆదిత్య బిర్లా సంస్థ చేపట్టిన 'ఆద్యం హ్యాండ్‌వోవెన' ప్రదర్శన చేనేత ప్రియులకు ఒక అరుదైన అనుభవమే. దేశంలోని వివిధ నేత క్లస్టర్ల నుంచి తెచ్చిన వస్త్రాలను ప్రదర్శించడమే కాకుండా, ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనెగల్ 1987లో తీసిన హిందీ చిత్రం 'సుస్మన్'ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రధాన స్రవంతి ఓటీటీ వేదికల్లో సులువుగా దొరకని సినిమాను చూపించేందుకు బెనెగల్ కుటుంబం నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్నారు. 'సుస్మన' అంటే సారం అని అర్థం. భారత చేనేత సంప్రదాయానికి పడుగుపేకల్లా నిలిచిన నేతన్నల జీవితాల గురించిన చిత్రానికి ఇంతకన్నా సరైన పేరుండదు. కానీ దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత కూడా ఆ సినిమా ఎంత ప్రాసంగికంగా ఉందో చూస్తే ఒక ఇబ్బందికరమైన ప్రశ్న ఎదురవుతుంది. నేతన్న బతుకులో నిజంగా ఏం మారింది? ఆద్యం వ్యాపార విభాగాధిపతి మనీష్ సక్సేనా మాటల్లో చెప్పాలంటే, ఆ సినిమా కాలంనుంచి చాలా మారినా, అసలు మారింది చాలా తక్కువ. ఈ అభిప్రాయం కేవలం ఒక వ్యక్తి భావన కాదు. అధికారిక గణాంకాలూ దాన్నే సమర్థిస్తున్నాయి. నాలుగో అఖిల భారత చేనేత గణన (2019-20) ప్రకారం దేశంలో సుమారు 31.45 లక్షల చేనేత కుటుంబాలు, 35.22 లక్షల మంది కార్మికులు, అనుబంధ కార్మికులున్నారు. వీరిలో 72 శాతానికి పైగా మహిళలే! అయినా ఆ గణనలో నమోదైన చేనేత కార్మిక కుటుంబాల్లో 67.1 శాతం కుటుంబాల నెలసరి ఆదాయం అన్ని మార్గాల నుంచి కలిపి రూ.5 వేల కంటే తక్కువే. మరో 26.2 శాతం కుటుంబాలు రూ.5,001 నుంచి రూ.10 వేల మధ్య సంపాదిస్తున్నాయి. అంటే పది కుటుంబాల్లో దాదాపు తొమ్మిదింటికి నెలకు రూ.10 వేలు కూడా దక్కడం లేదు. దేశ సంస్కృతికి వన్నెలద్దుతున్న చేతులకు ఇదేనా ప్రతిఫలం? నేతన్నను పొగడటం సులువు; అతనికి న్యాయమైన కూలీ ఇవ్వడం కష్టం. ప్రదర్శనశాలల్లో అద్భుతంగా కనిపించే వస్త్రం వెనుక ఉన్న శ్రమ, అప్పులు, అనిశ్చితి సామాన్య వినియోగదారుడికి కనిపించవు. 'సుస్మన'ను మళ్లీ తెరపైకి తేవడం వెనుక ఉన్న అసలు సందేశం ఇదే. కళను ఆరాధించే సమాజం, ఆ కళను సృష్టించేవారి జీవితాన్ని కూడా చూడాలి.

ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది పోచంపల్లి ఇక్కత్. తెలంగాణలోని యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి నుంచి వచ్చిన ఈ వస్త్రం జ్యామితీయ రూపకల్పనలతో ప్రసిద్ధి చెందింది. ఆచార్య వినోబా భావే భూదాన్ ఉద్యమానికి తొలి అడుగు వేసిన నేల ఇదే అని చెబుతారు. ఇక్కత్ అందం మగ్గం మీదకు రాకముందే మొదలవుతుంది. సాధారణ నేతలో డిజైన్ నేత సమయంలోనే రూపుదిద్దుకుంటే, ఇక్కత్‌లో ముందుగా నిర్ణయించిన నమూనా ప్రకారం నూలును కట్టి, అద్దకం వేస్తారు. తర్వాత ఆ రంగు దారాలను మగ్గంపై అత్యంత కచ్చితత్వంతో సరిచేస్తేనే నమూనా స్పష్టంగా ఏర్పడుతుంది. మోటిఫ్‌ల అంచుల్లో కనిపించే స్వల్ప అస్పష్టతే ఇక్కత్‌కు చేతి నేత ముద్రను ఇస్తుంది. యంత్రం తయారుచేసే నిక్కచ్చి సమరూపత దానికి లేదు, ఆ లోపమే దాని ప్రత్యేకత. ఈ సంక్లిష్ట ప్రక్రియ వల్ల పోచంపల్లిలో నేతగాళ్ల మధ్య అరుదైన భాగస్వామ్యం ఏర్పడుతుంది. నేతగాడు కట్టు, అద్దకం చేసేవారితో సమన్వయంతో పనిచేయాలి. ఇతర క్లస్టర్లలో ప్రధాన నేత పురుషులు, తేలికపాటి పనులు మహిళలు చేస్తుంటే, ఇక్కడ భార్యాభర్తలు జంటగా పనిచేసే సందర్భాలు ఎక్కువని సక్సేనా వివరించారు. ఇది మన రాష్ట్రానికీ అద్దం పడుతుంది. మంగళగిరి, ధర్మవరం, వెంకటగిరి, ఉప్పాడ వంటి ప్రాంతాల్లో కూడా నేత ఒక కుటుంబ సమష్టి కృషి. ఒకరు కండెలు చుడతారు, మరొకరు ఊక, ఇంకొకరు మగ్గం నడుపుతారు. అయినా గణనలో మహిళలను సహాయకులుగా లేదా అనుబంధ కార్మికులుగా మాత్రమే పరిగణించే ధోరణి కొనసాగుతోంది. నూలు చుట్టడం, అద్దకం, నేత వంటి కీలక పనులు చేసే మహిళల శ్రమకు గుర్తింపు, కూలీ రెండూ తక్కువే. ఇక్కత్ లాంటి సంప్రదాయాల్లో ఇద్దరి శ్రమ సమానంగా అవసరమైనప్పుడు, ఇద్దరికీ న్యాయమైన ఆదాయం దక్కాలన్న వాదనకు ఇది బలం చేకూరుస్తుంది. ఈ శ్రమను గౌరవించకుండా చేనేత వారసత్వాన్ని కాపాడతామనడం ఆత్మవంచనే అవుతుంది. అయితే ఇంతటి శ్రమసాధ్యమైన కళను బతికించుకోవడానికి మూల్యం చెల్లించాల్సిందే. ప్రీమియం దుకాణాల్లో పట్టు పోచంపల్లి చీరల ధరలు ఇప్పుడు సుమారు రూ.20 వేల నుంచి రూ.1 లక్ష వరకు ఉన్నాయి. పట్టు రకం, డిజైన్ సంక్లిష్టత, పని పరిమాణాన్ని బట్టి ధర మారుతుంది. చేనేతను అందరూ ధరించాలన్నదే దాని అసలు సారమని సక్సేనా అంటారు. కానీ పట్టు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి; మరోవైపు కనీస వేతనం ఇవ్వాల్సిన బాధ్యత ఉంది. ఇదే చేనేత రంగం ఎదుర్కొంటున్న సమకాలీన వైరుధ్యం. ధర తగ్గిస్తే నేతన్న కూలీ తగ్గుతుంది; కూలీ పెంచితే సామాన్యుడికి అందని వస్త్రం అవుతుంది. ఈ ఉచ్చు నుంచి బయటపడేందుకు ప్రభుత్వం, సంస్థలు, వినియోగదారులు ముగ్గురూ బాధ్యత పంచుకోవాలి. ముడి పట్టు, నూలు ధరల స్థిరీకరణకు సహకార వ్యవస్థను బలోపేతం చేయాలి. చేనేత పేరుతో అమ్ముడయ్యే యంత్రాల అనుకరణలను అడ్డుకోవాలి. ప్రతి ఏటా ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం మంచిదే, కానీ ఆ వేడుక ఒక రోజుకే పరిమితం కాకూడదు. చేనేత గుర్తింపు, భౌగోళిక సూచిక రక్షణ, ఆన్‌లైన్ మార్కెట్ అనుసంధానం, బీమా, ఆరోగ్య భద్రత వంటివి నేతన్నకు నిజంగా చేరుతున్నాయా అన్నది ఎప్పటికప్పుడు సమీక్షించాలి. యువతను ఈ వృత్తిలోకి ఆకర్షించాలంటే నెలకు రూ.5 వేలలోపు ఆదాయం ఉన్న రంగంలో అది సాధ్యం కాదన్నది స్పష్టం. మనీష్ సక్సేనా 1987లో ఒక ఉత్సవంలో 'సుస్మన' చూసి ప్రభావితమయ్యారు. ఆ సినిమానే తన వృత్తి ఎంపికను తీర్చిదిద్దిందని చెప్పారు. 1994లో తన తొలి జీతంతో అమ్మకు కొన్న చీరను కూడా ఆయన ఈ ప్రదర్శనలో ఉంచారు. ఒక చీర కుటుంబ జ్ఞాపకాన్ని దశాబ్దాల పాటు మోస్తుంది; ఒక నేత సంప్రదాయం సాంస్కృతిక జ్ఞాపకాన్ని శతాబ్దాల పాటు మోస్తుంది. 'సుస్మన' వచ్చి నాలుగు దశాబ్దాలు కావస్తున్న ఈ సమయంలో సవాలు మగ్గాన్ని కాపాడటం మాత్రమే కాదు. ఆ మగ్గం ముందు కూర్చున్న మనిషి దాని ద్వారా తన భవిష్యత్తును నిర్మించుకోగలిగేలా చేయడమే అసలైన లక్ష్యం. ఆ రోజు వచ్చినప్పుడే చేనేత నిజంగా బతికినట్టు లెక్క. చేనేతను కాపాడటం అంటే మగ్గాన్ని బతికించడం మాత్రమే కాదు.. ఆ మగ్గం ముందు కూర్చున్న నేతన్నకు గౌరవంగా బతికే భరోసా ఇవ్వడం. నేతన్న చేతికి న్యాయమైన కూలీ.. అతని కుటుంబానికి భద్రమైన భవిష్యత్తు దక్కినప్పుడే 'సుస్మన్' చెప్పిన సారం నిజమైన అర్థాన్ని సంతరించుకుంటుంది.

---

## పనికొచ్చే పలుకు



# సాధించిన దాన్ని సెలబ్రేట్ చేసుకో..

వీడియో గేమ్ ఆడుతున్నప్పుడు ఒక లెవెల్ దాటగానే వచ్చే ఫీలింగ్ గుర్తుందా? కొన్ని సెకన్లు కిక్కు, ఆ తర్వాత వెంటనే "నెక్స్ట్ లెవెల్ ఏంటి?" అని చూస్తాం. గేమ్‌లో ఇది సరదాగా ఉంటుంది. కానీ జీవితంలో ఇదే ఫార్ములా నడిస్తే? కొత్త జాబ్ వచ్చింది, సరే, ఇంకా పెద్ద పోస్ట్ కావాలి. సొంత బిజినెస్ మొదలైంది, సరే, ఇంకా పది బ్రాంచీలు కావాలి. ఫిట్‌నెస్ మెరుగైంది, సరే, ఇంకా సిక్స్ ప్యాక్ కావాలి. ఎంత సాధించినా, మనసులో ఒక చిన్న గొంతు గుసగుసలాడుతూనే ఉంటుంది -"ఇంకా ఏమీ సాధించలేదు, ఇంకా చాలా చేయాలి". మన బ్రెయిన్ ఒక "ఎండ్‌లెస్ స్క్రోల్" మెషిన్. ఇది మీ బలహీనత కాదు, మన మెదడు పనిచేసే తీరే ఇది. ఒక లక్ష్యాన్ని పూర్తి చేయగానే, మెదడు దాన్ని "డన్" అని మార్క్ చేసి, వెంటనే కొత్త లక్ష్యాన్ని ఎంచుకుని, ఒత్తిడి పెడుతుంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ఎలా ఒకదాని తర్వాత మరొకటి వస్తూ ఆగకుండా స్క్రోల్ చేయిస్తాయో, మన ఆశయాలు కూడా అలాగే ఒకదాని తర్వాత మరొకటి వస్తూ, మనల్ని ఎప్పటికీ "ఇంకా కావాలి" అనే మోడ్‌లోనే ఉంచుతాయి. అందుకే కొందరు కోట్లు సంపాదించినా, "నేనింకా సక్సెస్‌ఫుల్ కాలేదు" అని ఫీలవుతుంటారు. ఈ ఎండ్‌లెస్ రేస్‌లో మనం కోల్పోయేది ఏంటో తెలుసా? సాధించిన క్షణాన్ని ఆస్వాదించడం. మీరు ఎగ్జామ్ క్లియర్ చేసిన రోజు, ఫ్యామిలీ కోసం ఏదైనా కొన్న రోజు, ఎప్పటినుంచో భయపడ్డ ఒక పనిని చివరికి పూర్తి చేసిన రోజు -ఇవన్నీ సెలబ్రేట్ చేసుకోవాల్సిన క్షణాలు. కానీ మనం వాటిని "ఓకే, నెక్స్ట్" అనేసి దాటేస్తాం. దీనివల్ల ఎంత సాధించినా, లోపల ఖాళీగానే అనిపిస్తుంది, ఎందుకంటే ఆ విజయాన్ని మనసు ఎప్పుడూ "రిజిస్టర్" చేసుకోలేదు.

పాజ్ బటన్ నొక్కడం ఒక స్కిల్

ఇక్కడ పరిష్కారం ఆశయాలను వదిలేయడం కాదు, సాధించిన విజయాలను గుర్తించి, సంతోషించే అలవాటు కూడా చేసుకోవడం. దీన్ని చిన్న రొటీన్‌గా మార్చుకోవచ్చు. ఉదాహరణకు, వారానికి ఒకసారి, ఐదు నిమిషాలు తీసుకుని, ఈ వారం మీరు సాధించిన మూడు విషయాలను రాసుకోండి, అవి చిన్నవైనా సరే. నెలకు ఒకసారి, గత ఏడాది మీరు ఎక్కడున్నారో, ఇప్పుడు ఎక్కడున్నారో పోల్చి చూసుకోండి. ఒక లక్ష్యం పూర్తయినప్పుడు, వెంటనే తర్వాతి దానికి వెళ్లకుండా, కనీసం ఒక సాయంత్రం మీకు నచ్చిన పని చేస్తూ, దాన్ని సెలబ్రేట్ చేసుకోండి. ఇలాంటి చిన్న అలవాట్లు, మీ మెదడుకు "ఇది కూడా లెక్కలోకి వస్తుంది" అనే సిగ్నల్ ఇస్తాయి.

ఇలా సాధించినవాటిని గుర్తించడం అలవాటు చేసుకుంటే, మీ రోజువారీ జీవితంలో సూక్ష్మ మార్పు కనిపిస్తుంది. ఒత్తిడి తగ్గుతుంది, "ఇంకా చాలా చేయాలి" అనే నిరంతర ఆందోళన బదులు, "ఇప్పటివరకు నేను చాలా చేశాను" అనే భరోసా కలుగుతుంది. నిద్ర మెరుగుపడుతుంది. తలలో "ఏం సాధించలేదు" అనే ఆలోచనల రొద తగ్గుతుంది. చుట్టూ ఉన్నవారితో సంబంధాలు మెరుగవుతాయి. తర్వాతి లక్ష్యం వెనుక పరుగెత్తుతూ, ప్రస్తుత క్షణంలో ఉన్నవారిని పట్టించుకోకుండా ఉండరు. ముఖ్యంగా, మీ ఆశయాలపట్ల మీ ఉత్సాహం కూడా నిలకడగా ఉంటుంది, ఎందుకంటే బర్న్‌అవుట్ అయ్యే ప్రమాదం తగ్గుతుంది కనుక.

చివరిగా ఒక మాట

జీవితం ఒక రేస్ కాదు, ఒక ప్రయాణం. ప్రతి మైలురాయి దగ్గర ఒక్క క్షణం ఆగి, వెనక్కి తిరిగి "అరే, ఇంత దూరం వచ్చానా!" అని చూసుకోవడం బలహీనత కాదు, ముందుకు తీసుకెళ్లే ఇంధనం. ఎప్పుడూ ఇంకా కావాలని పరుగెత్తేవాడికి గమ్యం ఎప్పటికీ దూరంగానే ఉంటుంది, కానీ మార్గం మధ్యలో సాధించినవాటిని ఆస్వాదించేవాడికి ప్రతి అడుగూ విజయమే!

---

# కుటుంబాలు.. అప్పుల పాలు!!



భారత ఆర్థిక వ్యవస్థ గురించి రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) ఇచ్చిన ఆర్థిక స్థిరత్వ నివేదిక రెండు ముఖాలను చూపిస్తోంది. ఒకవైపు, బ్యాంకింగ్ వ్యవస్థ దశాబ్దాల్లోనే అత్యంత ఆరోగ్యకరమైన స్థితిలో ఉంది. షెడ్యూల్డ్ వాణిజ్య బ్యాంకుల స్థూల నిరర్థక ఆస్తులు (జీఎన్‌పీఏ) 2026 మార్చినాటికి 1.8 శాతానికి తగ్గాయి, బ్యాంకు రుణ వృద్ధి 11 నుంచి 14.5 శాతానికి పెరిగింది. మరోవైపు, అదే నివేదిక కొన్ని ప్రమాదకర సంకేతాలనూ వెలుగులోకి తెచ్చింది. వాటిలో అత్యంత ముఖ్యమైనది కుటుంబాల అప్పుల పెరుగుదల. 2025 సెప్టెంబర్ నాటికి దేశంలో కుటుంబాల అప్పు స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 45.5 శాతానికి చేరింది. ఇదే నివేదిక గత నివేదికలో, 2025 మార్చినాటికి ఇది 41.3 శాతంగా ఉండగా, ఐదేళ్ల సగటు 38.3 శాతమే. 2018-19లో ఇది సుమారు 33 శాతంగా ఉండేది. అంటే, కేవలం ఐదేళ్లలోనే కుటుంబాల అప్పు జీడీపీలో పదిపాయింట్లకు పైగా పెరిగింది. ఈ సంఖ్య ఒక్కటే చూస్తే, అభివృద్ధి చెందిన అనేక దేశాలతో పోలిస్తే భారత్ పరిస్థితి ఇంకా మెరుగ్గానే ఉందని, చాలా సమకాలీన వర్ధమాన ఆర్థిక వ్యవస్థల కంటే తక్కువ స్థాయిలోనే ఉందని ఆర్బీఐ స్వయంగా అంగీకరిస్తుంది. కాబట్టి ఇది తక్షణ సంక్షోభ సూచన కాదు. కానీ ఆందోళన కలిగించే అంశం అప్పు పరిమాణం కంటే, దాని స్వభావంలో వస్తున్న మార్పు. ఆర్బీఐ నివేదిక ప్రకారం, 2026 మార్చినాటికి కుటుంబాల మొత్తం రుణాల్లో గృహేతర రిటైల్ రుణాల వాటా 58.4 శాతానికి చేరింది. వినియోగ రుణాలు ఇప్పుడు కుటుంబ రుణాల్లో దాదాపు సగాన్ని ఆక్రమిస్తున్నాయి. ఈ ధోరణి గృహ, వ్యవసాయ, వ్యాపార రుణాలకంటే వేగంగా పెరుగుతోంది.

ఈ మార్పు ఎందుకు ముఖ్యమో అర్థం చేసుకోవడానికి, ఒక సాధారణ తేడాను గమనించాలి. గృహ రుణం తీసుకున్నప్పుడు, ఆ డబ్బుతో ఒక ఆస్తి సమకూరుతుంది, ఆ ఆస్తే రుణానికి భద్రతగా ఉంటుంది. కానీ వ్యక్తిగత రుణం, క్రెడిట్ కార్డ్ బకాయి, గృహోపకరణాల కొనుగోలుకు తీసుకునే రుణం వంటివి పూర్తిగా భవిష్యత్ ఆదాయంపైనే ఆధారపడతాయి. జీతం ఆగిపోతే, ఉద్యోగం పోతే, చిన్న వ్యాపారం దెబ్బతింటే, ఈ రుణాలకు మరే రక్షణా ఉండదు. నేటి గణాంకాలు ఇంకా ఒత్తిడిని చూపడం లేదన్నది నిజమే. 2026 మార్చి నాటికి సురక్షిత రిటైల్ రుణాల్లో స్థూల నిరర్థక ఆస్తులు 0.7 శాతం, అసురక్షిత రిటైల్ రుణాల్లో 1.7 శాతం మాత్రమే. కానీ అప్పు పెరిగే కొద్దీ, ఆదాయం పెరగకపోతే, ఈ సంఖ్యలు ఎంతకాలం ఇలాగే ఉంటాయన్నది ప్రశ్న! ఇక్కడ మరో ఆసక్తికరమైన, ఆందోళనకరమైన పరిణామం.. బంగారు రుణాల అనూహ్య వృద్ధి. గృహేతర రిటైల్ రుణాల్లో ఇప్పుడు అతిపెద్ద వర్గంగా మారిన బంగారు రుణాలు, 2024 మార్చి నుంచి ఏటా సగటున 42.4 శాతం వృద్ధితో పెరుగుతున్నాయి. 2026 మే నాటికి వీటి బకాయి మొత్తం రూ.5.14 లక్షల కోట్లకు చేరింది. బంగారం ధరలు పెరగడంతో, ప్రస్తుతానికి తాకట్టు పెట్టిన బంగారం విలువ రుణాలకు బలాన్నిస్తోంది. కానీ బంగారం ధరల్లో ఒక్కసారిగా తీవ్ర తగ్గుదల వస్తే, ఆ రక్షణ బలహీనపడుతుంది. ఒక సామాన్య కుటుంబం తమ ఇంట్లోని బంగారాన్ని తాకట్టు పెట్టి రుణం తీసుకోవడం, తరచూ అత్యవసర అవసరాల కోసమే జరుగుతుంది. ఇది కుటుంబాల ఆర్థిక భద్రత ఎంత బలహీనంగా ఉందో కూడా సూచిస్తుంది. అలాగే, ఫిన్‌టెక్ సంస్థల రుణ పుస్తకంలో 70 శాతానికి పైగా అసురక్షిత రుణాలేనని, బ్యాంకులు తమ రిటైల్ పోర్ట్‌ఫోలియోలను విస్తరించుకునేందుకు బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీలు) ఇచ్చిన రుణాలను కొనుగోలు చేస్తున్నాయని గత ఎడిషన్ నివేదికలో ఆర్బీఐ హెచ్చరించింది.

ఈ నివేదికపై విశ్లేషకుల విమర్శ కూడా గమనార్హం. జాతీయ స్థాయిలో కుటుంబ రుణ నిష్పత్తి నిర్వహించదగిన స్థాయిలోనే ఉన్నప్పటికీ, ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలు తిరిగి చెల్లింపులో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుండవచ్చు. ఎందుకంటే, ఒక కుటుంబం వివిధ బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, క్రెడిట్ కార్డులు, రుణ యాప్‌లు, అనధికారిక రుణదాతల నుంచి తీసుకున్న మొత్తం రుణాన్ని ఒకేచోట చూపే వ్యవస్థ సమగ్రంగా లేదు. ఫలితంగా, ప్రతి రుణదాత ఆ రుణగ్రహీతను అర్హుడిగానే పరిగణించవచ్చు, వాస్తవానికి ఆ కుటుంబం మొత్తం అప్పుల భారం భరించలేని స్థాయికి చేరినా. భారత్ వంటి దేశంలో, కుటుంబాల ఆదాయం పెరుగుదల రుణాల వృద్ధి వేగంతో సమానంగా లేకపోవడం ఇక్కడ అసలు ప్రమాదం. అప్పు తీసుకుని వినియోగం పెంచడం, తాత్కాలికంగా ఆర్థిక వ్యవస్థకు ఊపునివ్వవచ్చు. పండుగ సీజన్లలో కొనుగోలు పెరగడం, గృహోపకరణాల అమ్మకాలు పెరగడం దీనికి సూచనలు. కానీ ఈ వృద్ధి అప్పుల పునాదిపై నిలబడి ఉంటే, అది దీర్ఘకాలంలో నిలకడగా ఉండదు. ఆదాయ వృద్ధి, ఉద్యోగ కల్పన, వేతనాల పెరుగుదల -ఇవే కుటుంబాల తిరిగి చెల్లించే సామర్థ్యానికి అసలైన ఆధారం. వీటిపై ఆధారపడకుండా, కేవలం సులభంగా దొరికే రుణాలపైనే వినియోగం ఆధారపడితే, ఆర్థిక మందగమనం ఎదురైనప్పుడు ఆ ప్రభావం లక్షలాది కుటుంబాలపై ఒకేసారి పడుతుంది. ఈ నివేదికలో ఆర్బీఐ మరికొన్ని ముప్పులనూ గుర్తించింది. కృత్రిమ మేధతో కూడిన సైబర్ దాడులను సర్వే చేసిన బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు అగ్రశ్రేణి ముప్పుగా పేర్కొన్నాయి. కరెంట్-సేవింగ్స్ ఖాతాల నుంచి టర్మ్ డిపాజిట్లవైపు మళ్లడం బ్యాంకుల లాభదాయకతపై ఒత్తిడి తెస్తోంది. ప్రపంచ అస్థిరత, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, ముడిచమురు ధరలు కూడా ప్రమాదాలే. అయినప్పటికీ, కుటుంబాల అప్పు సామాన్యుల జీవితాలకు నేరుగా సంబంధించినది కాబట్టి ప్రత్యేక దృష్టికి అర్హమైనది.

ఈ పరిస్థితికి పరిష్కారమేమిటి? మొదటిది, రుణ సమాచారంలో పారదర్శకత పెంచడం. ప్రతి కుటుంబం మొత్తం అప్పును ఒకేచోట చూపే సమగ్ర క్రెడిట్ సమాచార వ్యవస్థను బలోపేతం చేయడం, తద్వారా రుణదాతలు అతిగా రుణాలివ్వకుండా నియంత్రించడం. రెండవది, ఆర్థిక అక్షరాస్యతను పెంచడం. రుణం తీసుకోవడం, క్రెడిట్ కార్డు వాడకం, 'ఇప్పుడు కొను, తర్వాత చెల్లించు' పథకాలు, తక్షణ రుణ యాప్‌ల వెనుక ఉన్న ప్రమాదాల గురించి అవగాహన కల్పించడం. మూడవది, కుటుంబాల ఆదాయ వృద్ధికి దోహదపడే ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి, వేతన పెరుగుదల విధానాలకు ప్రాధాన్యమివ్వడం. నాల్గవది, రుణదాతలు, ముఖ్యంగా కొత్తతరం ఫిన్‌టెక్ సంస్థలు, అసురక్షిత రుణాల విషయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించేలా పర్యవేక్షణను కఠినతరం చేయడం. ఆర్బీఐ ఇప్పటికే తన నివేదికలో బ్యాంకింగ్ వ్యవస్థ దృఢంగా ఉందని భరోసా ఇస్తూనే, భవిష్యత్ ఒత్తిడి సూచనలపై హెచ్చరిక ఇచ్చింది. ఈ హెచ్చరికను నిర్లక్ష్యం చేయకుండా, ప్రభుత్వం, రుణ సంస్థలు, కుటుంబాలు అందరూ తమ తమ స్థాయిలో బాధ్యత వహించాల్సిన సమయమిది. ఎందుకంటే, అప్పు ప్రమాదం అనేది ఒక్కసారిగా పేలే బాంబులా కాకుండా, నెమ్మదిగా పెరిగే ఒత్తిడిలా ఉంటుంది, అది బయటపడేసరికి నష్టం జరిగిపోయి ఉంటుంది. అందుకే ముందే జాగ్రత్త పడటం, ఆర్థిక నియంత్రణ, పొదుపు అలవాటు, అవసరానికి మించి అప్పు తీసుకోకపోవడం.. ఇవే భారత్‌లో ప్రతి కుటుంబం పాటించాల్సిన ముఖ్య సూత్రాలు! ■

---



ఉన్నతమైన వ్యక్తిత్వం ఉన్నవారికి ఇతరుల ప్రశంసలు, గుర్తింపు లేదా మెప్పు పొందాలనే ఆరాటం ఉండదు. వారు ఇతరులతో ఎప్పుడూ పోల్చుకోరు, పోటీపడరు, అసూయ పడరు. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా, ఇతరులపై ద్వేషాన్ని పెంచుకోకపోవడమే వారి గొప్పతనం. చప్పట్లు ఆగిపోయినా, పొలికల రొద వినిపించకపోయినా, తన దారిలో తాను ప్రశాంతంగా నడిచేవాడే నిజమైన ఉన్నతుడు. అలాంటివారు ఎదుటివారి వెలుగును చూసి తమ దీపాన్ని ఆర్పేసుకోరు, తమ నీడను చూసి ఇతరులను నిందించరు. ద్వేషం అనే బరువు లేనివాడే ఎంత దూరమైనా తేలికగా ప్రయాణించగలడు.

-మహాదేవ

---

## వింతల్లో వింతలు

# స్ప్రే క్యాన్‌లో 'స్మోక్ గ్రెనేడ్'




న్యూయార్క్‌లోని వాటర్‌టౌన్ ఎయిర్‌పోర్టులో ఎక్స్‌రే స్క్రీన్‌పై ఒక ఏరోసోల్ డబ్బా అనుమానాస్పదంగా కనిపించింది. టీఎస్ఏ అధికారిణి యెసేనియా అల్వారెజ్‌కు "మనసు మంచి సంకేతం ఇవ్వలేదు". బ్యాగ్ సైడ్ పాకెట్‌లోని ఆ డబ్బా తెరిచి చూస్తే, లోపల ఉపయోగించేసిన ఎం18 స్మోక్ గ్రెనేడ్! ఇదేంటని అడిగితే, ప్రయాణికుడు "అది అక్కడుందని మర్చిపోయాను" అని చెప్పాడు. కానీ బ్యాగ్‌లో ఉన్నవి కొన్ని వస్తువులే, అంత చిన్న బ్యాగ్‌లో గ్రెనేడ్ మర్చిపోవడం విచిత్రమని అధికారులు నవ్వుకున్నారు. నిపుణులు పరిశీలించి అది లైవ్ కాదని తేల్చారు. అయినా ఖాళీ గ్రెనేడ్లు కూడా చెక్‌పాయింట్ దాటవని టీఎస్ఏ తన చర్యతో ఒక హెచ్చరిక చేసింది.

# వయసు పెరిగినా ఆరోగ్యంగా ఉండాలంటే.. రోజూ ఇలా చేయండి!!





1) బ్యాలన్స్ డైట్ తీసుకోవడం



2) యాక్టీవ్ గా ఉండటం



3) నిద్రకు తగినంత సమయాన్ని కేటాయించడం



4) ఒత్తిడిని నియంత్రణలో ఉంచుకోవడం



5) క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం



PS: వృద్ధాప్యంలో కూడా ఆరోగ్యంగా ఉండాలంటే పైన పేర్కొన్న చిట్కాలను పాటించడంతో పాటు వైద్యుల సూచనలు లేనిది మందులు లేదా సప్లిమెంట్లను తీసుకోరాదు. ప్రాసెస్డ్ ఆహారాలు, ప్యాకింగ్ ఆహారాలను తగ్గించి వ్యాయామాలను రెగ్యులర్ గా చేయాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



## పైల్స్ ఉన్నోళ్లు దోశ గింజలు తింటే.. ఎంత మంచిదో తెలుసా

మీరు ఇంతకు ముందు దోసకాయ గింజలు తిన్నారా? చాలా మందికి తెలియని ఆసక్తికరమైన విషయమేమిటంటే ఈ విత్తనాలలో అనేక రకాలైన ఆరోగ్యానికి సహాయపడే కారకాలున్నాయి. దీనిలో ఫైబర్ కలిగి, యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇది భేదిమందు లక్షణాలను కలిగి ఉంటుంది. అయితే పైల్స్ సమస్యతో బాధపడే వారికి ఈ దోసకాయ గింజలను తినడం ఎంత వరకు మంచిదో ఇప్పుడు చూద్దాం.

**పేగు కదలికను వేగవంతం చేస్తాయి**

దోసకాయ గింజలు ప్రేగు కదలికను వేగవంతం చేస్తాయి. వాస్తవానికి, ఇందులో పెద్ద మొత్తంలో ఫైబర్ ఉంటుంది. ఇది కడుపులోని నీటిని గ్రహిస్తుంది, మలానికి అదనపు మొత్తాన్ని జోడించడం ద్వారా ప్రేగు కదలికను వేగవంతం చేస్తుంది. ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. పైల్స్ లక్షణాలను తగ్గిస్తుంది. నొప్పి, పేగు కదలికలలో ఉబ్బరం వంటివి కూడా తగ్గిస్తుంది.

**భేదిమందులా పనిచేస్తాయి**

దోసకాయ గింజలు భేదిమందులా పనిచేస్తాయి. అంటే పొట్టలోని మలాన్ని పలుచన చేసి సులభంగా బయటకు తీయడంలో సహాయపడుతుంది. ఈ విత్తనాలలో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ ప్రేగు కదలికలను సులభతరం చేస్తాయి, కడుపుని శుభ్రపరచడంలో సహాయపడతాయి.

# బొప్పాయిని తిన్నతర్వాత వీటిని తింటే.. ఆస్పత్రి పాలవడం ఖాయం

బొప్పాయిలో పాపైన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది పొట్టలోని పొరను ఆరోగ్యంగా ఉంచుతుంది, అనేక చర్మ సమస్యలను నయం చేస్తుంది. దాంతో పాటు కడుపుని చల్లబరచడంతో పాటు, మలబద్ధకం, పైల్స్ సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. అయితే బొప్పాయి తిన్న తర్వాత తప్పక నివారించాల్సిన కొన్ని ఆహారాలు ఉన్నాయి. అవి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు.

**బొప్పాయి తిన్న తర్వాత ఏం తినకూడదు:**

**1. బొప్పాయి తిన్న తర్వాత పాలు తాగొచ్చా..?**

బొప్పాయి తిన్న తర్వాత పాలు తాగడం మానుకోవాలి. ఎందుకంటే బొప్పాయి, పాలు రెండూ కలిసి మిమ్మల్ని మలబద్ధకం లేదా కడుపు నొప్పికి గురి చేస్తాయి. ఇది ఆకస్మిక అజీర్ణం, ఉబ్బరం, విరేచనాలకు కారణమవుతుంది. కాబట్టి బొప్పాయి తిన్న తర్వాత పాలు తాగడం మానేయాలి.

**2. బొప్పాయి తిన్న తర్వాత టీ తాగాలా?**

బొప్పాయి తిన్న తర్వాత టీ తాగడం వల్ల పాపైన్ ఎంజైమ్‌తో చర్య జరుపుతుంది. ఇది చాలా సమస్యలను కలిగిస్తుంది. దీంతో పాటు, టీ ఆకులలో కాటెచిన్లు ఉంటాయి. ఇవి పాపైన్ సమ్మేళనంతో కలిసి గ్యాస్ట్రిక్ సమస్యలను కలిగిస్తుంది.

**3. బొప్పాయి తర్వాత గుడ్డు తినొచ్చా?**

బొప్పాయి తిన్న తర్వాత కోడిగుడ్లు తినడం వల్ల చాలా ఇబ్బందులు వస్తాయి. విటమిన్ సి, పాపైన్ ఎంజైమ్‌లు సమృద్ధిగా ఉండే ఈ బొప్పాయిలో, ప్రోటీన్స్, ఒమేగా-3లో కూడా సమృద్ధిగా ఉంటాయి. ఈ రెండింటినీ ఒకేసారి తినడం వల్ల కడుపులో గందరగోళం ఏర్పడుతుంది. ఇది మిమ్మల్ని చాలా కాలం పాటు అనారోగ్యానికి గురి చేస్తుంది. అజీర్ణం, వికారం, మలబద్ధకం, వాంతులు వంటి సమస్యలను కలిగిస్తుంది.

**4. బొప్పాయి తిన్న తర్వాత పెరుగు తినాలా?**

బొప్పాయి తిన్న తర్వాత పెరుగు తినడం వల్ల శారీరకంగా హాని కలుగుతుంది. కానీ ఆయుర్వేద దృక్కోణంలో, బొప్పాయి వేడిగా ఉంటుంది, పెరుగు చాలా చల్లగా ఉంటుంది. అందుకే వీటిని కలిపి తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు, తలనొప్పి వంటి సమస్యలు వస్తాయి.

**5. బొప్పాయి తిన్న తర్వాత నిమ్మకాయ తినొచ్చా?**

బొప్పాయి, నిమ్మకాయలు కలిసి మీ శరీరంలో హిమోగ్లోబిన్ లోపాన్ని కలిగించే విష



సమ్మేళనాన్ని ఏర్పరుస్తాయి. ఈ లోపం రక్తహీనత రూపంలో ఉండవచ్చు. ఇది మిమ్మల్ని చాలా కాలం పాటు అనారోగ్యానికి గురి చేస్తుంది. కాబట్టి, బొప్పాయి తిన్న తర్వాత వీటిని తినకుండా ఉండండి.

# ఇండియా, వెస్టిండీస్‌కు బిగ్ షాక్.. రెండు జట్లకు ఐసీసీ భారీ జరిమానా



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియా, వెస్టిండీస్ జట్లకు బిగ్ షాక్ తగిలింది. ఇటీవల ముగిసిన వన్డే సిరీస్?లో భాగంగా న్యూచండీగఢ్ వేదికగా జరిగిన చివరిదైనా మూడో వన్డేలో స్లో ఓవర్ రేటింగ్ కారణంగా ఇరుజట్లకు ఐసీసీ జరిమానా విధించింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఇండియాకు 20 శాతం, వెస్టిండీస్?కు 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత విధించారు. ఈ మ్యాచులో భారత్, వెస్టిండీస్ ఇరుజట్లు నిర్ణీత సమయంలోగా బౌలింగ్ కోటాను పూర్తి చేయలేదని ఆన్-ఫీల్డ్ అంపైర్లు జయరామన్ మదనగోపాల్, సామ్ నోగాజ్స్కి, థర్డ్ అంపైర్ షర్ఫుద్దౌలా, ఫోర్త్ అంపైర్ వీరేందర్ శర్మ ఐసీసీకి ఫిర్యాదు చేశారు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వెస్టిండీస్ కెప్టెన్ షై హోప్ ఇద్దరూ తమ తప్పును అంగీకరించారు. దీంతో ఎలాంటి అధికారిక విచారణ లేకుండానే మ్యాచ్ రెఫరీ ప్రకాష్ భట్ జరిమానా విధించారు.

ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం నిర్ణీత సమయం కంటే ఆలస్యంగా వేసే ప్రతి ఓవర్‌కు ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో 5 శాతం చొప్పున పెనాల్టీ విధిస్తారు. భారత్ నాలుగు ఓవర్లు, వెస్టిండీస్ రెండు ఓవర్లు ఆలస్యంగా వేసినట్లు తేలింది. దీంతో గిల్ సేనకు 20 శాతం, వెస్టిండీస్? ఆటగాళ్లకు 10 శాతం మ్యాచ్ ఫీజులో కోత పడింది.

### వన్డే సిరీస్ ఇండియా వశం..!

భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన మూడు వన్డేల సిరీస్?ను టీమిండియా 2-1 తేడాతో దక్కించుకుంది. సిరీస్‌లోని తొలి రెండు వన్డేలను గెలిచిన భారత్ మూడవ వన్డేలో ఓటమి పాలైంది. న్యూ చండీగఢ్ వేదికగా జరిగిన చివరి వన్డేలో పర్యాటక జట్టు విజయం సాధించింది. కేఎల్ రాహుల్ సూపర్ సెంచరీ సాధించిన ఇండియా ఓటమి పాలైంది.

# 2027 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యంత కీలకం: దినేశ్ కార్తీక్

- కెప్టెన్ గిల్‌కు రోహిత్ అనుభవం, సలహాలు ఎంతో ఉపయోగపడతాయన్న దినేశ్
- ఒత్తిడి సమయాల్లో గిల్.. రోహిత్‌పైనే ఆధారపడతాడని కార్తీక్ జోస్యం
- దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియాలో జరగనున్న 2027 ప్రపంచకప్
- వన్డేల్లో తనకు ఇంకా పని మిగిలి ఉందని రోహిత్ ఇటీవలే చెప్పిన వైనం



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు సీనియర్ ఓపెనర్ రోహిత్ శర్మ సేవలు అత్యంత కీలకం కానున్నాయని టీమిండియా మాజీ వికెట్ కీపర్-బ్యాటర్ దినేశ్ కార్తీక్ అభిప్రాయపడ్డాడు. రోహిత్ శర్మ అపారమైన అనుభవం, ప్రస్తుత ఫామ్ జట్టుకు అతిపెద్ద బలమని, ముఖ్యంగా యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు అతని మార్గదర్శకత్వం ఎంతో అవసరమని కార్తీక్ పేర్కొన్నాడు.వెస్టిండీస్‌తో జరుగుతున్న ప్రస్తుత సిరీస్‌ను దినేశ్ కార్తీక్ ఉదాహరణగా చూపించాడు. గువాహటిలో జరిగిన మ్యాచ్‌లో ఛేజింగ్ సమయంలో రోహిత్ శర్మ సాధించిన సెంచరీ అతని ఫామ్‌కు నిదర్శనమని ప్రశంసించాడు. ఆటలో ఎదురయ్యే తీవ్ర ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కోవడంలో రోహిత్ అనుభవం గిల్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నాడు.ఈ విషయంపై కార్తీక్ మాట్లాడుతూ.. "ఒక కెప్టెన్‌గా, నాయకుడిగా ఆటలో ఉత్కంఠభరితమైన క్షణాల్లో రోహిత్ ఇచ్చే సలహాలు అమూల్యమైనవి. ముఖ్యంగా ఒక పెద్ద మ్యాచ్‌లో, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కచ్చితంగా రోహిత్ వైపే చూస్తాడని, అతనిపైనే ఆధారపడతాడని నేను భావిస్తున్నాను" అని స్పష్టం చేశాడు. సీనియర్ ఆటగాడిగా, మాజీ కెప్టెన్‌గా జట్టులో రోహిత్ పోషించే పాత్ర కీలకమని పేర్కొన్నాడు.కాగా, వన్డే ఫార్మాట్‌లో తనకు ఇంకా 'పని మిగిలి ఉంది' అని, 2027 ప్రపంచకప్‌లో ఆడాలనే తన కోరికను రోహిత్ శర్మ ఇటీవల బహిరంగంగా వెల్లడించాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నమెంట్‌లో ఆడటమే లక్ష్యంగా హిట్ మ్యాన్ ముందుకు సాగుతున్నాడు. వన్డేల్లో నిలకడగా పరుగులు సాధిస్తుండటంతో, రాబోయే ప్రపంచకప్ కోసం భారత జట్టు రూపొందించే ప్రణాళికల్లో రోహిత్ శర్మ కేంద్ర బిందువుగా కొనసాగుతున్నాడు.

# గంగూలీ కెప్టెన్సీలో టీమిండియా లక్ష్యం అదే.. సెహ్వాగ్ ఆసక్తికర వ్యాఖ్యలు



- గంగూలీ జట్టు లక్ష్యం విదేశాల్లో ఎక్కువ విజయాలేనన్న సెహ్వాగ్
- అప్పటి జట్టు ఆ లక్ష్యాన్ని సాధించిందని వ్యాఖ్య
- ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాట్లాడలేనన్న సెహ్వాగ్
- మ్యాచ్ పరిస్థితికి తగ్గట్టే తన ఆట మార్చేవాడినని వివరణ
- అవసరమైతే రక్షణాత్మకంగా ఆడానని వెల్లడి

**హైదరాబాద్ పెన్ పవర్:** సౌరవ్ గంగూలీ నాయకత్వంలో టీమిండియా ఎలా ఆడేదో మాజీ క్రికెటర్ వీరేంద్ర సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు. విదేశీ గడ్డపై వీలైనన్ని మ్యాచ్‌లు గెలవాలన్నదే అప్పటి జట్టు ప్రధాన లక్ష్యమని చెప్పాడు. ప్రస్తుత టీమిండియా ఆటతీరుపై మాత్రం తాను మాట్లాడలేనని స్పష్టం చేశాడు.'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్ ప్రచార కార్యక్రమంలో భాగంగా సెహ్వాగ్ ఐఏఎన్ఎస్‌తో మాట్లాడాడు. ఈ సందర్భంగా అప్పటి జట్టు ఆలోచనా విధానాన్ని వివరించాడు. "నేను దాదా నాయకత్వంలోని జట్టులో ఉన్నాను. కాబట్టి ఆ జట్టు ఆలోచనా విధానం గురించి చెప్పగలను. ప్రస్తుత జట్టులో నేను లేను. వారి ఆటతీరు గురించి నాకు పూర్తిగా తెలియదు. అందుకే దానిపై మాట్లాడలేను" అని సెహ్వాగ్ అన్నాడు.గంగూలీ నాయకత్వంలో తమ ప్రధాన లక్ష్యం అంతర్జాతీయ మ్యాచ్ లలో ఎక్కువగా గెలవడమేనని చెప్పాడు. విదేశీ గడ్డపై విజయాలు

సాధించడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెలిపాడు. ఆ లక్ష్యాన్ని జట్టు సాధించిందని సెహ్వాగ్ గుర్తు చేసుకున్నాడు.తాను ఎప్పుడూ దూకుడుగా ఆడేవాడిని కాదని కూడా సెహ్వాగ్ గతంలో చెప్పిన విషయాన్ని ప్రస్తావించాడు. మ్యాచ్ పరిస్థితిని బట్టి తన ఆటతీరును మార్చుకునేవాడినని తెలిపాడు. అవసరమైనప్పుడు రక్షణాత్మకంగా కూడా ఆడానని చెప్పాడు.సెహ్వాగ్, సచిన్ టెండూల్కర్ ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో అత్యంత ప్రమాదకరమైన ఓపెనింగ్ జోడీల్లో ఒకటిగా నిలిచింది. ఇద్దరూ కలిసి టీమిండియా ఎన్నో విజయాల్లో కీలక పాత్ర పోషించారు.'రైజ్ అండ్ ఫాల్' రెండో సీజన్‌కు సెహ్వాగ్ హోస్ట్‌గా వ్యవహరిస్తున్నాడు. గత సీజన్‌లో ఈ బాధ్యతలు నిర్వహించిన అష్నీర్ గ్రోవర్ స్థానంలో అతడు వచ్చాడు. ఈ రియాలిటీ షోలో 15 మంది కంటెస్టెంట్లు 42 రోజుల పాటు పోటీపడతారు. అధికారాన్ని దక్కించుకోవడం, వ్యూహాలు, పొత్తులు ఈ ఆటలో కీలకంగా ఉంటాయి. ఈ షో అమెజాన్ ఎంఎక్స్ ప్లేయర్‌లో ప్రసారం అవుతోంది.

# వారణాసి.. ఎంత చెప్పాలో అంతే..



కలలు కనే డీప్-రెడ్ వెల్వెట్ లుక్‌లో యుక్తి తరేజా స్టన్స్

రాజమౌళి సినిమా అంటే షూటింగ్ మొదలైనప్పటి నుంచి రిలీజ్ వరకు ఒక ఐరన్ కాంపౌండ్ లాంటి సెక్యూరిటీ ఉంటుంది. బాహుబలి, ఆర్ఆర్ఆర్ టైమ్ లో ఎవరెంత మాట్లాడాలో ఆయన కంట్రోల్ లోనే ఉండేది. కానీ మహేష్ బాబుతో చేస్తున్న 'వారణాసి' ప్రాజెక్ట్ విషయంలో మాత్రం సీన్ పూర్తిగా రివర్స్ అయింది. సినిమా గురించి టీమ్ నుంచి చిన్న చిన్న అప్డేట్స్ రెగ్యులర్ గా బయటకు రావడం ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది.



ఈ సినిమా బ్యాక్ డ్రాప్ పై అసలు హింట్ మొదట రైటర్ విజయేంద్ర ప్రసాద్ నుంచే వచ్చింది.

ఇది ఆఫ్రికన్ ఫారెస్ట్ నేపథ్యంలో సాగే అడ్వెంచర్ అని ఆయన చెప్పగా.. ఆ తర్వాత స్వయంగా రాజమౌళే గ్లోబ్ ట్రాటింగ్ అడ్వెంచర్ అంటూ ఒక క్లారిటీ ఇచ్చేశాడు. దీనికి తోడు మహేష్ బాబు కూడా ఆఫ్రికా షెడ్యూల్స్, అడవుల్లో షూటింగ్ ఎక్స్ పీరియన్స్ గురించి ఓపెన్ గా మాట్లాడటంతో సినిమా థీమ్ ఏంటనేది జనాలకు ఈజీగా అర్థమైపోయింది.

మరోవైపు ఎప్పుడూ తన పనేదో తాను సైలెంట్ గా చేసుకుపోయే సంగీత దర్శకుడు కీరవాణి కూడా ఈసారి తన పంథా మార్చారు. సినిమాలో మొత్తం ఆరు పాటలు ఉంటాయని, మ్యూజిక్ వర్క్ ఎంతవరకు వచ్చిందో కచ్చితమైన వివరాలు బయటపెట్టారు. గతంలో జక్కన్న సినిమాల్లో సాంగ్స్ కౌంట్ రిలీజ్ టైమ్ వరకు సస్పెన్స్ గానే ఉండేది. కానీ ఏకంగా 2027 సమ్మర్ రిలీజ్ టార్గెట్ అంటూ కీరవాణి ముందే ప్రకటించడం అందరినీ ఆశ్చర్యపరిచింది.ఇక యాక్షన్ ఎపిసోడ్స్ మీద రీసెంట్ గా ఎస్ఎస్ కార్తికేయ ఇచ్చిన హైప్ అంతా ఇంతా కాదు. ఆర్ఆర్ఆర్, బాహుబలిని మించేలా సీట్ ఎడ్జ్ యాక్షన్ ఉంటుందని ఆయన చెప్పగా.. తన క్యారెక్టర్ లో కూడా హెవీ స్టంట్స్ ఉంటాయని హీరోయిన్ ప్రియాంక చోప్రా ముందే ఒక క్లూ ఇచ్చింది. ఇలా టీమ్ లోని ఒక్కొక్కరు ఒక్కో పాయింట్ ను రివీల్ చేస్తుండటంతో, ప్రేక్షకుడి మైండ్ లో 'వారణాసి' కాన్వాస్ పై ఒక స్ట్రాంగ్ ఇమేజ్ క్రియేట్ అయిపోయింది.అయితే బయటపడుతున్న ఈ విషయాలన్నీ కథను డ్యామేజ్ చేసే లీకులు ఏమాత్రం కాదు. ఎవరెన్ని చెప్పినా మహేష్ మెయిన్ క్యారెక్టరైజేషన్, అసలు కాన్ఫ్లిక్ట్, స్టోరీలో వచ్చే మేజర్ ట్విస్టులు మాత్రం ఇంకా రాజమౌళి లాకర్ లోనే సేఫ్ గా ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే జక్కన్న ఈసారి కండిషన్స్ కు కాస్త బ్రేక్ ఇచ్చి, సినిమా బజ్ ను ఎప్పుడూ పీక్స్ లో ఉంచేలా పక్కా క్యాలిక్యులేటెడ్ గానే ఈ ఇన్ఫర్మేషన్ ను వదులుతున్నట్లు అనిపిస్తోంది.గతంలో రాజమౌళి సినిమాల చిన్న అప్డేట్ కోసం ఫ్యాన్స్ నెలల తరబడి వెయిట్ చేసేవాళ్లు. కానీ ఇప్పుడు గ్లోబల్ మార్కెట్ ను టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో, సినిమా గురించి కంటిన్యూస్ గా బజ్ ఉండడం అవసరం. అందుకే రాజమౌళి లిమిట్స్ సడలించి, ప్రమోషన్ కు ఉపయోగపడే కంటెంట్ ను టీమ్ ద్వారానే బయటకు రప్పిస్తున్నారు. దీంతో వారణాసి పేరు ఎప్పుడూ ట్రెండింగ్ లో ఉండేలా మాస్టర్ ప్లాన్ వేశారని అర్థమవుతోంది.



హెబ్బా పటేల్ యొక్క రొమాంటిక్ రెడ్ గౌన్ లుక్ స్వచ్ఛమైన సొగసుగా ఉంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965